RNI TELTEL/2024/89620

# నేటి శుభోదయం

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

Gk MEDIA

పచురణ : హైదరాబాద్, రంగారెడ్డి, సంపుటి 01, సంచిక 253, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8 శుక్రవారం - 13 - డిసెంబర్ - 2024 , వెల రూ.5/-

## 'వన్ నేషన్ - వన్ ఎలెక్షన్'కు కేంద్ర కేబినెట్ ఆమోదం




మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశం జమిలికి ఆమోదముద్ర వేసిన కేబినెట్ ఈ పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెట్టే అవకాశం

## ట్రంప్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి చైనా అధ్యక్షుడికి ఆహ్వానం




వచ్చే ఏడాది జనవరి 20న అగ్రరాజ్యానికి 47వ అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో తనకు మంచి సంబంధాలు ఉన్నాయి

## 12 మంది మావోయిస్టులు మృతి

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్..




పోలీసులు, మావోయిస్టులకు మధ్య భీకర ఎదురుకాల్పులు దంతేవాడ, నారాయణపూర్ సరిహద్దుల్లోని దక్షిణ అబూజ్‌మడ్ అడవుల్లో భద్రతా సిబ్బంది మావోయిస్టుల కోసం గాలింపు


## ప్రభుత్వ పాలన పట్ల 100 శాతం ప్రజలు సంతోషంగా ఉంటారనుకోవడం లేదు




- ప్రజాస్వామ్యం అంటేనే కొంత వ్యతిరేకత ఉంటుందన్న భట్టి విక్రమార్క
- 50 శాతానికి పైగా ప్రజలు పాలన పట్ల సంతృప్తికరంగా ఉన్నారన్న డిప్యూటీ సీఎం
- కేబినెట్ విస్తరణపై అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని వెల్లడి

# సంక్రాంతి నుంచి కాంగ్రెస్‌లో జోష్

- షార్ట్ లిస్ట్ రెడీ.. సంక్రాంతికి విడుదల..!
- ఢిల్లీకి చేరిన తెలంగాణ కాంగ్రెస్ రాజకీయం
- ఎమ్మెల్యేల సంఖ్య ప్రకారం ఇంకా ఆరుగురు కొత్త వారికి కేబినెట్‌లో చోటుకి అవకాశం
- రాహుల్ గాంధీని కలిసి కేబినెట్ విస్తరణపై చర్చించారు
- సీఎం, డిప్యూటీ సీఎం ఢిల్లీ టూర్ల నేపథ్యంలో సంక్రాంతి నుంచి పూర్తి సైన్యంతో సీఎం రేవంత్ రెడ్డి పాలన పరుగులు



హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో ఆరుగురు అదృష్టవంతులు ఎవరో మరికొద్ది రోజుల్లో తేలిపోనుంది. అన్నీ కుదిరితే సంక్రాంతికి తెలంగాణ కేబినెట్‌లో కొత్త అమాత్యులు చేరబోతున్నారు. ఇందు కోసమే సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి ఢిల్లీ పర్యటనకు వెళ్లారని చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. ఇప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి సహా మరో 11 మంది మంత్రులతోనే రేవంత్ సర్కార్ నడుస్తోంది. ఇంకా మరో ఆరుగురికి కేబినెట్‌లో అవకాశం ఉంది. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ప్రతీ సారి క్యాబినెట్ విస్తరణ జరుగుతుందని బాగా ప్రచారం జరిగింది. కానీ ఇతర రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా కాంగ్రెస్ హైకమాండ్ ఆదిశగా అడుగులు లేయలేదు. కొత్త యేడాదిలో సరికొత్త జోష్‌తో తెలంగాణ ప్రభుత్వాన్ని నడిపిస్తానని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. సీఎం ప్రకటనకు తగినట్టుగానే సంక్రాంతిలోపే కేబినెట్ విస్తరణ కోసం తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా ఆలోచిస్తోంది. ఇప్పటికే ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో కేబినెట్ విస్తరణపై కాంగ్రెస్ హైకమాండ్ కూడా ఫోకస్ పెట్టింది. దీంతో తెలంగాణ కాంగ్రెస్ రాజకీయం ఢిల్లీకి చేరింది. కేబినెట్‌లో కొత్త ముఖాల జాబితా షార్ట్ లిస్ట్ చేసుకుని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఢిల్లీలో అధిష్టానం ముందు ఉంచారు. ఇప్పటికే రాహులత్ గాంధీని కలిసి కేబినెట్ విస్తరణపై చర్చించారు. తమ అనుచరులకు కేబినెట్ బెర్తులు ఇవ్వాలని మిగతా..2లో



## అక్రమమని తెలిసి కూడా అనుమతులు ఎలా ఇస్తారు..



అధికారుల తీరుపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం!

అక్రమ నిర్మాణాలంటూ కూల్చివేయడం ఏంటన్న కోర్టు


నిర్మాణాలను కూల్చివేసినందుకు నష్టపరిహారాన్ని అధికారుల నుంచి రాబట్టాలని ఘాటు వ్యాఖ్య మిగతా..2లో

## 'లగచర్ల' రైతుకు బేడీలు వేసి ఆసుపత్రికి తీసుకెళ్లడంపై తీవ్రంగా స్పందించిన రేవంత్ రెడ్డి



సంగారెడ్డి జైల్లో వైద్య పరీక్షల సమయంలో రైతుకు ఛాతినొప్పి వైద్యం కోసం జైలు నుంచి ఆసుపత్రికి తరలించిన జైలు అధికారులు ఆసుపత్రికి తరలించే సమయంలోనూ బేడీలు వేయడంపై సీఎం ఆగ్రహం మిగతా..2లో

## సోరస్, అదానీ అంశాలపై లోక్‌సభలో గందరగోళం




- ప్రశ్నోత్తరాల సమయం పూర్తి అయిన తర్వాత.. జీరో అవర్‌లో ప్రతిష్టంభన మొదలైంది.
- అమెరికా వ్యాపారవేత్త జార్జ్ సోరస్‌తో కాంగ్రెస్ పార్టీకి లింకు ఉన్నట్లు బీజేపీ ఆరోపించగా, అదానీ అంశంపై చర్చ చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్

## ఆరు నెలలు పూర్తి చేసుకున్న కూటమి ప్రభుత్వం...




పబ్లిసిటీ కంటే రియాలిటీకే ప్రాధాన్యమన్న లోకేశ్

ఏపీలో జూన్ 12న కొలువుదీరిన కూటమి ప్రభుత్వం

ఆరు నెలలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంత్రి లోకేశ్ స్పందన

రాష్ట్ర పునర్ నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వెల్లడి

రాష్ట్రమే ఫస్ట్... ప్రజలే ఫైనల్ అనే నినాదమే తమ విధానమని స్పష్టీకరణ



## మళ్లీ గెలిపిస్తే ప్రతి మహిళకు నెలకు రూ.2,100 ఇస్తాం.. కేజ్రీవాల్ హామీ


- సీఎం అతిశీతో కలిసి ఓ కార్యక్రమంలో పాల్గొన్న కేజ్రీవాల్
- రూ.2,100 మహిళ ఖాతాల్లోకి నేరుగా జమ చేస్తామని వెల్లడి
- కొందరు మహిళల అభ్యర్థన మేరకు ఈ హామీ ఇచ్చినట్టు వెల్లడి మిగతా..2లో

## తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు పెన్షన్...

జిల్లా కలెక్టర్లతో సీఎం చంద్రబాబు సమావేశం

నేడు రెండో రోజున కీలక నిర్ణయం

తల్లిదండ్రులు లేని చిన్నారులను మూడు నెలల్లో గుర్తించాలన్న సీఎం



అమరావతి: ఏపీ సీఎం చంద్రబాబు మానవతా దృక్పథంతో ఆలోచించి కీలక నిర్ణయం తీసుకున్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు పెన్షన్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతో రెండో రోజు కూడా సీఎం చంద్రబాబు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగానే, తల్లిదండ్రులు లేని పిల్లల పరిస్థితి పట్ల కలెక్టర్లతో చర్చించారు. రాష్ట్రంలో తల్లిదండ్రులు లేని పిల్లలను గుర్తించే ప్రక్రియ 3 నెలల్లో పూర్తి చేయాలని, వారికి నెలనెలా పెన్షన్ అందించాలని స్పష్టం చేశారు. ప్రతి ఏటా ఇలాంటి పిల్లల జాబితాను అప్ డేట్ చేయాలని సూచించారు.

# మూడు దశల్లో రూ.84,700 కోట్లు..




మనసంతా విశాఖపైనే..

చంద్రబాబు సర్కార్ ఫుల్ ఫోకస్..

జపాన్ కంపెనీ నిప్పన్ స్టీల్స్ జాయింట్ వెంచర్

గూగుల్‌తో ప్రభుత్వం కీలక ఒప్పందం

అమరావతి: స్టీల్ సిటీని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దేందుకు శరవేగంగా అడుగులు వేస్తోంది. ఓ వైపు అమరావతి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న ఏపీ ప్రభుత్వం.. ఇంకోవైపు మనసంతా విశాఖే అని చాటుకుంటోంది. ప్రకృతి సోయగాలకు నిలయమైన సుందర నగరాన్ని.. అన్ని రంగాల్లో దూసుకెళ్లేలా వ్యూహాలు రచిస్తోంది. మొన్న టీసీఎస్.. నిన్న గూగుల్‌తో ఎంవోయూ.. ఇంకోవైపు పారిశ్రామిక హబ్‌గా మార్చేందుకు ప్రణాళికలు. హెచ్‌పీసీఎల్, ఎన్టీపీసీ హైడ్రో పవర్ లాంటి వాటిలో లక్షల కోట్ల పెట్టుబడులు. వీటితో పాటు టూరిజం, ఫార్మా అన్ని రకాలుగా విశాఖకు పెద్దపీట వేస్తోంది చంద్రబాబు ప్రభుత్వం. స్టీల్ సిటీని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దేందుకు శరవేగంగా అడుగులు వేస్తోంది. ఓ వైపు అమరావతి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న ఏపీ ప్రభుత్వం.. ఇంకోవైపు మనసంతా విశాఖే అని చాటుకుంటోంది. ప్రకృతి సోయగాలకు నిలయమైన సుందర నగరాన్ని.. అన్ని రంగాల్లో దూసుకెళ్లేలా వ్యూహాలు రచిస్తోంది.

మూడు దశల్లో రాబోతున్న ప్రాజెక్ట్‌కి రూ. 84,700కోట్లు..

NTPC, AP GENCO ల ఫిఫ్టీ ఫిఫ్టీ భాగస్వామ్యంతో గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ నిర్మాణం కాబోతుంది. మూడు దశల్లో రాబోతున్న ప్రాజెక్ట్‌కు 84,700 కోట్ల రూపాయల పెట్టుబడులు రాబోతున్నాయి. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 25 వేల మందికి ఉపాధి దొరకనుంది. గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నామంటోన్న మిగతా..2లో

శుభోదయ



## 'వన్ నేషన్ - వన్ ఎలెక్షన్'కు కేంద్ర కేబినెట్ ఆమోదం

ఢిల్లీ: జమిలి ఎన్నికల(వన్ నేషన్ - వన్ ఎలెక్షన్)కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జమిలికి ఆమోదముద్ర వేసింది. ఈ పార్లమెంటు సమావేశాల్లోనే దీనికి సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయి. దేశంలో వేర్వేరుగా ఎన్నికలు జరుగుతుండటం... దేశ ప్రగతికి ఆటంకంగా పరిణమిస్తోందని ఎన్డీయే ప్రభుత్వం తొలి నుంచి వాదిస్తున్న సంగతి తెలిసిందే. జమిలి ఎన్నికలకు సంబంధించి మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ నేతృత్వంలో అత్యున్నత స్థాయి కమిటీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 18,626 పేజీల నివేదికను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు అందజేసింది. తొలి దశలో లోక్ సభ, అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించాలని... ఆ తరువాత 100 రోజుల్లో రెండో దశలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని కోవింద్ కమిటీ సిఫారసు చేసింది.

### ట్రంప్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి

## చైనా అధ్యక్షుడికి ఆహ్వానం

అమెరికా : అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. వచ్చే ఏడాది జనవరి 20న అగ్రరాజ్యానికి 47వ అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టబోతున్నారు. ఈ కార్యక్రమానికి ప్రపంచ దేశాధినేతలు హాజరుకానున్నారు. ఈ మేరకు ఇప్పటికే ఆహ్వానాలు కూడా పంపుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కు కూడా ఆహ్వానం పంపినట్లు తెలిసింది. ట్రంప్ అధ్యక్ష బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి రావాల్సిందిగా జిన్‌పింగ్‌ను ఆహ్వానించినట్లు సమాచారం. నవంబర్‌లోనే ఆహ్వానం పంపినట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా పేర్కొంటోంది. అయితే, ఈ వార్తలపై వాషింగ్టన్‌లోని చైనా రాయబార కార్యాలయం ఇప్పటి వరకూ స్పందించలేదు. ఇదిలా ఉండగా.. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని ట్రంప్ ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో వెల్లడించిన విషయం తెలిసిందే.

## 12 మంది మావోయిస్టులు మృతి

బస్తర్: ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టులకు మధ్య భీకర ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు మృతిచెందారు. దంతేవాడ, నారాయణపూర్ సరిహద్దుల్లోని దక్షిణ అబూజ్‌మడ్ అడవుల్లో భద్రతా సిబ్బంది మావోయిస్టుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులకు ఎదురుపడిన మావోయిస్టులు కాల్పులకు పాల్పడ్డారు. ప్రతిగా భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో మావోయిస్టులు మరణించారు. గురువారం ఉదయం 3 గంటల నుంచి ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయని బస్తర్ పోలీసులు వెల్లడించారు. కూంబింగ్‌లో నారాయణపూర్, దంతేవాడ, జగదల్‌పూర్, కొండగాల్ జిల్లా భద్రతా బలగాలతోపాటు డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, సీఆర్‌పీఎఫ్ బలగాలు పాల్గొన్నాయి. కాగా, నవంబర్ 30న ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చెల్పాక-ఐలాపూర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్ జరిగిన విషయం తెలిసిందే. మావోయిస్టులు, పోలీసులకు మధ్య భీకరపోరులో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు. ఇందులో ఒకరు మహిళా మావోయిస్టు ఉన్నారు. రెండు ఏకే 47 తుపాకులతోపాటు మరో ఐదు ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో ఆరుగురు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు కాగా, తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రాణాపూర్ గ్రామానికి చెందిన ఏగోలపు మల్లయ్య ఉన్నారు.

## అక్రమమని తెలిసి కూడా అనుమతులు ఎలా ఇస్తారు..

హైదరాబాద్: అక్రమమని తెలిసి కూడా అనుమతులు ఇచ్చి.. ఆ తర్వాత అక్రమ నిర్మాణాలంటూ కూల్చివేయడం ఏంటని తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అలాంటప్పుడు ఆ అనుమతులు ఇచ్చిన అధికారులే నష్టపరిహారం చెల్లించాలని ఆదేశాలు జారీ చేయాల్సి ఉంటుందని న్యాయస్థానం ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఇకపై అక్రమ నిర్మాణాల కూల్చివేతల విషయంలో వాటికి అనుమతులు ఇచ్చిన అధికారుల ఆస్తుల జప్తుకు ఆదేశించాల్సి ఉంటుందని హైకోర్టు వ్యాఖ్యానించింది. రంగారెడ్డి జిల్లా పరిధిలోని శంషాబాద్ మండలం నర్కుడ గ్రామంలోని మంగర్షి కుంట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్న నిర్మాణాలను తొలగించాలంటూ ఇరిగేషన్ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఆ నోటీసులను సవాల్ చేస్తూ సచిన్ జైస్వాల్‌తో పాటు మరో ఇద్దరు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై బుధవారం జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టారు. అనుమతులు తీసుకుని నిర్మించుకున్న రేకుల ఇళ్లను కూల్చివేయడానికి ప్రయత్నిస్తున్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ఈ మేరకు నీటిపారుదల శాఖ అధికారి ఈ నెల 4న గోడకు నోటీసులు అతికించినట్లు తెలిపారు. ఏడు రోజుల్లోగా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్న నిర్మాణాలను తొలగించాలని అందులో పేర్కొన్నారన్నారు. తమ నిర్మాణాల విషయంలో అధికారులు జోక్యం చేసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని న్యాయవాది కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. అనుమతులతో నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేస్తామంటే ఎలాగని నిలదీశారు. ఇరిగేషన్, మున్సిపల్, పంచాయతీ అధికారులు జీఓ 168 ప్రకారం అనుమతులు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. చెరువుల పరిరక్షణ కోసం అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలంటూ సుప్రీంకోర్టు కూడా ఉత్తర్వులు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేసిన న్యాయమూర్తి.. అలాగని నిబంధనలను ఉల్లంఘించరాదని చెప్పారు. ఇరిగేషన్ అధికారులు జారీ చేసిన నోటీసులపై పిటిషనర్లు 15 రోజుల్లోగా అన్ని ఆధారాలు, పత్రాలతో సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. ఈలోగా నోటీసులపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశాలు జారీ చేశారు.

## 'లగచర్ల' రైతుకు బేడీలు వేసి ఆసుపత్రికి తీసుకెళ్లడంపై తీవ్రంగా స్పందించిన రేవంత్ రెడ్డి

హైదరాబాద్: లగచర్ల దాడి కేసులో నిందితుడు ఈర్యా నాయక్‌కు ఛాతీ నొప్పి రాగా... అతనిని జైలు నుంచి ఆసుపత్రికి తరలించే సమయంలో చేతికి బేడీలు వేయడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఈర్యా నాయక్ సంగారెడ్డి జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. జైల్లో వైద్య పరీక్షల సమయంలో అతనికి ఛాతిలో నొప్పి వచ్చింది. దీంతో అతనిని తొలుత సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ రైతుకు గుండెపోటు రావడంతో పంజాగుట్టలోని నిమ్స్‌కు తరలించారు. నిమ్స్ ఎమర్జెన్సీ విభాగంలో అతనికి చికిత్స అందిస్తున్నారు. ఈర్యా నాయక్‌కు బేడీలు వేసి తీసుకుపోవడంపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుకు బేడీలు వేసి ఆసుపత్రికి తీసుకెళ్లాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఈ ఘటనపై ఆరా తీశారు. విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఈర్యా నాయక్‌కు మెరుగైన వైద్యం అందించాలని సీఎం ఆదేశించారు.

## ప్రభుత్వ పాలన పట్ల 100 శాతం ప్రజలు సంతోషంగా ఉంటారనుకోవడం లేదు

హైదరాబాద్: ప్రభుత్వ పాలన పట్ల 100 శాతం ప్రజలు సంతోషంగా ఉంటారని తాను భావించడం లేదని తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రజాపాలన పట్ల ఎక్కువమంది ప్రజలు మాత్రం సంతోషంగా ఉంటారని భావిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యం అంటేనే ఎంతో కొంత వ్యతిరేకత ఉంటుందన్నారు. తమ ఏడాది పాలనపై రాష్ట్రంలోని 50 శాతానికి పైగా ప్రజలు సంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఆక్రమణలను ఆపేందుకే హైడ్రా అన్నారు. హైడ్రాకు పేద, ధనిక అనే తేడా ఉండదన్నారు. తెలంగాణ తల్లి గతంలో అధికారికంగా లేదన్నారు. మంత్రివర్గ విస్తరణపై తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. కేబినెట్ విస్తరణపై పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందన్నారు.

### సోరస్, అదానీ అంశాలపై

## లోక్‌సభలో గందరగోళం

న్యూఢిల్లీ: లోక్‌సభ లో కూడా గందరగోళం నెలకొన్నది. సభ ప్రారంభమైన క్షణం నుంచి అధికార, విపక్ష ఎంపీలు ఆందోళన చేపట్టారు. దీంతో సభను మధ్యాహ్నం ఒంటి గంట వరకు వాయిదా వేశారు. ఆ తర్వాత మరోసారి 2 గంటల వరకు వాయిదా వేశారు. అమెరికా వ్యాపారవేత్త జార్జ్ సోరస్‌తో కాంగ్రెస్ పార్టీకి లింకు ఉన్నట్లు బీజేపీ ఆరోపించగా, అదానీ అంశంపై చర్చ చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఇరు వైపుల సభ్యుల నినాదాలతో సభ హోరెత్తింది. ప్రశ్నోత్తరాల సమయం పూర్తి అయిన తర్వాత.. జీరో అవర్‌లో ప్రతిష్టంభన మొదలైంది. ఎంపీ జ్యోతిమణి మాట్లాడుతూ.. ఓ వ్యాపారవేత్తకు, బీజేపీకి లింకులు ఉన్నట్లు ఆరోపించారు. అయితే ఆ వ్యాపారవేత్త పేరును రికార్డుల్లో చేర్చడం లేదని ప్రభుత్వం తెలిపింది. దీంతో విపక్ష సభ్యులు ఆందోళన ఉధృతం చేశారు. కాంగ్రెస్ నేతలకు, జార్జ్ సోరస్‌కు లింకులు ఉన్నట్లు బీజేపీ నేత నిశికాంత్ దూబే ఆరోపించారు. ఇండియాను నిర్వీర్యం చేసేందుకు సోరస్, కాంగ్రెస్ కలిసి పనిచేస్తోందని విమర్శించారు. దీంతో కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లారు. బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తొలుత ఒంటి గంట, ఆ తర్వాత రెండు గంటల వరకు సభను వాయిదావేశారు.

## మళ్లీ గెలిపిస్తే ప్రతి మహిళకు నెలకు రూ.2,100 ఇస్తాం.. కేజ్రీవాల్ హామీ

ఢిల్లీ: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీని తిరిగి గెలిపిస్తే 18 ఏళ్లు పైబడిన ప్రతి మహిళకు నెలకు రూ.2,100 ఇస్తామని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ హామీ ఇచ్చారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడ్డాయి. ఈ క్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ ఇప్పటికే ఆటో డ్రైవర్లకు ఐదు హామీలను ఇచ్చింది. తాజాగా మహిళలకు రూ.2,100 ఇస్తామని తెలిపింది. ఈ మొత్తాన్ని నేరుగా మహిళ ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి అతిశీతో కలిసి అరవింద్ కేజ్రీవాల్ నేడు ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రతి మహిళకు రూ.1,000 ఇస్తామని గతంలో హామీ ఇచ్చామని, అయితే కొంతమంది మహిళలు తన వద్దకు వచ్చి ద్రవ్యోల్బణం కారణంగా ఈ మొత్తం సరిపోదని చెబుతున్నారని తెలిపారు. వారి అభ్యర్థన మేరకు పద్దెనిమిదేళ్లు నిండిన మహిళలకు రెండింతల కంటే ఎక్కువ పెంచినట్లు తెలిపారు.

# మూడు దశల్లో రూ.84,700 కోట్లు..

మొదటి పేజి తరువాయి

ప్రభుత్వం.. ఉత్పత్తి వ్యయం తగ్గించే దిశగా ప్రణాళికలు రూపొందిస్తోంది. ఎండ్ టు ఎండ్ సొల్యూషన్ కాన్సెప్ట్‌లో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయబోతుంది. ఈ మధ్యే రిలయన్స్ గ్రూప్, ఏపీ ప్రభుత్వంతో MOU కుదుర్చుకుంది. రెండున్నర లక్షల మందికి ఉపాధి కల్పించేలా 65 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయబోతుంది.

జపాన్ కంపెనీ నిప్పన్ స్టీల్స్ జాయింట్ వెంచర్

కొద్దిరోజుల క్రితం ఉమ్మడి విశాఖకు మిట్టల్ గ్రూప్ తీపికబురు అందించింది. దేశీయ ఉక్కు రంగంలో దిగ్గజ సంస్థ ఆర్సెలార్ మిట్టల్.. జపాన్‌కు చెందిన నిప్పన్ స్టీల్స్ జాయింట్ వెంచర్ కంపెనీ రెండు దశల్లో పెట్టుబడులు పెట్టాలని డిసైడ్ అయింది. మొదటి దశలో 70 వేల కోట్లు పెట్టుబడులు పెట్టనుంది. రాష్ట్ర చరిత్రలోనే ఇది భారీ ఇన్వెస్ట్‌మెంట్. అనకాపల్లి సమీపంలోని నక్కపల్లి రాజయ్యపేట దగ్గర ఐఎస్‌పీ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వానికి ఆ సంస్థ ప్రతిపాదన పంపించింది.

గూగుల్‌తో ప్రభుత్వం కీలక ఒప్పందం

మరోవైపు టీసీఎస్ క్యాంపస్ ఏర్పాటుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. గతంలో డల్లాస్ టెక్నాలజీ సెంటర్‌గా ఉన్న ఎల్‌ఎల్‌పీ ప్రాంగణాన్ని క్యాంపస్‌కి కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. లేటెస్ట్‌గా గూగుల్‌తో కీలక ఒప్పందం చేసుకుంది. ఈ విషయాన్ని కలెక్టర్ల సమావేశంలో ప్రస్తావించారు సీఎం చంద్రబాబు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, సీ



కేబుల్ కనెక్టివిటీ వస్తే విశాఖ ఓ డీప్ టెక్ డెస్టినేషన్ అవుతుందన్నారు. మంత్రి లోకేష్ కృషితో గూగుల్ ఏర్పాటుకు లైన్ క్లియర్ అయ్యిందని.. గూగుల్ ఎంవోయూతో అభివృద్ధి జరుగుతుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీ ప్రభుత్వానికి విశాఖ హై ప్రయార్టిగా మారిపోయింది. టెక్ హబ్‌గా మార్చేందుకు దిగ్గజ కంపెనీలకు రెడ్‌కార్పెట్ పరుస్తూనే.. పారిశ్రామిక, ఫార్మా, టూరిజంపైనా ప్రత్యేక దృష్టి సారించింది. ఈ రంగం ఆ రంగం అని తేడా లేకుండా అన్ని రంగాల్లో సాగర నగరానికి కొత్త వెలుగులు అద్దేందుకు ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఫైనల్‌గా విశాఖ చుట్టూ అభివృద్ధి.. రాష్ట్రానికి ఎంతో మేలు చేస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

# సంక్రాంతి నుంచి కాంగ్రెస్‌లో జోష్



మొదటి పేజి తరువాయి

అటు రేవంత్ రెడ్డి, ఇటు భట్టి విక్రమార్క పార్టీ హైకమాండ్‌కి విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది.. అయితే.. దీనిపై మళ్లీ రాహుల్ గాంధీతో చర్చించి ఫైనల్ గా నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.. సీఎం రేవంత్ రెడ్డి క్యాబినెట్ లో 11 మంది మంత్రులు ఉండగా ఉమ్మడి జిల్లాల వారీగా చూస్తే ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు మాత్రం ప్రాతినిధ్యం దక్కలేదు. ఎమ్మెల్యేల సంఖ్య ప్రకారం ఇంకా ఆరుగురు కొత్త వారికి కేబినెట్‌లో చోటుకి అవకాశం ఉంది. దీంతో కచ్చితంగా ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల వారికి కేబినెట్ విస్తరణలో బెర్త్ కచ్చితంగా దక్కే అవకాశం ఉంది. ఈ నాలుగు ఉమ్మడి జిల్లాలకు మంత్రి పదవులతో పాటు మిగిలిన మరో రెండు పదవులు ఎవరికి ఏ జిల్లాకు దక్కుతాయనే ఉత్కంఠ తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో నెలకొంది. అయితే.. కేబినెట్ విస్తరణలో మిగిలిన మంత్రి పదవుల భర్తీతో పాటు ఇప్పుడు మంత్రులకు ఉన్న శాఖలు మార్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. కేబినెట్ విస్తరణతో పాటు ఇప్పటికీ ఖాళీగా ఉన్న డిప్యూటీ స్పీకర్, ప్రభుత్వ చీఫ్ విప్ పోస్టులను కూడా భర్తీ చేస్తారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. తాజాగా సీఎం, డిప్యూటీ సీఎం ఢిల్లీ టూర్ల నేపథ్యంలో సంక్రాంతి నుంచి పూర్తి సైన్యంతో సీఎం రేవంత్ రెడ్డి పాలన పరుగులు పెట్టించనున్నారని కాంగ్రెస్‌లో జోష్ కనిపిస్తోంది..

### ఆరు నెలలు పూర్తి చేసుకున్న


## కూటమి ప్రభుత్వం...

అమరావతి: ఏపీలో జూన్ 12న కూటమి ప్రభుత్వం కొలువుదీరిన సంగతి తెలిసిందే. కూటమి అధికారంలోకి వచ్చి ఆర్నెల్లయిన సందర్భంగా రాష్ట్ర విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పందించారు. ఓ ప్రకటన విడుదల చేశారు. "రాష్ట్ర ప్రజల ఆశీస్సులతో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు అయ్యింది. గత ఐదేళ్లలో ధ్వంసమైన రాష్ట్రం, అస్తవ్యస్తమైన వ్యవస్థలు, అప్పులు వారసత్వంగా వచ్చాయి. అయితే... సంక్షోభాలను అవకాశాలుగా తీసుకొని సంక్షేమంగా మలిచే చంద్రబాబు గారి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్ర పునర్నిర్మాణం లక్ష్యంగా పనిచేస్తోంది. పిచ్చిపిచ్చి రంగులు ఉండవు... మా బొమ్మలు కనిపించవు... పబ్లిసిటీ కంటే రియాలిటీకే మా ప్రాధాన్యం. 'రాష్ట్రమే ఫస్ట్... ప్రజలే ఫైనల్' అనే నినాదం కూటమి ప్రభుత్వ విధానంగా అమలు చేస్తూ ప్రజలు మాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం. అందరి సహకారంతో స్వర్ణాంధ్ర-2047 విజన్‌తో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో పయనింపజేస్తాం" అని నారా లోకేశ్ స్పష్టం చేశారు.

## ప్రభుత్వ స్కూళ్లలో ఇన్ ఫ్రాస్ట్రక్చర్ కు, ఎకడమిక్ ఫలితాలకు పొంతన ఉండటం లేదు

అమరావతి: గత ఐదేళ్లలో విద్యారంగాన్ని పట్టించుకోలేదని, రాబోయే ఐదేళ్లలో మౌలిక సదుపాయాలు, ఫలితాలపై దృష్టిసారించి ఏపీ మోడల్ విద్యావ్యవస్థ రూపకల్పనకు అధికారులంతా నడుంబిగించాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. సచివాలయంలో కలెక్టర్ల సమావేశంలో మానవవనరుల శాఖపై సమీక్షలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్ రోల్ మెంట్ పెరగాలని, జీరో డ్రాపవుట్స్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. "ప్రభుత్వ స్కూళ్లలో ఇన్ ఫ్రాస్ట్రక్చర్ కు, ఎకడమిక్ ఫలితాలకు పొంతన ఉండటం లేదు. పారదర్శకమైన విధానాలతో మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు చర్యలు తీసుకోవాలి. మౌలిక సదుపాయాలు, ఎకడమిక్ పెర్ఫార్మెన్స్ ను పొందుపరుస్తూ జిల్లాలవారీగా ప్రోగ్రెస్ రిపోర్ట్ కార్డులను అందజేస్తున్నాం. రాబోయే వంద రోజుల యాక్షన్ ప్లాన్ కు అనుగుణంగా అధికారులు దృష్టి సారించాలి. ముఖ్యంగా జిల్లా కలెక్టర్లు చిన్నారులకు అందించే మధ్యాహ్న భోజనంపై దృష్టి సారించాలి. పోషకవిలువలు కలిగిన పౌష్టికాహారం అందజేసేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. ఇందుకోసం లోకల్ మెనూతో మధ్యాహ్న భోజనం అందించే వెసులుబాటును కలెక్టర్లకు కల్పించాం. ఉన్నత విద్యలో కూడా హాస్టల్, భోజన సౌకర్యాలపై దృష్టిపెట్టాలి. ఇటీవల కాలంలో చాలా ఫిర్యాదులు వస్తున్నాయి. హాస్టళ్లలో పారిశుద్ధ్య నిర్వహణ, కనీస మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలి. ఇందుకోసం ప్రతివారం విద్యార్థులనుంచి ఫీడ్ బ్యాక్ తీసుకునే విధానాన్ని చేపట్టాం. ఫీడ్ బ్యాక్ ఆధారంగా మెస్, సౌకర్యాల మెరుగుదలకు చర్యలు చేపట్టాలి. పాఠశాలలు, కళాశాలల్లో మత్తుపదార్థాల నివారణకు డ్రగ్స్ వద్దు బ్రో పేరుతో పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నాం. అన్ని స్కూళ్లు, కాలేజీల్లో ఈగల్ టీమ్స్, క్లబ్స్ ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావాలి. కేజీ టు పీజీ కరిక్యులమ్ ప్రక్షాళనను చర్యలు చేపడుతున్నాం. అపార్ ఐడీ విషయంలో కొన్ని సమస్యలు తలెత్తాయి. దీనివల్ల తల్లిదండ్రులు ఇబ్బంది పడ్డారు. సాంకేతిక సమస్యలు అధిగమించి పారదర్శకంగా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులంతా కృషిచేయాలి" అని మంత్రి లోకేశ్ కోరారు.

## నాలెడ్జి సొసైటీ లక్ష్యానికి లోబడి విద్యావ్యవస్థలో మార్పులు రావాల్సి ఉంది: సీఎం చంద్రబాబు






అమరావతి: నాలెడ్జి సొసైటీ మన ప్రభుత్వ లక్ష్యం... ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేయాలని ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు కోరారు. మానవ వనరుల శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి మాట్లా డారు. "ఆన్ లైన్, ఆఫ్ లైన్ విధానాల ద్వారా అంతర్జాతీయంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యావ్యవస్థలో మార్పులు తేవాలి. ప్రైవేటు విద్యావ్యవస్థను తొక్కేయడం మన విధానం కాదు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ విద్యారంగాన్ని తీర్చిదిద్దాలన్నదే తమ ధ్యేయం. రాబోయే రోజుల్లో నాలెడ్జి ఎకానమీలో తెలుగు విద్యార్థులు నెం.1గా నిలవాలి. అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో పేరెన్నికగన్న విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలకు ప్రత్యేక బృందాలను పంపి అక్కడ బోధన, అభ్యసన పద్ధతులపై అధ్యయనం చేయాలి. తదనుగుణంగా కరిక్యులమ్ లో మార్పులు చేసి, ఎన్ఐఆర్ఎఫ్, గ్లోబల్ ర్యాంకింగ్స్ మెరుగుదలకు చర్యలు చేపట్టాలి. సివిల్ ఏవియేషన్, గ్రీన్ ఎనర్జీ, టూరిజం రంగాల్లో భవిష్యత్ అవకాశాలను అంచనావేసి ఆయా యూనివర్సిటీల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి. స్కిల్స్, ఎంప్లాయ్ మెంట్ ను బ్యాలెన్స్ చేయాల్సి ఉంది. ఇందుకోసం అమరావతి రాజధానిలో ఏర్పాటుచేసే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ తో రాష్ట్రంలోని 5 జోన్లలోని స్కిల్ డెవలప్ మెంట్ సంస్థలను అనుసంధానిస్తాం. డిజిటల్ టీచింగ్, లెర్నింగ్ పై దృష్టి సారించాలి. సొసైటీ అవసరాలను బట్టి స్కిల్ అప్ గ్రేడేషన్ చేపట్టాలి. ఒకేషనల్ విద్యపై దృష్టిసారించాలి. పాఠశాలల్లో రేటింగ్ మెరుగుదలకు కలెక్టివ్ టీమ్ బిల్డింగ్ తో ర్యాంకింగ్స్ మెరుగుదలకు కృషిచేసి, విద్యారంగాన్ని అభివృద్ధి చేసేందుకు అధికారులంతా కృషిచేయాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజ్ఞప్తిచేశారు.

### బీజేపీకి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా..

## తక్షణమే బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి



హైదరాబాద్: బయ్యారం ఉక్కు-తెలంగాణ హక్కు అంటూ తెలంగాణ ఉద్యమ సమయం నుంచి కేసీఆర్ నాయకత్వంలో పోరాటం చేస్తున్నాం ఎమ్మెల్సీ కవిత అన్నారు. 2013లోనే బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని నాటి ప్రధాని మన్మోహన్ సింగ్‌కు కేసీఆర్ లేఖ రాశారని గుర్తుచేశారు. బయ్యారంలో లక్షా 41 వేలకు పైగా ఎకరాల్లో 300 మిలియన్ టన్నులకుపైగా ఐరన్ ఓర్ నిల్వలు ఉన్నాయని చెనప్పారు. అక్కడ ఉక్కు పరిశ్రమ వస్తే స్థానికంగా ఉపాధి అవకాశాలు, ఉద్యోగాలు పెరుగుతాయి అన్నది కేసీఆర్ ఆలోచన అని తెలిపారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని రాష్ట్ర విభజన చట్టంలో ఉందని, కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా చట్టాన్ని మాత్రం అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. కేంద్రంలో పదేండ్లకు పైగా అధికారంలో ఉన్న బీజేపీ హామీని అమలు చేయడం లేదన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అనేక సందర్భాల్లో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చారని వెల్లడించారు. ఐరన్ ఓర్ నాణ్యత నేపథ్యంలో ఉక్కు పరిశ్రమ సాధ్యం కాదని బీజేపీ ప్రభుత్వం సాకు చూపిస్తున్నదని విమర్శించారు. ఇక్కడ ప్లాంట్ ఏర్పాటు సాధ్యం కావడానికి అవసరమైన మరో 100 మిలియన్ టన్నుల ఐరన్ ఓర్‌ను ఛత్తీస్‌గఢ్ నుంచి తీసుకువచ్చేందుకు కూడా ఆ రాష్ట్ర ప్రభుత్వంతో కేసీఆర్ మాట్లాడారని చెప్పారు. బీజేపీకి తెలంగాణ పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి, ప్రేమ ఉన్నా తక్షణమే బయ్యారంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కాదని పార్లమెంటు సాక్షిగా తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటించడం బాధాకరమన్నారు. రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే ఒక్కరు కూడా స్పందించకపోవడం శోచనీయమని విమర్శించారు. ప్రస్తుత మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గతంలో ఎంపీగా ఉన్న సమయంలో ఉక్కు పరిశ్రమ కోసం డిమాండ్ చేశారని, ఇప్పుడు మాత్రం మాట్లాడటం లేదని చెప్పారు. బీజేపీ ప్రభుత్వంపై రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయించాలన్నారు.

## ప్రకటనలు కాదు.. పథకాల అమలు కావాలి: కేటీఆర్

హైదరాబాద్: సంక్రాంతికి రైతు భరోసా అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. ప్రకటనలు కాదు పథకాల అమలు కావాలన్నారు. కోతలు, కూతలు కాదు చేతలు కావాలంటూ చురకలంటించారు. అధికారంలోకి వస్తే ఎకరాకు ఏడాదికి రూ.15 వేలు అని ఊదరగొట్టారు. కానీ ఏడాదిగా ప్రకటనలతోనే కాలం వెళ్లదీస్తున్నారని మండిపడ్డారు. అర్హుల కోసం, అమలు కోసం మంత్రివర్గ ఉపసంఘం అని సభలు, సమావేశాలు పెట్టారని, ఏడాదిగా రైతుబంధు మీద కొండను తవ్వి ఎలుకను పట్టలేదు.. మంత్రివర్గ ఉప సంఘం నివేదిక ఊసేలేదు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం కోసం అబద్ధాలు చెప్పారని, అధికారం దక్కిన తర్వాత పథకాల ఎగవేతకు కుంటిసాకులు వెతుకుతున్నారని విమర్శించారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో ఆత్మవిశ్వాసంతో మీసం మెలేసిన రైతన్నలను.. ఏడాది కాంగ్రెస్ పాలనలోనే అప్పుల పాలు చేశారని మండిపడ్డారు. ఇప్పటికైనా కళ్లు తెరవాలని సూచించారు. వర్షం కురుస్తుందో లేదో, సాగునీరు, కరంటు, పెట్టిన పెట్టుబడికి తగిన దిగుబడి వస్తుందో.. లేదో? అని తెలియకున్నా భూమిని నమ్మి సేద్యం చేసి ప్రపంచానికి బువ్వను అందించే రైతన్నలకు భరోసా ఇవ్వాలన్నారు. అమ్మల విషయంలో, అన్నదాతల విషయంలో వివక్ష చూపొద్దన్నారు. పథకాల అమలు ఎగవేతకు కారణాలు వెతకొద్దన్నారు.

### మహిళా ప్రజాప్రతినిధులకు ఇస్తున్న గౌరవం ఇదేనా..

## కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్‌రావు ఆగ్రహం



హైదరాబాద్: ఫుడ్ పాయిజన్‌తో ఆస్పత్రి పాలైన వికారాబాద్ జిల్లా తాండూరు గిరిజన బాలికలను పరామర్శించేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్‌లను పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరిని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ పాఠశాలలు గురుకులాల్లో ఫుడ్ పాయిజన్లు జరిగి విద్యార్థులు ఆసుపత్రుల పాలవుతుంటే మీకు చీమకుట్టినట్లయినా లేకపోవడం సిగ్గుచేటు అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హరీశ్‌రావు విమర్శించారు. ఏడాదికాలంగా గురుకుల వ్యవస్థ, విద్యావ్యవస్థ కుప్పకూలుతున్న మీరు పట్టించుకోరు, ప్రశ్నించిన ప్రతిపక్షాన్ని అడ్డుకుంటరు. అరెస్టులు చేస్తారని మండిపడ్డారు. సో కాల్డ్ ఇందిరమ్మ రాజ్యంలో మహిళా ప్రజా ప్రతినిధులకు ఇస్తున్న గౌరవం ఇదేనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో మంగళవారం ఫుడ్ పాయిజన్‌తో 30 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే విద్యార్థినులను తాండూ రు ప్రభుత్వ దవాఖానకు తరలించి, వైద్యం అందించారు. తాండూరులోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో 3 నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న సుమారు 180 మంది విద్యార్థినులు ఉన్నారు. మంగళవారం ఉదయం 7.30 గంటలకు పాఠశాలలో అల్పాహారం కింద కిచిడీ తిన్నారు. 9.30 గంటల ప్రాంతంలో ఎనిమిదో తరగతి చదువుతున్న పలువురు విద్యార్థినులు ఒక్కసారిగా కడుపునొప్పి అంటూ రోదించడం మొదలుపెట్టారు. వెంటనే వారిని ప్రభుత్వ దవాఖానకు తరలించి, తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దవాఖానలో చేరిన ఎనిమిదో తరగతి విద్యార్థినులు గీత, గూలిబాయి, శైలజ, శ్రావణికి వైద్యులు చికిత్స అందించారు. ఫుడ్ పా యిజన్ కారణంగానే వారికి కడుపునొప్పి వచ్చినట్టుగా వైద్యులు వెల్లడించారు.

## నూతన గృహా ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న

### మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



కేశంపేట(నేటి శుభోదయ): కేశంపేట మండలం సంతాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు దుర్గం యాదయ్య గృహ ప్రవేశంలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్. వారితో పాటు పీఏసీఎస్ చైర్మన్ జగదీష్, మండల అధ్యక్షులు మురళీధర్ రెడ్డి నాయకులు నవీన్, జమాల్, సాజిద్, రామకృష్ణ స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం

### నేనున్నాను అంటూ భరోసానిచ్చిన జూలకంటి బ్రహ్మానందరెడ్డి



(నేడు శుభోదయ) 12 డిసెంబర్ పల్నాడు జిల్లా వెల్దుర్తి: ఎస్సీ కాలనీలో మృతి చెందిన అల్లి సరోజిని కుటుంబాన్ని పరామర్శించిన టిడిపి నాయకులు జూలకంటి బ్రహ్మానంద రెడ్డి పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం లోని వెల్దుర్తి ఎస్సీ కాలనీలో బుధవారం మృతి చెందిన అల్లి సరోజిని భూ స్థాపిత నిమిత్తం 10 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబ సభ్యులకు టిడిపి నాయకులు ఆర్థిక సహాయాన్ని అందించారు గురువారం జరిగిన భూస్థాపిత కార్యక్రమంలో పాల్గొని మృతుల కుటుంబానికి మట్టి ఖర్చులు నిమిత్తమై 10,000 రూపాయలు సహాయం చేసిన మాచర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మృతి చెందిన అల్లి సరోజిని మృతదేహాన్ని టిడిపి నాయకులు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న జూలకంటి అక్కిరెడ్డి, చిరంజీవి రెడ్డి టిడిపి నాయకులు పాల్గొన్నారు

## వినుకొండ నియోజకవర్గం వినుకొండ మండలం

## వెంకుపాలెం గ్రామం నందు సింగంశెట్టి వారి పుష్పాలంకరణ

(నేటి శుభోదయ): డిసెంబర్ నల్గొండ జిల్లా వినుకొండ: మహోత్సవంలో పాల్గొన వినుకొండ నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త శ్రీ కొంజేటి నాగ శ్రీను రాయల్ గారు మరియు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా వినతిపత్రం


## సమర్పించిన జాంబవవారసులం మాదిగ సేవా సమితి



కొదుమూరి జగన్నాదం ,ఖమ్మం(నేటి శుభోదయ): జిల్లా కలెక్టరేట్ లో ఎస్సీ వర్గీకరణ అమలు చెయ్యడం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్.షమీమ్ అక్తర్ కు జాంబవవారసులం మాదిగ సేవా సమితి ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా వినతి పత్రాన్ని అందించారు . ఎస్సీలలో వర్గీకరణ లేకపోవటం వలన మాదిగలు మాదిగ ఉపకులాలు తీవ్రంగా నష్టపోతున్న విషయాన్ని ఆధారాలతో సహా చూపించి ఎస్సీలను వర్గీకరించటం వలన మాదిగలు , మాదిగ ఉపకులాలకు విద్యా , ఉద్యోగ , సంక్షేమ మరియు రాజకీయ రంగాలలో ప్రయోజనం కలుగుతుందని వివరించారు . కనుక తక్షణమే జనాభా దామాషా ప్రకారం ఎస్సీలను ఏ,బి,సి,డీ లుగా వర్గీకరించి తద్వారా మాదిగ, మాదిగ ఉపకులాకు న్యాయం చేయాలని కోరారు . ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పేరెల్లి శ్రీను , మరికంటి కన్నారావు , కేదాస్ కృష్ణ , పెనుగూరి కోటేశ్వరరావు , ఆరెంపుల అంబెద్కర్ , పల్లెపోగు కృష్ణ , కోటపర్తి తిరుపతిరావు , మార్కపుడి నాగభూషణం , కోట జగదీష్ , ఇనపనూరి పుల్లయ్య , తోళ్ల శ్రీను , బాలమర్తి కోటేష్ , లంజపల్లి వెంకటేశ్వర్లు , ఎడెల్లి భిక్షం , లంజపల్లి రాములు తదితరులు పాల్గొన్నారు .

## తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కమిషన్ చైర్మన్

## జస్టిస్.షమీమ్ అక్తర్ కు డక్కలి సంఘం వినతి



కొదుమూరి జగన్నాదం ,ఖమ్మం(నేటి శుభోదయ): జిల్లా కలెక్టరేట్ లో ఎస్సీ వర్గీకరణ అమలు చెయ్యడం కోసం వచ్చిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కమిషన్ చైర్మన్ జస్టిస్.షమీమ్ అక్తర్ కు దక్కలి సంఘం నుండి వినతి పత్రం అందజేయడం జరిగింది . రాష్ట్ర నాయకులు కర్నె రామారావు మాట్లాడుతూ దక్కల కులాన్ని సంచార్ జాతులుగాగుర్తించి సపరేటర్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని , ఏబిసిడి వర్గీకరణ జరిగితే మా కులని ఏ లో చేర్చాలని కోరారు . కనీసం ఈరోజుకి ఒక సర్పంచ్ గా లేని కులాన్ని ప్రత్యేకంగా మాకు సట్టా సభలో అవకాశం కల్పించాలి . వర్గీకరణ విషయంలో వచ్చే ఫలాలు ఒక రెండు కులాల అనిపిస్తున్నాయి . నామినేట్ పోస్టులు గానీ మాకు కల్పించాలి , మా కులాన్ని గుర్తించి వచ్చే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మాకు సపరేట్గాఅవకాశం కల్పించాలి , ఎస్సీలో రెండు కులాలే మాదిగ , మాల కాదు ఇంకా 57 కులాలు ఉన్నాయి , వారికి ప్రత్యేకమైన న్యాయం జరిగేలా చూడాలని విన్నవించుకున్నారు . ఈ కార్యక్రమంలో అంతోని కృష్ణ , దాకూరి వెంకన్న , అంతోని సురేష్ , అంతోని తిరపయ్య , బాణాల ఎల్లయ్య , బాణాల ఆకమంచమ్మ , దాకుర్ నాగమణి , దాకూరు గోపాల్ , పొట్టేట్టి సునీల్ తదితరులు పాల్గొన్నారు .

## ప్రతీ రోజు వితరణ...



వి.ఆర్.పురం ప్రతినిధి(నేటి శుభోదయ)డిసెంబర్ 12:-పేద కుటుంబం రెక్కడితేకానీ,డొక్కనిండని పరిస్థితి ఆ కుటుంబానిది.అనారోగ్యంతో చింతరేగుపల్లి, గ్రామానికి చెందిన సోడే కిరణ్,(26)మృతి చెందారు.విషయం ఆనోటా, ఈనోటా, ప్రముఖ ఆయుర్వేద వైద్యులు మహ్మమ్మద్ జమాల్ ఖాన్,దృష్టికి వెళ్లింది.వెంటనే ఆయన స్పందించి అనుచరులతో మృతి చెందిన ఆకుటుంబ యజమాని తండ్రికి 5000/-రూపాయలను,సర్పరాజ్ ఆలీ, ముత్యాల రామారావు,మల్లాది శేఖర్,ముత్యాల జల కృష్ణ,చేతుల మీదుగా అందించారు.ఈ సందర్భంగా! మల్లాది శేఖర్,మాట్లాడుతూ సహాయం చేస్తున్నారని విన్నాను,ఈరోజు స్వయంగా నాకళ్ళతో చూశాను. ఇలాంటి సహాయ సహకారాలు చేయడం చాలా చాల సంతోషంగా వుంది,ఈసందర్భంగా! ప్రముఖ ఆయుర్వేద మహమ్మద్ జమాల్ ఖాన్,కి కృతజ్ఞతలు మీడియా తెలియజేస్తున్నాను.అని ఆయన స్పష్టంచేశారు.ఈవితరణ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.




## భూమాత దరఖాస్తుల ను వెంటనే పరిష్కారించాలి అన్ని

## ఖమ్మం అర్బన్ తహశీల్దార్ ఆఫీస్ ముందు దర్నా

కొదుమూరి జగన్నాదం ,ఖమ్మం(నేటి శుభోదయ): భూమాత చట్టాన్ని (ధరణి) ఆమోదించి, ప్రజాపాలనలో వచ్చిన భూ దరఖాస్తులను విచారించి వాస్తవ సాగు దారులందరికీ పాసు పుస్తకాలివ్వాలి. ఇప్పటికే లక్షలాది మంది ఏడాది కాలంగా ఈ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ కార్యాలయాలు, సివిల్ కోర్టుల చుట్టూ చెప్పుల రిగేలా తిరుగుతున్నారు. కౌలుదారులకు హక్కులు కల్పించాలి. ప్రస్తుత శీతాకాల అసెంబ్లీ సమావేశాలు నడుస్తున్నందున






ఈ పథకాల్ని ఆమోది ంచేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. అలాగే ముసాయిదాలోని లోపాలను సరిచేయాలి. రాష్ట్రానికి వ్యవసాయ ప్రణాళిక రూపొందించాలి. భూసార పరీక్షలు నిర్వహించాలి. పంటల విధానాన్ని రూపొందించి రాష్ట్రాన్ని దిగుమతుల నుండి రక్షించాలి. నకిలీ విత్తన వ్యాపారంపై ఉక్కుపాదం మోపుతామన్న ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. నకిలీ విత్తన వ్యాపారం సజావుగా సాగిపోతునేవుంది. రైతులు నష్ట పోతూనే ఉన్నారు. సంస్థాగతంగా, చట్ట పరంగా చేపట్టాల్సిన చర్యలు శూన్యం.ప్రధానంగా ఆత్మహత్యల నివారణకు, కౌలుదారులకు చట్టపరమైన రక్షణ కల్పించాలి. ప్రభుత్వ భూములకు రక్షణ కల్పనతో పాటు చట్టాల్లో మార్పు చేయాలి. 65 ఏండ్లు దాటిన రైతులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి. రైతు బీమాలో మార్పు చేయాలి. జిల్లా స్థాయిలో అఖిల పక్ష సమావేశాలు ఏర్పాటు చేసి రైతులెదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలి. లేదంటే కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగంలోనే కాదు, ప్రజల్లోనూ విశ్వాసం కోల్పోతుంది ఈ ఈ సందర్భంగా జిల్లానాయకు ఎర్ర శ్రీకాంత్ మాట్లాడారు .కార్యక్రమంలో ఖమ్మం డివిజన్ తెలంగాణ రైతు సంఘం నాయకులు ఎర్రబోయిన గోవిందరావు కూచిపూడి మధు సిఐటి రాష్ట్ర నాయకులు వై విక్రమ్, కళ్యాణ వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మీరా, ఎస్కె పడగల్ నాగేశ్వరరావు రైతు సంఘం నాయకులు కే గౌస్మియా, తాటికొండ ను,శ్రీనివాసరావు కార్మిక సంఘం నాయకులు బత్తిని ఉపేందర్ జిల్లా కార్మిక సంఘ నాయకులు ముదాం శ్రీనివాసరావుతదితరులు పాల్గొన్నారు అనంతరం వినతిపత్రం డిప్యూటీ తహశీల్దార్ కి సమర్పించనైనది

## మోడీది రైతు వ్యతిరేక ప్రభుత్వం

### ప్రభుత్వ వైఖరితో సంక్షోభంలోకి సాగు

### నూరు శాతం రుణమాఫీ నిజం కాదు

### రైతు సంఘం సమావేశంలో బాగం హేమంతరావు




కొదుమూరి జగన్నాదం , ఖమ్మం(నేటి శుభోదయ): కార్పొరేట్లకు వత్తాసు పలుకుతున్న మోడీ సర్కార్రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు ఆరోపించారు. వ్యవసాయ రంగం రోజు రోజుకు సంక్షోభంలోకి కూరుకుపోతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మంజిల్లా సమితి -సమావేశం గురువారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ -సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన హేమంతరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం రైతుల పట్ల వివక్ష చూపుతుందని కనీస మద్దతు ధరల హామీ చట్టాన్ని అమలుచేయడం లేదన్నారు. ఇప్పటికైనా కనీస మద్దతు ధరలు క్షేత్ర స్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. మూడవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత -వ్యవసాయ రంగాన్ని మరింత నిర్వీర్యం చేసి వ్యవసాయ రంగాన్ని సైతం కార్పొరేట్ల పరం చేసేందుకు మోడీ సర్కార్ ప్రయత్నిస్తుందన్నారు. రైతాంగ ఉద్యమం సందర్భంగా నల్ల చట్టాలను ఉపసంహరించుకుంటామని చెప్పినప్పటికీ ఆ దిశగా మోడీ ప్రభుత్వం పని చేయకుండా ఆ చట్టాలను దొడ్డి దారిన అమలు చేసేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. రైతాంగ చట్టాల వల్ల వ్యవసాయ రంగం నష్టపోతుందని తెలిసినా మోడీ సర్కార్ పట్టించుకోవడం లేదని హేమంతరావు తెలిపారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోవడం వల్ల గ్రామీణ ప్రాంత పేదరికం పెరిగిపోతుందని ఆయన తెలిపారు. రైతాంగ ఉద్యమంపై భాష్పవాయువు ప్రయోగం, లాఠీ ఛార్జీలు చేస్తున్నారని ఇందుకు మోడీ సర్కార్ తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీకి సంబంధించి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రెండు లక్షల రుణమాఫీకి సంబంధించి ఎటువంటి షరతులు లేకుండా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న నూరుశాతం రుణమాఫీ జరగలేదన్నారు. లక్షలాది మంది రైతులు రుణమాఫీపై ఎన్నో ఆశలు పెంచుకున్నారని దానిని అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. చనిపోయిన వారికి, పట్టాదారు పాసుపుస్తకాలు లేని వారికి, సాంకేతికంగా ఇబ్బందులు ఉన్న -వారికి రెండు లక్షల లోపు రుణమాఫీ కూడా అమలు కాలేదన్నారు. రెండు లక్షల పైన రుణం కలిగిన రైతులకు ఖాతాల్లో రెండు లక్షలు జమ చేసేందుకు చర్యలు తీసుకోవాలని, రైతుభరోసాను అమలు చేయాలని ఆయన -డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 16న రైతు సంఘం ఆధ్వర్యంలో అన్ని మండల కార్యాలయాల ముందు ఆందోళన కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో రైతు సంఘం 1/2 జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, రైతు సంఘం నాయకులు మిడికంటి వెంకటరెడ్డి, మందడపు రాణి, పుచ్చకాయల సుధాకర్, బానోత్ రాంకోటి, బాగం ప్రసాద్, పదిమల వెంకటనర్సయ్య, మార్గం శ్రీనివాసరావు, కట్ల -సత్యం తదితరులు పాల్గొన్నారు.

## శివాజీ శాఖ ఆధ్వర్యంలో రహదారి కల్విట్ కు మార్మాత్తులు

### మానవత్వం చాటుకున్న రాష్ట్రీయ స్వయం సేవక్ కార్యకర్తలు

### గట్టుప్పలపల్లి - కల్వకుర్తి రోడ్డు కల్వర్టు కు మరమ్మత్తులు







(నేటి శుభోదయ): ప్రతినిధి తలకొండపల్లి: రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం ప్రతి గురువారం సేవా దిన్ లో భాగంగా మాదిరిగానే ఈ గురువారం గట్టుఇప్పలపల్లి శివాజీ శాఖ ఆధ్వర్యంలో గ్రామానికి ఏదైనా సేవ చేయాలి అని ప్రతివారం ఏదో ఒక సేవచేస్తున్నాం.కల్వకుర్తి నుండి గట్టుఇప్పలపల్లి వెళ్లే రహదారి కల్విట్ దగ్గర చాలా ప్రమాదకరంగా ఉంది గతంలో చాలామంది ప్రయాణికులు ఇక్కడ ప్రమాదనికి గురి కావడం జరిగింది. ఇది గమనించిన రాష్ట్రీయ స్వయంసేవక్ కార్యకర్తలు ఆ గుంతలలో సిమెంటు, కంకరతో నింపి ఆ యొక్క గుంతలను పూడ్చి రోడ్డును ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చెయ్యడం జరిగింది.ఈ కార్యక్రమంలో.జినుకుంట్ల భాస్కర్.శ్రీనివాసాచారి, కళ్యాణ్కర్ సాయిరాం. దుబ్బ మల్లేష్. బోయినపల్లికృష్ణ. ఎదురశేఖర్. కావలి రమేష్. ఎంగిరాజు. పెంటమాల మహేష్.శరత్ జనుకుంట్ల చంద్రశేఖర్. దేరంగుల ప్రవీణ్. పెంట మాలభాను ప్రసాద్. ఆలూరు శివ. గుంద్రాతి గణేష్ తదితరులు పాల్గొనడం జరిగింది

## సాంప్రదాయాలను గౌరవిస్తూ...


### కుల వృత్తులకు విలువనిస్తూ...

### సనాతన ధర్మాన్ని ఆరాధిస్తూ...

### ఇప్పటినుండి సంక్రాంతి వరకు కొనసాగే గంగిరెడ్ల కులవృత్తుల వారికి సన్మానం చేస్తున్న ...

### తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్.టి, సెల్ కార్యదర్శి సవలం రాజేంద్రప్రసాద్...





వి.ఆర్.పురం ప్రతినిధి (నేటిశుభోదయ): సాంప్రదాయాలు కనుమరుగౌతున్నవేల!కులవృత్తులను భారతీయ సమష్కృతీ సంప్రదాయాలు సనాతన ధర్మాన్ని గౌరవిస్తూ అల్లూరి సీతారామరాజు జిల్లా వరరామచంద్రాపురం,మండలంలోని ఉమ్మడివరం గ్రామంలో గంగిరెడ్ల కుటుంబ యజమానిని సన్మానించడం జరిగిందని తెలుగుదేశం పార్టీ ఎస్.టి.సెల్ రాష్ట్ర నాయకులు సవలం రాజేంద్రప్రసాద్ అన్నారు.గురువారం, ఉమ్మడివరం గ్రామంలో పట్టు నూతన వస్త్రాలతో గంగిరెడ్ల కులవృత్తుల వారిని సన్మానిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ!సంప్రదాయాలు కనుమరు గౌతున్నవేల వృత్తులను కొనసాగించడం సాంప్రదాయాలనకి విలువ ఇవ్వడమేనని ఆయన గుర్తు చేశారు.ఊరురా!పల్లె పల్లె



తిరుగుతూ ముందుగానే సంక్రాంతి శోభను తీసుకువచ్చే,ఈసాంప్రదాయాలు ప్రతీ మధ్యతరగతి కుటుంబాల్లో సంతోషాలు నిస్తాయని ఆయన స్పష్టం చేశారు. సాంప్రదాయాలు,విలువలతో వీరిని నూతన వస్త్రాలతో సన్మానం చేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాని, ఆనందం



వ్యక్తం చేశారు. పల్లెల్లో తిరుగుతూ సంస్కృతీ సాంప్రదాయాలకు కేరాఫ్ అడ్రస్ గా నిలిచే గంగిరెడ్ల వారు ఉన్నంత కాలం,భారతీయ సంప్రదాయాలు,సంస్కృతి ఉంటాయని ఆయన చెప్పారు. ప్రతి ఒక్కరూ సాంప్రదాయాలపట్ల గౌరవంతో మెలగాలని ఆయన కోరారు.

# డిసెంబర్ 17న జాబ్ మేళా నిర్వహణ....

**జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు.**

మంథని /పెద్దపల్లి, చేరాలరవీందర్, డిసెంబర్ -12 (నేటిశుభోదయ): పెద్దపల్లి జిల్లాలోని నిరుద్యోగ యువకులకు హైదరాబాద్ లోని మెడ్ ప్లస్ లో ఉద్యోగాలు కల్పించుటకు ఈనెల 17న మంగళవారం రోజున సమీకృత జిల్లా కలెక్టరేట్లో రూమ్ నెంబర్ 225 నందు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై. తిరుపతి రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడ్ ప్లస్ సంస్థలో 20 ఫార్మసిస్ట్, 30 కష్టం సేల్స్ అసోసియేట్, 50 జూనియర్ అసిస్టెంట్, 15 ఆడిట్ అసిస్టెంట్ పోస్ట్ లు ఖాళీలు ఉన్నాయని, సేల్స్ ఫార్మసిస్ట్ పోస్టులకు డిప్లొమా/ డిగ్రీ ఇన్ ఫార్మసీ, జూనియర్ అసిస్టెంట్, కస్టమర్ సేల్స్ అసోసియేట్, ఆడిట్ అసిస్టెంట్లకు 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని, వీరి వయస్సు ఫార్మసిస్టులకు , ఆడిట్ అసిస్టెంట్ (పెళ్లి కాని వారు) 18 నుంచి 30 లోపు, జూనియర్ అసిస్టెంట్, కస్టమర్ సేల్స్ అసోసియేట్లకు 18 నుంచి 28 లోపు ఉండాలని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు డిసెంబర్ 17నఉదయం 11 గంటల సర్టిఫికేట్స్ జిరాక్స్ లతో సమీకృత జిల్లా కలెక్టరేట్ కు వచ్చి తమ పేరు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9392310323, 8985336947, 8121262441 నందు సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు.

# నేడు సిపిఐ కౌన్సిల్ కార్యవర్గ సమావేశం

కొదుమూరి జగన్నాదం ,ఖమ్మం **(నేటి శుభోదయ):** భారత కమ్యూనిస్టు పార్టీ ఖమ్మంజిల్లా కార్యవర్గ సమావేశం ఈనెల 13న ఉదయం 10 గంటలకు ఖమ్మం గిరిప్రసాద్ భవన్లో జరుగుతుందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. 12 గంటలకు కౌన్సిల్ సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు -హాజరవుతారని సురేష్ తెలిపారు. పార్టీ సభ్యత్వం, పార్టీ ఆవిర్భావ దినోత్సవం, నల్గొండ సభ తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందని సురేష్ తెలిపారు.

## మొయినాబాద్ మండలం , శంకర్ పల్లి మండలలకు సంబంధించిన మండల స్థాయి సీ.ఎం కప్ ఆటలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేసిన స్థానిక శాసనసభ్యులు కాలే యాదయ్య ..






చేవెళ్ల నియోజకవర్గం**(నేటి శుభోదయ):** మొయినాబాద్ మండలం , శంకర్ పల్లి మండలలకు సంబంధించిన మండల స్థాయి సీ.ఎం కప్ ఆటలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అంద జేసిన స్థానిక శాసనసభ్యులు కాలే యాదయ్య ...ఈ కార్యక్రమంలో






జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి వారితోపాటు నాయకులు షాబాద్ దర్శన్ ,వేణుగోపాల్ ,లక్ష్మణ్ ,మహేందర్ ముదిరాజ్, రామ్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, రాఘవరెడ్డి, రాజు గౌడ్, ప్రవీణ్, వివిధ స్కూల్ విద్యార్థులు,ఉపాధ్యాయులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు..

# శబరిమల మహాపాదయాత్ర



**(నేటి శుభోదయ):** పూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ గురుబ్రహ్మ సతీష్ నాయర్ గురుస్వామి స్వామి దివ్య ఆశీస్సులతో దీవెనలతో శ్రీ గిరీష్ నాయర్ గురుస్వామి ఆశీస్సులతో షాబాద్ అయ్యప్ప సేవా సమితి గురుస్వామి రవీందర్ గౌడ్ తరపున సువర్ణభూమి శబరిమల మహాపాదయాత్ర వినయ్ గురుస్వామి మరియు వసంత్ గురుస్వామి ఆధ్వర్యంలో షాబాద్ నుండి లక్ష్మణ్ గురు స్వామి, రామ్ స్వామి, రాఘవేందర్ స్వామి , మల్లేష్ స్వామి, శ్రీనాథ్ స్వామి04/11/2024 బయల్దేరి 09/12/2024అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుని దర్శనం చేసుకోవడం జరిగింది 37 రోజుల మహా పాదయాత్ర 1400 కిలోమీటర్లు పైన కాలినడకన పాదయాత్రగా శ్రీ ధర్మశాస్త్ర దర్శనం చేసుకోవడం జరిగింది.



## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో కలిసి ప్రెస్ మీట్ లో పాల్గొన్న పార్టీ యువ నేత పట్నం అవినాష్ రెడ్డి





**(నేటి శుభోదయ):** బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్తో కలిసి పార్టీ యువ నేత, షాబాద్ మాజీ జడ్పిటిసి సభ్యుడు పట్నం అవినాష్ రెడ్డి ప్రెస్ మీట్ లో పాల్గొన్నారు. కొడంగల్ నియోజకవర్గం లగచర్ల రైతులకు సంబంధించిన ప్రెస్ మీట్ కార్యక్రమాన్ని గురువారం నగరంలోని నందినగర్ లోని వారి నివాసంలో కేటీఆర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ యువనేత పట్నం అవినాష్ రెడ్డి తో పాటు కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి సతీమణి పట్నం శృతి రెడ్డి, అవినాష్ రెడ్డి సతీమణి పట్నం సాన్విరెడ్డి, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# యేసుక్రీస్తు జన్మ పవిత్రమైనది

**ఐఎంఐ సెక్రటరీ అంకరి కుమార్**



మంథని, చేరాలరవీందర్, డిసెంబర్ -12( నేటి శుభోదయ): ఏసుక్రీస్తు జన్మ పవిత్రమైనదని ఐఎంఐ ప్రధాన కార్యదర్శి అంకరి కుమార్ అన్నారు. గురువారం మంథని పట్టణంలోని సీయోను ప్రార్ధన మందిరంలో మంథని ఫీల్డ్ పాస్టర్ల సహవాస కూడిక జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్య మరియ గర్భంలో ఏసుక్రీస్తు జన్మించి తన పవిత్రతను చాటుకున్నాడని, నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించు అనే క్రీస్తు బోధనలు అందరూ ఆచరించ దాగినవన్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేకలు చేసి స్వీట్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ఎఫ్ఇసి కోశాధికారి వల్లూరి ప్రభాకర్ ఫీల్డ్ పెద్దలు మార్కు, ఆదాము, పాస్టర్లు మహేష్, శామ్యూల్, రాజేష్, కోటేష్, చందు తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికరమైన రుచికరమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలి

**కామన్ డైట్ మెనూ అమలు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

పెద్దపల్లి, డిసెంబర్-12 (నేటి శుభోదయం): పెద్దపల్లి జిల్లా : డిసెంబర్ 14న కామన్ డైట్ లాంచ్ కార్యక్రమానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో రెసిడెన్షియల్ పాఠశాలలు,







కేజీబీవీ , మాడల్ స్కూల్స్, ఆశ్రమ పాఠశాలల్లో కామన్ డైట్ మెనూ అమలు పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,..... డిసెంబర్ 14న ప్రభుత్వ ఆదేశాల మేరకు కామన్ మెనూ కార్యక్రమం లంచ్ ఉంటుందని, విద్యార్థులకు కామన్ డైట్ ప్లాన్ డిసెంబర్ 14 నుంచి అమలులోకి వస్తుందని అన్నారు. కామన్ డైట్ ప్లాన్ పై విస్తృతంగా ప్రచారం కల్పించాలని, పిల్లల తల్లిదండ్రులను ఆహ్వానించి లాంచ్ కార్యక్రమం చేయాలని కలెక్టర్ సూచించారు. హాస్టల్స్ లో కామన్ డైట్ వివరాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి హాస్టల్ లో ఒకే రకమైన ఆహారం విద్యార్థులకు అందించడం జరుగుతుందని అన్నారు. కిచెన్ - డైనింగ్ ఏరియా నిర్వహణ మెరుగు పరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. డిసెంబర్ 14న ఉదయం 11 గంటలకు వీఐపి రెసిడెన్షియల్ పాఠశాలలకు చేరుకుంటారని, 11 నుంచి 12 గంటల వరకు పాఠశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తారని, 12 నుంచి 12.30 గంటల వరకు పిల్లలతో ఇంటరాక్షన్, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు. అనంతరం కామన్ డైట్ ప్లాన్ సంబంధించిన బ్యానర్ ముఖ్య అతిథి చే ఆవిష్కరించి ప్రసంగిస్తారని, అనంతరం 1 గంటలకు ముఖ్య అతిథి, పిల్లలు పిల్లలు తల్లి దండ్రులతో పాటు భోజనం చేస్తారని కలెక్టర్ తెలిపారు. శనివారం నాడు కామన్ డైట్ లాంచ్ కార్యక్రమం ఉన్నందున ఆరోజు నాన్ వెజ్ ఆదివారం మెనూ తయారు చేయాలని కలెక్టర్ సూచించారు. గతంలో ఉన్న డైట్ చార్జీలు 8 సంవత్సరాల తర్వాత 40 శాతం ప్రస్తుత ప్రభుత్వం పెంచిందని, కాస్మెటిక్ చార్జీలను 16 సంవత్సరాల తర్వాత 200 శాతం పెంచినట్లు, పాఠశాలలో చదివి విద్యార్థుల ఎదుగుదల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం అత్యంత శ్రద్ధ వహిస్తుందని అన్నారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం గురించి తల్లిదండ్రులకు కామన్ డైట్ లంచ్ సందర్భంగా తెలియజేయాలని అన్నారు. రాష్ట్రం మొత్తం మీద ఒకే డైట్ ప్లాన్ అమలు అవుతుందని, పిల్లలకు పౌష్టికరమైన రుచికరమైన ఆహారం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పాఠశాలలకు సరుకులు ఏ విధంగా వస్తున్నాయి కిచెన్ లో ఏ విధంగా భద్రపరచాలి, విద్యార్థులకు రుచికరమైన ఆహారం తీసుకోవాల్సిన చర్యలు అంశాల పై సిబ్బందికి అవసరమైన శిక్షణ అందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. కిచెన్, డైనింగ్ ఏరియా లను శుభ్రం చేయాలని, ఆ ప్రాంతాలను ఎప్పుడు శుభ్రంగా ఉంచుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జే రంగారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వినుకొండ నియోజకవర్గం వినుకొండ మండలం వెంకుపాలెం గ్రామం నందు సింగంశెట్టి వారి పుష్పాలంకరణ మహోత్సవంలో

(నేటి శుభోదయ): 12 డిసెంబర్ పల్నాడుజిల్లా



వినుకొండ :పాల్గొన వినుకొండ నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త శ్రీ కొంజేటి నాగ శ్రీను రాయల్ గారు మరియు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# శిశు మరణాలపై సమీక్ష నిర్వహించిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ అన్న ప్రసన్న కుమారి




పెద్దపల్లి, చేరాలరవీందర్, డిసెంబర్ -12( నేటి శుభోదయ): వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి



కార్యాలయం నందు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి, డా. అన్నా ప్రసన్న కుమారి అధ్యక్షతన శిశు మరణాల సమీక్ష కమిటి సమావేశం జరిగినది. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి మాట్లాడుతూ.... ఇండియాలో 1000 సజీవ జననాలకు 25, తెలంగాణలో 23 కాగా మన జిల్లాలో 7 మంది శిశు మరణాలు జరుగుతున్నాయి అని అన్నారు. జిల్లాలో ఏప్రిల్ 2024 నుండి నవంబర్ 2024 వరకు జరిగిన శిశు మరణాలు 35 నమోదు కాగా వాటిలో 6 శిశు మరణాల కేసులను ఎంపిక చేసి వాటి పైన సమీక్ష నిర్వహించడమైనది. వీటిలో నెలలు నిండకుండా పుట్టిన పిల్లలు, బరువుతక్కువగా పుట్టిన పిల్లలు, జ్వరం వచ్చి ఫిట్స్ తో చనిపోయిన పిల్లలు, ఉమ్మ నీరు మింగడం వలన చనిపోయిన పిల్లలు, కొందరు పాలు పట్టిన తరువాత తల్లి సరిగా భుజం పైన వేసుకొని శిశువును చేతితో తట్టకపోవడం వల్లన పొలిమారి పాలు శ్వాస నాళంలోకి పోవడం వలన చనిపోయారు. తల్లికి బి.పి. పెరగడం వలన చనిపోయిన శిశువులు, కావున గర్భిణికి సరియైన పోషణ అందిస్తూ, మానసికంగా ఆనందంగా ఉంచి బి.పి పెరగకుండా చూసుకోవాలని తల్లులకు అవగాహన కల్పించాలి అని, శిశువులలో ఏమైనా ప్రమాద చిహ్నాలను గుర్తించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళె విదంగా ప్రోత్సాహించాలని, భవిష్యత్తులో జిల్లాలో పిల్లల మరణాలు తగ్గాలని వైద్యాధికారులను, ఎ.ఎన్.ఎం.లను, ఆశాలను ఆదేశించారు. ఈ సమావేశంలో డా. బి. కిరణ్ కుమార్, ప్రోగ్రామ్ ఆఫీసర్ (సిహెచ్ అండ్ ఐ), మాతా శిశు కేంద్రం నుండి డా. శ్రీధర్, డి.సి.హెచ్.ఎస్, డా. టి. రవిందర్, పిడియాట్రిషియన్, డా. స్రవంతి, గైనాకాలజిస్ట్, శ్రీమతి వి. పద్మ, నర్సింగ్ సూపరింటెండెంట్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలైన కోలనూర్, ఎలిగేడ్, రాఘవాపూర్, గద్దలపల్లి, గర్రెపల్లి ల వైద్యాధికారులు, సిబ్బంది పాల్గోన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే దంపతులు...



మంథని, చేరాల రవీందర్ డిసెంబర్-12 ( నేటి శుభోదయ): హన్మకొండ ఎస్. కే. క్రౌన్ కన్వెన్షన్ లో గొల్లపల్లి ఉమారాణి -వెంకటేశ్వరరావు దంపతుల పుత్రుడు షిరిడీ రావు - దీప్తిల వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ - శైలజ దంపతులు

## దొడ్డి కొమరయ్య కురుమ ఆత్మగౌరవ భవన ప్రారంభోత్సవనికి ముఖ్యమంత్రి బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కురుమ కులస్తులంత పెద్ద ఎత్తున రావాలని పిలుపు



**(నేటి శుభోదయ):** ప్రతినిధి రాజేంద్రనగర్: హైదరాబాద్ రాజేంద్రనగర్ కోకాపేట్ లో ఈనెల 14వ తేదీన దొడ్డి కొమరయ్య కురుమ ఆత్మగౌరవ భవన ప్రారంభోత్సవానికి బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కురుమ కులస్తులంట పెద్ద ఎత్తున హాజరుకావాలని కార్పొరేషన్ కురుమ సంఘం అధ్యక్షుడు తాండ్ర రమేష్ కుమార్ కురుమ కోరారు గురువారం బండ్లగూడ సంధ్యా నగర్ లో జరిగిన సంఘం సమావేశంలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కోకాపేట్ లో కొత్తగా నిర్మించిన భవనాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారు అన్నారు ముఖ్యమంత్రితో పాటు మంత్రులు ఇతర ప్రతినిధులు కురుమ సంఘం రాష్ట్ర జిల్లాల మండలాల నాయకులు హాజరవుతారన్నారు బండ్లగూడ కార్పొరేషన్ నుండి పెద్ద ఎత్తున ప్రారంభోత్సవానికి తరలి వెళ్దామన్నారు ప్రతి గడప నుండి కులస్తులు కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు ఈ సమావేశంలో సంఘం సభ్యులు అనంతరాజు లక్ష్మణ్ మనోహర్ మల్లేష్ పి రమేష్ ఆంజనేయులు విజయ్ కృష్ణయ్య మల్లేశం సత్యనారాయణ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకలో మాజీ ఎమ్మెల్యే, జైపాల్ యాదవ్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్




**(నేటి శుభోదయ):** ప్రతినిధి తలగొండపల్లి: రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన దొండేటి ఎలమందరెడ్డి కూతురి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన కల్వకుర్తి మాజీ శాసనసభ్యులు గుర్క జైపాల్ యాదవ్ ,మరియు బీ.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సి ఎల్. శ్రీనివాస్ యాదవ్ మరియు ఎలమంద రెడ్డి,నర్సింహ కుటుంబ సభ్యులు శ్రేయోభిలాషులు కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు..

# పల్లెమోని సుదర్శన్ ఆధ్వర్యంలో సన్మాన సభ

**ఆమనగల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గా ముదిరాజ్ బిడ్డ యట గీత నరసింహా కు ఘన సన్మానం**

**(నేటి శుభోదయ):** ప్రతినిధి తలకొండపల్లి: రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రంలో



ముదిరాజ్ సన్మాన సభ తల కొండపల్లి మండల కేంద్రంలో ముదిరాజ్ మండల అధ్యక్షుడు పల్లెమోని సుదర్శన్ ఆధ్వర్యంలో సన్మాన సభ ఏర్పాటు చేయడం జరిగింది ఆమనగల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గా యట గీత నరసింహ ముదిరాజ్ ఎన్నికైన సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఒక ముదిరాజ్ బిడ్డకు చైర్మన్ గా ఎన్నికైనందుకు తలకొండపల్లి మండల ముదిరాజులు ఈ కార్యక్రమాన్ని జరపడం జరిగింది ఈ సందర్భంగా ముదిరాజుల ఐక్యత గా ఉండాలని సభను ఉద్దేశించి మార్కెట్ చైర్మన్ యట గీతా నరసింహ ముదిరాజ్ మాట్లాడారు మండలంలో ముదిరాజులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమాన్ని వచ్చేసిన తలకొండపల్లి గ్రామ అధ్యక్షుడు బోలా బాలయ్య మండల ప్రధాన కార్యదర్శి పుట్ట పాండు తాలూకా ప్రధాన కార్యదర్శి పద్మ అనిల్ మండల మండల కార్యదర్శి నూకం మహేష్ యూత్ అధ్యక్షులు పుట్ట నాగరాజు ముదిరాజ్ సంఘం పెద్దలు నూకం శేఖర్ సానముని పాండు వెల్జాల్ సొసైటీ అధ్యక్షులు బాలకిష్టయ్య మాజీ సర్పంచ్ భక్తి కుమార్ చంద్రధన బక్కి రాఘవేందర్ ఈసారి బాలకృష్ణ నూకం శివ సొసైటీ అధ్యక్షులు ఈ యాదయ్య కె చెన్నకిష్టయ్య చవిటి రవికుమార్ ముదిరాజ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల సర్వే పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్‌లికోయ శ్రీ హర్ష

### అదనపు కలెక్టర్లు: జే అరుణ శ్రీ ,డి వేణు...



పెద్దపల్లి, డిసెంబర్-12 ( నేటి శుభోదయ): డిసెంబర్ 31 లోపు ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియ పూర్తి



చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఇందిరమ్మ ఇండ్ల సర్వే పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అదనపు కలెక్టర్లు జే .అరుణ శ్రీ, డి.వేణు లతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,.... ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల క్షేత్రస్థాయి స్థితిగతులపై ఇందిరమ్మ ఇండ్ల యాప్ వినియోగిస్తూ సర్వే ప్రక్రియ డిసెంబర్ 31 నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎంపీడీవోలు, మండల పంచాయతీ అధికారులు, తహసిల్దార్ లు, మండల ప్రత్యేక అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించుకుని సర్వే చేపట్టాలని, ప్రతి గ్రామానికి/ మున్సిపల్ వార్డుకు ఒక ప్రత్యేక అధికారిని నియమించి, ఆయన ద్వారా ఇందిరమ్మ యాప్ లో లాగిన్ అయ్యి వివరాలను పక్కగా నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే పై ప్రజలకు అవగాహన కల్పించాలని, సర్వే జరిగే సమయంలో ప్రజలు అందుబాటులో ఉండే విధంగా షెడ్యూల్ గురించి ముందుగానే సమాచారం అందించాలని అన్నారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం సర్వే పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, మండల పంచాయతీ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయిలో మూడో బహుమతి సాధించిన సాయి సాన్విత ను సన్మానించిన సనాతన ధర్మ ప్రచారకులు

### శ్రీనివాస్ గుప్తా...- మేడగొని రాజమౌళి గౌడ్



మంథని, చేరాలరవీందర్, డిసెంబర్ -12,**(నేటి శుభోదయ):** మంథని పట్టణంలోని కాకతీయ పాఠశాల, శ్రీ భగవద్గీత కంఠస్థ పోటీలలో రాష్ట్రస్థాయిలో మూడో బహుమతి సాధించిన ఐదవ తరగతి విద్యార్థిని కందునూరి సాయి సాన్విత ను, తండ్రి సంతోష్ ను సనాతన ధర్మ గీత ప్రచార సమితి ఆధ్వర్యంలో




గీత జయంతి పురస్కరించుకొని మంతినిలో ఇంటింట భగవద్గీత 555వ రోజు పూర్తి చేసుకున్న సందర్భంలో ఘనంగా సన్మానించడం జరిగినది సనాతన ధర్మ ప్రచారంలో భాగంగా ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు కొత్త శ్రీనివాస్ గుప్తా, జిల్లా ప్రముఖ కనుకుంట్ల స్వామి,సలహాదారు రామడుగు మారుతి రావు, సనాతన ధర్మ గీత ప్రచారకులు మేడగొని రాజమౌళి గౌడ్, తూర్పాటి రాము,గీతా కమిటీ ఉపాధ్యక్షురాలు గాదె లావణ్య టీచర్, కాకతీయ హై స్కూల్ హెచ్ఎం ప్రదీప్ రెడ్డి, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజేతను అభినందించడం జరిగినది ఈ సందర్భంలో కాకతీయ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ... సనాతన ధర్మ గీతా ప్రచార సమితి వారికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. తెలుగు బోధించే ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.సనాతన ధర్మ గీతా ప్రచార సమితి తమ కార్యకలాపాలలో సహాయ సహకారాలు అందిస్తున్న వారందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## దత్తాత్రేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

### ఐటీ మినిస్టర్ దుద్దిల్ల శ్రీధర్ బాబు..



మంథని, చేరాలరవీందర్, డిసెంబర్ -12,**(నేటి శుభోదయ):** మంథని పట్టణంలోని, అయ్యప్ప



దేవాలయం, శ్రీ దత్తాత్రేయ స్వామి దేవాలయంలో దత్తాత్రేయ నవరాత్రోత్సవాల భాగంగాస్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రిశ్రీధర్‌బాబుమాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఐ స్టఐశ్వర్యాలతో, ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మంతిని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయిలి ప్రసాద్, మంథని సింగిల్విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్, హనుమంతరావు, వి కె రవి, శశి భూషణ్ కాచే, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అయ్యప్ప మాలలు ధరించిన స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి తుమ్మలను కలిసిన భూ నిర్వాసితులు



కొదుమూరి జగన్నాదం ,ఖమ్మం,**(నేటి శుభోదయ):** ఖమ్మం శివారులో నేషనల్ హైవేలో తమ భూములు కోల్పోతున్న నిర్వాసితులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిశారు. తమకు న్యాయం చేయాలని మంత్రి తుమ్మలను కోరారు.అనంతరం వారి సమస్యను విన్న మంత్రి సమస్యను పరిష్కారించాలని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్కు సూచించారు.అనంతరం భాదితులు కలెక్టర్ గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.నాలుగు రోజుల్లో సమస్యను పరిష్కారిస్తానని కలెక్టర్ వారికి హామినివ్వడంతో శాంతించారు.

## జర్నలిస్టులపై దాడిని తీవ్రంగా ఖండించిన,తలకొండపల్లి జర్నలిస్టులు



ప్రతినిధి తలకొండపల్లి**(నేటి శుభోదయ):** మోహన్ బాబు పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు జర్నలిస్టులపై దాడులుచేయడం తగదు సమాజంలో నాలుగుదిక్కుల సమాచారాన్ని అందిస్తూప్రజలకు ప్రభుత్వానికి వారధిగాఉంటూ పనిచేస్తున్న జర్నలిస్టులపై దాడులు చేయడం సమంజసంకాదని తలకొండపల్లి మండలం ప్రెస్ సంఘంఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహంముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తంచేస్తూ మోహన్ బాబు డౌన్ డౌన్ అంటూనినాదాలు చేశారు ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులను అవమానించిన,వారి పట్ల ఎలాంటి అసభ్య ప్రవర్తన చేసినఅలాంటి వారిపై ప్రభుత్వం తగినచర్యలు తీసుకుంటూ జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగాలని కోరారు మంచుఫ్యామిలీ జర్నలిస్టుపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం ఇలాంటి సంఘటనలు మరోసారి పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలి సమాజానికి మంచి చేసేపనిలో నిమగ్నం అయ్యే జర్నలిస్టు సమాజానికి దిక్సూచి అని తెలిపారు అలాంటివారిపట్ల అందరూకృతజ్ఞత భావంతో మెలగాలనితెలిపారు ఈకార్యక్రమంలో జర్నలిస్టులకుమద్దతుగా తలకొండపల్లి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటి విద్యార్థి మృతి నివేదిక కోరిన ఎస్టీ కమీషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు





విశాఖపట్నం జిల్లా ( నేటి శుభోదయ ): శ్రీకాకుళంలో ట్రిపుల్ ఐటి విద్యార్థి ప్రవీణ్ నాయక్ మృతి పట్ల రాష్ట్ర ఎస్టీ కమీషన్ చైర్మన్ డాక్టర్ డి వి జి శంకరరావు విచారం వ్యక్తం చేసారు.విద్యార్థి మృతిపై కళాశాల యాజమాన్యం, జిల్లా యంత్రాంగంతో గురువారం ఆయన మాట్లాడారు. విద్యార్థి మృతికి గల కారణాలపై సమగ్ర నివేదిక అందజేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఈ సందర్భంగా కోరారు. ప్రవీణ్ నాయక్ కుటుంబానికి కమీషన్ చైర్మన్ డివిజి శంకరరావు సంతాపం తెలిపారు.

## విజయవాడలో విజన్ స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమానికి పాతపట్నం ఎమ్మెల్యే ఎంజీఆర్



విశాఖపట్నం జిల్లా **(నేటి శుభోదయ):** విజయవాడ ఇందిర గాంధీ స్టేడియం లో జరగబోయే విజన్ స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమానికి పాతపట్నం నియోజకవర్గం గౌరవ శాసనసభ్యులు మామిడి గోవిందరావుతో పాటు ఐదుమండలాల నాయకులు మరియు కార్యకర్తలు తరలివెళ్ళటం జరిగింది.ఈ సందర్భంగా ఎంజీఆర్ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పసుపు జెండాలతో, జై తెలుగు దేశం నినాదాలుతో సందడి చేశారు.

## త్వరలో కూతపెట్టనున్న హైడ్రోజన్ రైలు




విశాఖపట్నం జిల్లా ( నేటి శుభోదయ ) :దేశంలో త్వరలోనే హైడ్రోజన్ తో నడిచే రైళ్లను భారత రైల్వే సంస్థ పట్టాలు ఎక్కించబోతోంది. హర్యానా లోని జింద్-సోనిపట్ మధ్య 90 కిలోమీటర్ల మార్గంలో తొలి హైడ్రోజన్ రైలును పరీక్షించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. వచ్చే నెలాఖరులో ఈ ప్రయోగాత్మక పరిశీలన మొదలు కానుంది. పర్యావరణానికి ఏమాత్రం హాని చేయని ఈ హైడ్రోజన్ రైళ్లను తొలుత ప్రకృతి అందాలతో అలరారే హిల్ స్టేషన్లలోని రూట్లలో నడపాలని భారత రైల్వే శాఖ ప్రాథమికంగా నిర్ణయించింది.

## దేశంలో షుగర్ పేషెంట్లలో తమిళనాడు టాప్ ప్లేస్



విశాఖపట్నం జిల్లా ( నేటి శుభోదయ ): దేశంలో అత్యధిక మంది షుగర్ పేషెంట్లు తమిళనాడులో ఉన్నారని కేంద్రంతెలిపింది. అక్కడ 80.90లక్షల మంది వ్యాధిబారిన పడినట్లు పేర్కొంది. ఈ జాబితాలో రెండో స్థానంలో మహారాష్ట్ర(39.81 లక్షలు), మూడో ప్లేస్లో కేరళ (28.74 లక్షలు), 4వ స్థానంలో తెలంగాణ(24.52 లక్షలు) నిలిచాయి. ఇక ఏపీలో 20.92 లక్షల మంది షుగర్ పేషెంట్లు ఉన్నారు. అత్యల్పంగా ఢిల్లీలో 1,108 మంది బాధితులే ఉండటం గమనార్హం.

## వైస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లి వెంకట సత్యన్నారాయణను కలిసిన రెడ్డి శాంతి



విశాఖపట్నం జిల్లా ( నేటి శుభోదయ ):శ్రీకాకుళం : వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కిల్లి వెంకట సత్యనారాయణని దుశ్శాలువతో సత్కరించిన మాజీ శాసనసభ్యులు శ్రీమతి రెడ్డి శాంతి. వైఎస్ జగన్మోహన్ రెడ్డితో పార్టీ ఆవిర్భావం నుంచి ఆయన వెంట అంకితభావంతో పనిచేస్తున్న కిల్లి వెంకట సత్యనారాయణ వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైనందున పాతపట్నం మాజీ ఎమ్మెల్యే శ్రీమతి రెడ్డి శాంతి, శ్రీకాకుళం లోని కిల్లి సత్యన్నారాయణ నివాసం వద్ద ఆయనను మర్యాద పూర్వకంగా కలసి దుశ్శాలువతో సత్కరించి అభినందనలు తెలియజేసారు ఈ కార్యక్రమంలో కొత్తూరు మాజీ కోపరేటివ్ సొసైటీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణతో పాటు మండలస్థాయి నాయకులు పాల్గొన్నారు.

## ఏపీలో 4 పంచాయతీలకు జాతీయ అవార్డులు

### రాష్ట్రపతి చేతుల మీదగా అవార్డులు




విశాఖపట్నం జిల్లా ( నేటి శుభోదయ ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 4 గ్రామ పంచాయతీలకు నేషనల్ అవార్డులు వచ్చాయి.వివిధ కేటగిరీల్లో భాగంగా బుధవారం ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అవార్డులు ప్రదానం చేశారు. ఆరోగ్యకర కేటగిరీలో చిత్తూరు జిల్లాలో బొమ్మ సముద్రం, పచ్చదనం-పరిశుభ్రత కేటగిరీలో అనకాపల్లి జిల్లాలో తగరంపూడికి, సంతృప్తికర తాగునీరు కేటగిరీలో అనకాపల్లి జిల్లాలో న్యాయం పూడికి, సామాజిక భద్రతలో ఎన్టీఆర్ జిల్లాలో ముప్పాళ్ల పంచాయతీలకు అవార్డులు వరించాయి.

## ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పై మంత్రి తుమ్మల సమీక్ష సమావేశం



కొదుమూరి జగన్నాదం ,ఖమ్మం**(నేటి శుభోదయ):** మున్సిపల్ కార్యాలయం లో మేయర్ అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో శానిటేషన్ ఇంజినీరింగ్ పనులు రోడ్ల విస్తరణ పార్క్ ల అభివృద్ధి తాగునీరు సరఫరా అంశాలపై సమీక్ష చేసి ప్రజా పాలనలో నగర వాసులు ప్రశాంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల అధికారులకు సూచించారులికార్పోరేషన్ విధులను పకడ్బందీగా నిర్వహించాలి... రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు రాబోయే 50 సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయాలి పారిశుధ్య సమస్యలపై కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలి మంచి నీటి సమస్య రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి వర్షాకాలం కంటే ముందు ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తి కావాలి వర్షాకాలం కంటే ముందు రాజమండ్రి రహదారి పూర్తి కావాలి మునిసిపల్ కార్యకలాపాలపై సంబంధిత అధికారులతో సమీక్షించిన మంత్రి తుమ్మల

## మహిళల సాధికారతకు నరేంద్ర మోడీ ఎల్ఐసీతో నయా ప్లాన్




విశాఖపట్నం జిల్లా ( నేటి శుభోదయ ): మహిళల సాధికారతకు ప్రధాని మోదీ ప్రత్యేక పథకాన్ని తీసుకొచ్చారు. ఎల్ఐసీతో కలిసి 'బీమా సఖి' అనే స్కీంను లాంచ్ చేశారు. ఈ పథకంలో చేరిన మహిళలకు ప్రభుత్వం ప్రతి నెల రూ.7,000 వరకు ఆర్థిక సాయం అందిస్తుంది. ఇలా మూడేళ్ల పాటు ఆర్థికసాయం అందిస్తారు.పథకంలో చేరిన వారికి ముందుగా శిక్షణ ఇచ్చి నెల నెల ఆర్థిక సాయం అందిస్తారు. పథకంలో చేరడానికి సమీప ఎల్ఐసీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు.


## గోవాలో ఘనంగా నటి కీర్తి సురేష్ పెళ్లి



**స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ పెళ్లి గోవాలో ఘనంగా జరిగింది**

విశాఖపట్నం జిల్లా ( నేటి శుభోదయ ): తన బాయ్ ఫ్రెండ్ ఆంటోనీని కీర్తి సురేష్ పెళ్లి చేసుకున్నారు అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యులు మాత్రమే వీరి వివాహానికి హాజరయ్యారు సామాజిక మాధ్యమాల్లో తన పెళ్లి ఫోటోలను కీర్తి షేర్ చేశారు.

## అతి చిన్న వయస్సులోనే కమర్షియల్ పైలెట్ లైసెన్స్ పొందిన



### కర్ణాటకకు చెందిన 18 ఏళ్ల సమీరా.

**విశాఖపట్నం జిల్లా ( నేటి శుభోదయ ): భారతదేశంలోనే అత్యంత పిన్న వైయస్కురాలైన పైలెట్ గా నమోదు అయ్యింది.**

## ఏపీలో అనర్హులకు పెన్షన్లు!




విశాఖపట్నం జిల్లా ( నేటి శుభోదయ ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనర్హులు కూడా పెన్షన్లు అందుకుంటున్నట్లు స్పష్టం అవుతోంది.ప్రతీ 10వేల మంది లో ఏకంగా దాదాపు 500 మంది అనర్హులే పెన్షన్లు తీసుకుంటున్నట్లు గుర్తించారు. రెండోరోజు కలెక్టర్ల కాన్ఫరెన్స్ పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖలపై ఆ శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్ ప్రజెంటేషన్ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నికలకు ముందు 6లక్షల మందికి హడావుడిగా పెన్షన్లు ఇచ్చారని మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యానించారు.

## జమిలి' బిల్లు.. ఆమోదం పొందాలంటే!




విశాఖపట్నం జిల్లా ( నేటి శుభోదయ ): ఒకే దేశం-ఒకే ఎన్నిక విధానం కోసం రూపొందించిన బిల్లు జమిలి బిల్లు.ఈ జమిలి బిల్లు ఆమోదం పొందాలంటే.. ఉభయసభల్లోనూ మూడింట రెండోవంతు మెజారిటీ కచ్చితంగా అవసరం. అంటే రాజ్యసభలో 245 మంది సభ్యులంటే.. కనీసం 164 ఓట్లు పడాలి. లోక్సభలో 545 మంది సభ్యులుంటే.. 364 ఓట్లు రావాలి. న్ డి ఏ ప్రభుత్వం సాధారణ మెజారిటీతోనే నడుస్తోంది. కాబట్టి.. ఓటింగ్ సమయానికల్లా మూడింట రెండోవంతు మెజారిటీ మద్దతు సంపాదించుకోవాల్సి ఉంటుంది.

## 'సరస్వతి' భూములు వెనక్కి తీసుకున్న ప్రభుత్వం



విశాఖపట్నం జిల్లా ( నేటి శుభోదయ ): ఏపీలో సరస్వతీ పవర్ ఇండస్ట్రీస్ లోని అసైన్డ్ భూములను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. మాచవరం మండలం మేఘవరంలో 13.80 ఎకరాలు, పిన్నెల్లి గ్రామంలో 3.89 ఎకరాలు.. మొత్తం 17.69 ఎకరాల అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకుంది. ఈమేరకు తహసీల్దార్ ఉత్తర్వులు జారీ చేశారు.

## ఏపీలో తల్లిదండ్రులు చనిపోయిన పిల్లలకూ పింఛన్లు ఇవ్వాలి



విశాఖపట్నం జిల్లా ( నేటి శుభోదయ ): ఏపీలో తల్లిదండ్రులు చనిపోయిన చిన్నారులకూ పింఛన్లు ఇవ్వాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. కలెక్టర్ల సదస్సులో ఈమేరకు ఆయన సూచించారు. ఇక రానున్న 3 నెలల్లో అనర్హులను గుర్తించి పింఛన్లు కట్ చేయాలని స్పష్టం చేశారు.ఆ తర్వాత కూడా అనర్హులు తేలితే కలెక్టర్లను బాధ్యులను చేస్తానని హెచ్చరించారు కాగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6 లక్షల మంది అనర్హులకు పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.

## పందుల స్వైర విహారం



ముత్తారం మండల ప్రతినిధి: నేటి శుభోదయ: డిసెంబర్-12 : ముత్తారం మండలం కేంద్రంలోని రెండవ వార్డ్ లో పందులు స్వైర విహారం చేస్తూ జనావాసాల పరిసర ప్రాంతాలను మలమూత్రాలు విసర్జనాలతో అపరిశుభ్రం చేస్తూ పసి పిల్లలపై దాడులకు యత్నిస్తుండటంతో స్థానిక ప్రజలు ముత్తారం గ్రామపంచాయతీ సెక్రటరీకి ఫిర్యాదు చేయగా స్పందించిన సెక్రటరీ విచారణ చేయగా రెండవ వార్డ్ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్న పందులు అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన కేతిరి సదానందం, భూమేష్ లకు చెందినవిగా తెలియగా అడవి శ్రీరాంపూర్ గ్రామపంచాయతీ సెక్రటరీని సంప్రదించి కేతిరి సదానందం, భూమేష్ లకు నోటీసులు జారీ చేస్తూ పందుల పెంపకం జనావాసాలకు ఇబ్బందులు కలగకుండా నిర్వహించుకోవాలని సూచిస్తూ ఇకపై పందుల వలన గ్రామాలలో ఏమైనా సమస్యలు తలెత్తినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


## ఏపీ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు

### ట్రాఫిక్ చలాన్ కట్టకపోతే ఇళ్లకు విద్యుత్, నీళ్ల సరఫరా ఆపేయాలని ఆదేశాలు



విశాఖపట్నం జిల్లా ( నేటి శుభోదయ ): ఏపీ నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాల డ్రైవర్లు తెలంగాణ సరిహద్దుకు వెళ్లగానే సీట్ బెల్ట్ పెట్టుకుంటున్నారని వ్యాఖ్యలు పోలీసులు, అధికారులు కఠినంగా వ్యవహరించడం లేదని నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని ఆగ్రహం ఏపీలో హెల్మెట్ ధరించక పోవడం వల్ల మూడు నెలల్లో 667 మంది మృత్యువాత పడ్డారని.. నిబంధనలు సరిగ్గా అమలు చేయకపోవడం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువ అవుతున్నాయని దాఖలైన పిటిషన్‌పై విచారణ..

## రేషన్ మాఫియాపై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు




విశాఖపట్నం జిల్లా ( నేటి శుభోదయ ): రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై పీడీ యాక్ట్ అమలు చేస్తామని తెలిపారు. అక్రమ సరఫరా చేసే వాళ్లు చాలా స్ట్రాంగ్ మాఫియాగా తయారయ్యారని పేర్కొన్నారు.దీనిని ఏ విధంగా కంట్రోల్ చేయాలోఆలోచిస్తున్నామని స్పష్టం చేశారు. రేషన్ బియ్యం అక్రమ సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తేల్చి చెప్పారు...

## ఏపీలో ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకు కొత్త యూనిఫాం



విశాఖపట్నం జిల్లా ( నేటి శుభోదయ ): ఏపీలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందించనున్న సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లకు సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది నుంచి స్టూడెంట్స్ కు కొత్త యూనిఫామ్ అందుబాటులోకి తేనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న యూనిఫామ్, బెల్టులు, బ్యాగ్ల రంగులను మారుస్తోంది. కొత్త యూనిఫామ్ నమూనా సోషల్ మీడియాలో వైరలవుతోంది.

## రాజమండ్రి - ఢిల్లీకి నేటి నుంచి విమాన సర్వీసులు

విశాఖపట్నం జిల్లా ( నేటి శుభోదయ ): రాజమండ్రిలోని మధురపూడి విమానాశ్రయం నుంచి ఢిల్లీకి నేడు(గురువారం విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి. 6ఈ 364 ఇండిగో విమాన సర్వీసు నేటి నుంచి రోజూ రాకపోకలు సాగించనుంది. ఈ విమానం ఉదయం 6.30గం.కు ఢిల్లీ నుంచి మధురపూడికి, ఇక్కడి నుంచి ఉదయం 9.30గం.లకు ఢిల్లీకి బయలుదేరుతుందని అధికారులు చెప్పారు. ఇప్పటికే రాజమండ్రి నుంచి ముంబైకి విమాన సర్వీసులు ప్రారంభం కాగా, తాజా సర్వీసుతో ఉభయగోదావరి ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## ఏప్రిల్ 1 నుంచి గూగుల్ పే కానీ ఫోన్ పే కానీ ఇతర




విశాఖపట్నం జిల్లా ( నేటి శుభోదయ ): ఏ యూపీఐ ద్వారైన 2 వేలకు పైన అమౌంట్ ట్రాన్స్ఫర్ చేస్తే 1.1% ట్యాక్స్ పడనున్నాయి... ఉదాహరణకు ఎవరికైనా 10 వేలు పంపిస్తే 110 రూపాయిలు ట్యాక్స్ రూపం లో కట్ అవుతాయి ...

## ముత్తారం మండల రైతులకు సూచన



ముత్తారం మండల ప్రతినిధి(**నేటి శుభోదయ**): డిసెంబర్-13: ముత్తారం మండలంలోజాతీయ రహదారి పనులు ప్రారంభమయ్యాయని, మండలంలోని ఓడెడు, ముత్తారం, కేశనపల్లి,అడవిశ్రీరాంపూర్, మైదంబండ, సర్వారం,పోతారం, లక్కారం గ్రామాల నుండి జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతాయి కాబట్టి ఆయా గ్రామాల రైతులు ఈ పంట కాలం నుండి వారి వారి భూముల్లో ఎటువంటి పంటలను వేయకుండా ఉండాలని మండల వ్యవసాయ అధికారి అనూష తెలిపారు.

## సెమీ క్రిస్టమస్ వేడుకల్లో పాల్గొన్న వైఎస్ జగన్



తాడేపల్లి: వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా వైఎస్ జగన్ కేక్ కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ జగన్ మేనత్త వైఎస్ విమలమ్మ, వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ బి.జాన్ వెస్లీ, పాస్టర్ టి.ఎస్.ఆర్ ప్రసాద్ రెడ్డి (కవితం), పాస్టర్ జీవన్ కుమార్ (ఏపీపీఎఫ్, ఏలూరు), బిషప్ రెబ్బ ఇమ్మాన్యుయేల్ (రేపల్లె), రెవరెండ్ వి.కే.జేమ్స్ కుంపట్ల (ఏడిఎఫ్, విశాఖపట్నం), రెవరెండ్ ఎన్.ఐ.సోలోమన్ రాజు (వరల్డ్ విజన్, అవనిగడ్డ), రెవరెండ్ డి.రాజశేఖర్ (ఎన్‌బిఎమ్, నెల్లూరు), రెవరెండ్ ఎం.సుధాకర్ పాల్ (సీఎంసీ, వైజాగ్), రెవరెండ్ విజయ్ కిషోర్ (కడప), రెవరెండ్ మనోజ్ బాబు (తణుకు), బిషప్ శ్రావణ్ కుమార్ (కోనసీమ జిల్లా), పాస్టర్ శ్రావణ్ (తూర్పు గోదావరి), పాస్టర్ గెరా హనోక్ (ఏఐసీసీ ప్రెసిడెంట్), బ్రదర్ కమలాకర్ (ఏఐసీసీ, విజయవాడ), పాస్టర్ కే.ఎలిషా (గణపవరం), పాస్టర్ జాషువా మూర్తి (విజయవాడ), పాస్టర్ మోజెస్ (విజయవాడ), జేసు రత్నాకర్ (మెజిస్ట్రేట్, గుంటూరు), బ్రదర్ వై.ప్రసాద్ బాబు (విశాఖపట్నం) పాల్గొన్నారు.

## తిరుమలలో భారీ వర్షం.. సీమకు ఎల్లో అలర్ట్

తిరుమల/విశాఖపట్నం: అల్పపీడనం ప్రభావంతో ఏపీలో పలు చోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. రెండు రోజులుగా తిరుమలలో ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. ఒకవైపు వర్షం.. పెరిగిన చలి తీవ్రత కారణంగా భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తిరుమలలో బుధవారం అర్ధరాత్రి నుంచి భారీ వర్షం కురుస్తోంది. వర్షాల నేపథ్యంలో ఘాట్ రోడ్డుల్లో వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలని అధికారులు సూచించారు. కొండచరియలు విరిగేపడే ప్రమాదం ఉండటంలో సిబ్బంది అప్రమత్తమయ్యారు. పాపవినాశనం, శ్రీవారి పాదాలకు వెళ్లే మార్గాలను తాత్కాలికంగా మూసివేశారు. అలాగే, గోగర్భం, పాపవినాశనం జలాశయాలలో పూర్తిగా నిండిపోవడంతో అధికారులు గేట్లు ఎత్తారు. వర్షం కారణంగా తిరుమలకు వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు.. నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం నేడు వాయుగుండంగా బలపడే అవకాశం ఉంది. దక్షిణ తమిళనాడు, శ్రీలంక తీరాలపై వాయుగుండం ప్రభావం చూపుతుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో ఏపీలోని దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో వర్షాలు విస్తారంగా కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో రాయలసీమతో పాటుగా దక్షిణ కోస్తా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఇదిలా ఉండగా.. తిరుపతి నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆర్టీసీ బస్టాండ్, బాలాజీ కాలనీ, కోర్లగుంట, సత్యనారాయణ పురం, లక్ష్మి పురం సర్కిల్‌లో రోడ్లపైకి భారీగా వర్షం నీరు చేరుకుంది. వెస్ట్ చర్చి రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి వద్ద వర్షం నీరు భారీగా చేరుకుంది. దీంతో, వన్ వేలోనే వాహనాల రాకపోకలకు పోలీసులు అనుమతిస్తున్నారు. భారీ వర్షాల సూచనల నేపథ్యంలో గురువారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు, అంగన్వాడీ కేంద్రాలకు ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ శుభం భన్సల్ సెలవు ప్రకటించారు.

## ఒకే దేశం.. ఒకే ఎన్నికలు బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ : నరేంద్రమోడీ నాయకత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఒకే దేశం ఒకే ఎన్నికలు (వన్ నేషన్ వన్ ఎలక్షన్) బిల్లుకు గురువారం కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఎన్నికల సంస్కరణల పేరుతో పార్లమెంట్, దేశంలోని అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలనే లక్ష్యంతో ఈ బిల్లు తీసుకొచ్చింది. కేబినెట్ ఆమోదం పొందిన దరిమిలా ఈ బిల్లును ప్రస్తుత శీతాకాల పార్లమెంటు సమావేశాల్లోనే సభలో ప్రవేశపెట్టాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకే ఈ బిల్లుకు కేబినెట్ ఆమోదం లభించింది. ఈ బిల్లును పార్లమెంట్ కూడా ఆమోదిస్తే. అనంతరం రాష్ట్రపతి ఆమోదానికి పంపుతారు. ఈ బిల్లుగనుక అమలులోకి వస్తే లోక్ సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ ఎన్నికలు జరిగిన 100 రోజులు లేదా మూడు నెలల్లో దేశం మొత్తం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి వుంటుంది. గతంలో ఈ ఎన్నికలకు సంబంధించి 18,629 పేజీలతో కోవింద్ కమిటీ నివేదిక ఇచ్చిన విషయం తెలిసిందే.

## గ్రేటర్ నగరాలలోని మద్యం ప్రియులకు గుడ్ న్యూస్ చెప్పిన ఏపీ ప్రభుత్వం....

### ఆరునెలల కిందట ఏర్పాటైన కూటమి ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన లిక్కర్ పాలసీలో మందుబాబుల కోసం తీసుకొచ్చిన మరో ప్రాజెక్టు ఇది.



విశాఖపట్నం జిల్లా ( నేటి శుభోదయ ): రాష్ట్రంలోని 12 ప్రధాన నగరాల్లో ప్రీమియం మద్యం స్టోర్ల ఏర్పాటుకు ఎక్సైజ్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ శాఖ తాజాగా మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ స్టోర్ల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఈ ప్రీమియం మద్యం స్టోర్ల ఏర్పాటు ద్వారా ప్రభుత్వానికి ఆదాయం పెరుగడమే కాకుండా వినియోగదారులకు వివిధ రకాల బ్రాండ్లతో పాటు అధిక సేవలందించాలనే ఉద్దేశ్యంతో ఈ చర్య తీసుకుంది. డిపాజిట్: లైసెన్సుకు నాన్ రిఫండబుల్ డిపాజిట్ రూ. 15 లక్షలు. లైసెన్సు ఫీజు: సంవత్సరానికి రూ. కోటి, ప్రతి ఏడాది 10% పెరుగుదల ఉంటుంది. గెజిట్ నోటిఫికేషన్: విజయవాడ, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, కాకినాడ, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, కడప, అనంతపురం వంటి ప్రధాన నగరాల్లో ఈ స్టోర్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటన. కార్పెట్ ఏరియా: కనీసం 4,000 స్క్వేర్ ఫీట్ ఉండాలి. ఫ్లోర్ ప్లాన్: దరఖాస్తుతో పాటు ప్రాంగణానికి సంబంధించిన ఫ్లోర్ ప్లాన్ సమర్పణ తప్పనిసరి.

ఆర్థిక పత్రాలు:

మూడేళ్ల ఐటీ రిటర్న్, బ్యాంకు అధికారుల ధ్రువీకరణతో కూడిన బ్యాంకుస్టేట్‌మెంట్లు, సాల్వెన్సీ సర్టిఫికెట్ సమర్పించాలి.

దరఖాస్తు విధానం:

ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తుల పరిశీలన విధానం

మూస అభ్యర్థనల పరిశీలన: ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్, సహాయ కమిషనర్, జిల్లా ఎక్సైజ్ అధికారులతో కూడిన కమిటీ ప్రతిపాదిత ప్రాంగణాల పరిశీలన చేస్తుంది. ప్రయర్ క్లియరెన్స్: కమిటీ నివేదికను పరిశీలించిన తర్వాత, ఎక్సైజ్ కమిషనర్ ప్రభుత్వానికి ముందస్తు అనుమతి కోసం ప్రతిపాదనలు పంపుతారు హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో ఏర్పాటు చేసిన కమిటీ దరఖాస్తుల మదింపు నిర్వహిస్తుంది. మదింపు ప్రక్రియలో ఐఐఎంలు, నిపుణుల సూచనలను తీసుకొని దరఖాస్తుదారుల ఆర్థిక సామర్థ్యాన్ని అంచనా వేస్తారు. ముగింపు ప్రక్రియ: అన్ని పరిశీలనలు పూర్తి చేసిన తర్వాత, దరఖాస్తుదారులు 45 రోజులలోపు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ చెల్లించాలి. ఫైనల్ లైసెన్సు: నిబంధనల ప్రకారం అన్ని అంగీకారాలు పొందిన దరఖాస్తుదారులకు లైసెన్సు జారీ చేస్తారు.

ప్రత్యేకతలు

ట్రేడ్ మార్జిన్: మద్యం ఇష్యూ ప్రైస్ పై 20% ట్రేడ్ మార్జిన్ చెల్లింపు ఉండనున్నట్టు జీఓలో ఎక్సైజ్ శాఖ పేర్కొంది.

నోటిఫికేషన్: ఏ నగరాల్లో ఎన్ని స్టోర్లు ఏర్పాటు చేయనున్నారో త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేస్తారు.

దరఖాస్తు సమర్పణ: నోటిఫికేషన్లో దరఖాస్తు సమర్పణ ప్రారంభ, ముగింపు తేదీలను ప్రకటిస్తారు.

అంతిమ లక్ష్యం:

ఈ ప్రక్రియ ద్వారా రాష్ట్రంలో మద్యం విక్రయాల్లో పారదర్శకత, అధునాతన మద్యం అందుబాటు వంటి అంశాలను మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని ఎక్సైజ్ శాఖ ప్రకటించింది.

# సిరియాలో పెనుమార్పులు




సిరియాలో ఐదు దశాబ్దాల అసద్ వంశీయుల నిరంకుశ పాలనకు తెరపడింది. తిరుగుబాటు దళాలు రాజధాని డమాస్కస్‌ను చుట్టుముట్టిన వేళ అధ్యక్షుడు బషర్ అల్ అసద్ మాస్కోకు పారిపోయి తలదాచుకున్నాడు. తిరుగుబాటు దళాలు గాల్లోకి కాల్పులు జరుపుతూ సంబురాలు జరుపుకొంటున్నాయి. ఒకప్పటి అల్ కాయిదా నేత అహ్మద్ అల్ శరా తన గతాన్ని, పాత మారు పేరును వదిలించుకొని సిరియా పగ్గాలు చేపట్టారు. ఈ పరిణామాలు అంతర్యుద్ధంతో పదిహేనేండ్ల కాలంపాటు కకావికలమైపోయిన సిరియాకు శాంతిని ప్రసాదించగలవా? లేక పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టు అవుతుందా అనేదే అసలు ప్రశ్న. అసద్ ప్రభుత్వ పతనం తర్వాత జరుగుతున్న కొన్ని పరిణామాలు కలిగిస్తున్న ఆందోళనే ఇందుకు కారణం. సందట్లో సడేమియా అన్నట్టుగా ఇజ్రాయెల్ ప్రస్తుత అస్థిర పరిస్థితులను అలుసుగా తీసుకొని దాడులకు తెగబడుతున్నది. సరిహద్దు భూభాగాలను రాత్రికి రాత్రే ఆక్రమించుకుంది. అంతేకాకుండా రసాయనిక ఆయుధ కేంద్రాలు, క్షిపణి స్థావరాలుగా భావిస్తున్న ప్రదేశాలపై బాంబు దాడులకు పాల్పడుతున్నది. అగ్రరాజ్యం అమెరికా 'నేనేం తక్కువ తిన్నానా' అన్నట్టుగా ఇస్లామిక్ స్టేట్ శక్తులను దెబ్బతీసే సాకుతో 75 ప్రదేశాలపై బాంబులు వేసింది. ఈ దాడులు ఏ మాత్రం వాంఛనీయమైనవి కావు. ఈ దుందుడుకు చర్యల పర్యవసానాలు ఎలా ఉంటాయో ఊహించడం పెద్ద కష్టమేమీ కాదు. అంతర్జాతీయ శక్తుల ప్రచ్ఛన్న యుద్ధానికి సిరియా వేదికగా మారిన సంగతి తెలిసిందే.


ప్రధానంగా అమెరికా, రష్యా, సౌదీ అరేబియా, ఇరాన్ తమ తమ ప్రాబల్యం కోసం సిరియాలో రకరకాల శక్తులను వెనకేసుకు వస్తున్నాయి. ఉక్రెయిన్ యుద్ధంలో తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్న రష్యా మద్దతు తగ్గించడం వల్లనే అసద్ ప్రభుత్వం పతనమైందనే వాదనలు వినిపిస్తున్నాయి. షియా-సున్నీ విభేదాలు, రష్యా-అమెరికా తగాదాలకు నెలవుగా మారిన సిరియా బలమైన కేంద్రం అనేది లేకపోవడం కారణంగా ఇప్పుడు జిహాదీ శక్తుల చేతుల్లోకి వెళ్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. ఈ కారణంగా శాంతి ఎండమావిగా మారి, అంతర్జాతీయ ఉగ్రవాదం పెచ్చరిల్లేందుకు ఆస్కారం ఉన్నది. ఇది సిరియాకే కాకుండా యావత్తు ప్రపంచానికి సమస్యగా పరిణమించవచ్చు. ఇందుకు మనకు అఫ్గానిస్థాన్, ఇరాక్ ఉదాహరణలు ఉండనే ఉన్నాయి. అసద్ ప్రభుత్వం కూలిపోవడాన్ని సిరియాలో శాశ్వత శాంతిస్థాపనకు ఒక సువర్ణావకాశంగా ప్రపంచ దేశాలు భావించాలి. 2017లో రష్యా, ఇరాన్, టర్కీ ఆధ్వర్యంలో చేపట్టిన అస్తానా శాంతి చర్చల క్రమాన్ని కొనసాగించాలి. ఉద్రిక్తతలు తగ్గించి, మానవతా సహాయం చేరవేతకు ఎదురవుతున్న అడ్డంకులను తొలగించడం, రాజకీయ చర్చలకు వీలు కల్పించడం అనే త్రిముఖ వ్యూహంతో ఆ చర్చలు మొదలయ్యాయి. 22 విడతల చర్చలు జరిగినా నిర్వాహకులు ప్రత్యర్థి వర్గాలను చెరోవైపున సమర్థిస్తుండటంతో పెద్దగా పురోగతి సాధ్యపడలేదు. అయితే, పరిస్థితి పూర్తిగా నిరాశాజనకంగా ఏమీ లేదు. సంక్షోభం ముదురుతున్న దశలో మొన్నటి శనివారం మూడు నిర్వాహక దేశాలు ఖతార్ రాజధాని దోహాలో సమావేశమై సిరియాలో కాల్పుల విరమణ, రాజకీయ సంప్రదింపులు, స్వేచ్ఛాయుత ఎన్నికల కోసం ఐక్య రాజ్య సమితి భద్రతామండలి చేసిన 2,254 తీర్మానాన్ని అమలుచేయడంపై ఏకాభిప్రాయానికి రావడం ముదావహం. ఇందుకు సంబంధించిన ఉమ్మడి ప్రకటనపై పైన తెలిపిన మూడు దేశాలతో పాటుగా ఈజిప్ట్, సౌదీ అరేబియా, ఇరాక్, జోర్డాన్, ఖతార్ సంతకాలు చేశాయి. ఇదే అదనుగా ఐరాస చొరవ తీసుకొని సుస్థిర ప్రభుత్వం ఏర్పాటు దిశగా కృషిచేయాలి. అంతిమంగా స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణకు వీలైన పరిస్థితులు కల్పించాలి. ప్రపంచ శాంతికి ప్రజాస్వామిక సిరియా హామీగా నిలుస్తుందనడంలో సందేహం లేదు.

# అత్యంత ఉష్ణ ఏడాదిగా 2024

### భూగోళాన్ని ఈ పరిస్థితుల్లోకి నెట్టేస్తున్న హీట్‌వేవ్, వాతావరణ మార్పులు



జీవకోటికి ప్రాణాధారం సూర్యుడు. సూర్య కిరణాల ప్రసరణతో పుడమి పులకిస్తుంది. అదే పుడమి నేడు భానుడి భగభగలతో అల్లాడుతుంది. గ్రీన్ హౌస్ ఎఫెక్ట్ వంటి విపరిణామాలే భూమిపై విపరీత ఉష్ణోగ్రతలకు ముఖ్య కారణాలు. గత కొన్ని నెలలుగా హీట్‌వేవ్‌లు, వాతావరణ మార్పుల కారణంగా ప్రతినెలా ఉష్ణోగ్రతలు అమాంతం పెరుగుతూ పోతున్నాయి. వరుసగా గత 17 నెలల్లో చూస్తే 16 నెలల్లో సగటు ఉష్ణోగ్రత అత్యధికంగా నమోదవుతూ రావడం ఆందోళనకరం. ఇలా నెలల తరబడి సగటు ఉష్ణోగ్రతల్లో పెరుగుదల నమోదవడంతో రాబోయే నెలల్లోనూ అధిక ఉష్ణోగ్రతలు పెచ్చరిల్లే ప్రమాదకర ధోరణి కొనసాగనుందని స్పష్టమవుతోంది. పారిశ్రామికీకరణకు ముందునాటితో పోలిస్తే భూతాపంలో పెరుగుదలను 1.5 డిగ్రీ సెల్సియస్‌లోపునకు పరిమితం చేయాలన్న ప్రపంచ దేశాల ప్రతిజ్ఞ ఇప్పుడు నీరుగారిపోతోంది. ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 1.5 డిగ్రీ సెల్సియస్ దాటి నమోదైన తొలి ఏడాదిగా 2024 నిలవనుందని కోపర్నికస్ క్లైమేట్ ఛేంజ్ సర్వీస్(సీ3ఎస్) తాజాగా ప్రకటించింది. 1991-2020 సగటుతో పోలిస్తే ఈ ఏడాది జనవరి-నవంబర్ కాలంలో ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 0.72 డిగ్రీ సెల్సియస్ ఎక్కువ నమోదైంది. నవంబర్‌లో సైతం గతంలో ఎన్నడూలేనంతటి ఉష్ణోగ్రత నమోదైంది. పారిశ్రామిక విప్లవం ముందునాటితో పోలిస్తే ఈ నవంబర్‌లో 1.62 డిగ్రీ సెల్సియస్ అధిక ఉష్ణోగ్రత నమోదైంది.




### 2024 ఏడాది ఎందుకింత వేడి ?


హరితవాయు ఉద్గారాలు అత్యధికంగా వెలువ డటంతోపాటు ఎన్నో కారణాలు ఈ ఏడాది అత్యధిక ఉష్ణోగ్రతలకు కారణాలుగా నిలుస్తున్నా యని నిపుణులు చెబుతున్నారు. అత్యధిక వేడిమిని సముద్రాల ఉపరితల జలాలు పీల్చుకో వడమూ దీనికి మరో కారణం. విచ్చలవిడి మానవ కార్యకలాపాలు, అడవుల నరికివేత, ఎడారీకరణ తదితరాలు ఈ పరిస్థితిని మరింత ఉష్ణ మంటల్లోకి నెట్టేస్తున్నాయి. వాతావరణంలో కలుస్తున్న మీథేన్ స్థాయిలు సైతం గతంలో ఎన్నడూలేనంతగా పెరిగాయి. పారిశ్రామికీకరణ ముందునాటి కాలంతో పోలిస్తే 2023 చివరినాటికి వాతావరణంలో మీథేన్ గాఢత స్థాయి ఏకంగా 165 శాతం పైకెగసిందని, అధిక ఉష్ణోగ్రతకు ఇదీ ఒక కారణమని అధ్యయనకారులు విశ్లేషణ చేశారు. పారిశ్రామికీకరణ ముందునాటి కాలంతో పోలిస్తే ఉపరితల గాలి ఉష్ణోగ్రత ఈ ఏడాది జనవరి-నవంబర్ కాలంలో 1.54 డిగ్రీ సెల్సియస్ ఎక్కువగా ఉంది. "మానవ ప్రేరేపిత వాతావరణ మార్పుల కోసం సహజ ఎల్-నినో పరిస్థితులూ ఉష్ణోగ్రతల విజృంభణకు మరో కారణం" అని సస్టేన్ ల్యాబ్ పారిస్ సీఈఓ డాక్టర్ మినియా ఛటర్జీ వ్యాఖ్యానించారు.

### పరిస్థితి ఇలాగే ఉంటే ఏమౌతుంది?

అధిక ఉష్ణోగ్రత భరించలేని కష్టాలను మోసుకొస్తాయి. పారిశ్రామికీకరణకు ముందునాటితో పోలిస్తే భూతాపోన్నతిలో పెరుగుదల 1.5 డిగ్రీ సెల్సియస్ దాటితే కరువు, అతి భారీ వర్షాలు, వరదలు సాధారణమవుతాయి. ఇది పర్యావరణానికి, మానవునికి హానికరం. మితిమీరిన వేడి కారణంగా పంటకు నష్టం వాటిల్లుతుంది. దిగుబడి దారుణంగా పడిపోతుంది. జీవజాతులకూ నష్టమే. సాధారణ ఉష్ణోగ్రతల్లో బతికే జీవులు మనుగడ సాధించడం కష్టం. చిన్న జీవుల ఉనికే ప్రశ్నార్థకమవుతుంది. వన్యప్రాణుల సంఖ్య తగ్గుతుంది. హీట్‌వేవ్‌ల కారణంగా హౌలర్ కోతులు, చిన్న పక్షులు అంతరించిపోతాయి. ఉష్ణోగ్రతల్లో వైరుధ్యం కారణంగా జీవవైవిధ్యం దెబ్బతింటుంది. పక్షుల ఎదుగుదల తగ్గుతుంది. " ఉభయచర జీవులు పొదిగే క్రమంతోపాటు ఎండా, వానా, చలికాలాల మధ్య ఉన్న సరిహద్దు రేఖలు చెరిగిపోతాయి. అధిక వేడిమికి పాలిచ్చే జంతువుల మనుగడా కష్టమవుతుంది" అని ది హ్యాబిటెంట్స్ ట్రస్ట్ సారథి రిషికేశ్ చవాన్ చెప్పారు.

### సముద్ర ఉష్ణోగ్రతలూ పైపైకి..

ఈ ఏడాది సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు గతంతో పోలిస్తే పెరిగాయి. ఎక్కువ రోజుల పాటు సముద్ర ఉష్ణోగ్రతలు అధిక స్థాయిల్లో కొనసాగితే పగడపు దిబ్బల ఉనికే ప్రశ్నార్థకమవుతుంది. వేడి పెరిగితే సముద్ర జీవావరణానికి సంబంధించిన ఆహారవలయంలో కీలక పాత్రపోషించే ఈ పగడపు దీవులు కొన్ని ప్రాంతాల్లో పూర్తిగా అంతర్థాన మవడం ఖాయం. అట్లాంటిక్, పసిఫిక్, హిందూ మహాసముద్రాల్లోని 77 శాతం పగడపు దిబ్బల వద్ద అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉష్ణోగ్రతల్లో పెరుగుదల ధోరణికి అడ్డుకట్టవేయకపోతే మళ్లీ పూడ్చలేని నష్టం జరుగుతుందని ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరించింది.



# సంపదలో సరికొత్త రికార్డ్.. ప్రపంచంలోనే తొలి వ్యక్తిగా మస్క్



టెస్లా అధినేత, ప్రపంచ కుబేరుడు 'ఇలాన్ మస్క్' సంపద ఏకంగా 400 బిలియన్ డాలర్లు దాటేసింది. దీంతో ప్రపంచంలోని అత్యంత సంపన్నుడిగా, 400 బిలియన్ డాలర్లు అధిగమించిన మొదటి వ్యక్తిగా.. తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు. బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం, మస్క్ సంపద 447 బిలియన్ డాలర్లు. యుఎస్ అధ్యక్ష ఎన్నికల తరువాత ఈయన సంపద గణనీయంగా పెరిగింది. స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ కంపెనీ స్పేస్‌ఎక్స్ అంతర్గత వాటా విక్రయంతో సంపాదన సుమారు 50 బిలియన్ డాలర్లు పెరిగిందని సమాచారం. అంతే కాకుండా టెస్లా షేర్లు బుధవారం ఆల్-టైమ్ గరిష్ట స్థాయికి చేరుకున్నాయి, ఇది మస్క్ ఆర్థిక స్థితిని మరింత పెంచింది. మస్క్ తరువాత జాబితాలో జెఫ్ బెజోస్ (249 బిలియన్ డాలర్లు), మార్క్ జుకర్‌బర్గ్ (224 బిలియన్ డాలర్లు), లారీ ఎల్లిసన్ (198 బిలియన్ డాలర్లు), బెర్నార్డ్ ఆర్నాల్ట్ (181 బిలియన్ డాలర్లు) ఉన్నారు. మస్క్ సంపద పెరగటానికి టెస్లా, స్పేస్‌ఎక్స్ మాత్రమే కాకుండా.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్టార్టప్ ఎక్స్‌ఏఐ కూడా దోహదపడింది. 2022 వరకు మస్క్ నికర విలువ 200 డాలర్ల కంటే తక్కువ ఉండేది. అయితే అమెరికాలో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలుపొందిన తరువాత.. ఈయన సంపాదన భారీగా పెరిగింది. తాజాగా 400 బిలియన్ డాలర్లు దాటేసింది. మొత్తం మీద 400 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 33.20 లక్షల కోట్లు) నికర విలువను అధిగమించిన మొదటి వ్యక్తిగా ఇలాన్ మస్క్ చరిత్ర సృష్టించారు.

# 'ట్రంప్ రాకముందే నేనే రాజీనామా చేస్తా'



వాషింగ్టన్ : అమెరికా శక్తిమంతమైన దర్యాప్తు సంస్థ ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్విస్టిగేషన్ (ఎఫ్‌బీఐ)లో కీలక పరిణామం చోటు చేసుకుంది. అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ జనవరి 20న బాధ్యతల్ని స్వీకరించనున్నారు. ఆ లోపే తన పదవికి రాజీనామా చేయనున్నట్లు ఎఫ్‌బీఐ డైరెక్టర్ క్రిస్టోఫర్ వ్రే ప్రకటించారు. క్రిస్టోఫర్ నిర్ణయంపై 'గ్రేట్ డే ఫర్ అమెరికా' అంటూ ట్రంప్ ట్రూత్ సోషల్ వేదికగా వ్యాఖ్యానించారు. 'కొంత కాలంగా సుదీర్ఘంగా సాగిన ఆలోచలన తర్వాత, ప్రస్తుత ప్రభుత్వ పాలన ముగిసే వరకు బాధ్యతలు నిర్వర్తిస్తా. ఆపై వైదొలగాలని నిర్ణయించుకున్నాను' అని క్రిస్టోఫర్ వ్యాఖ్యానించారు. పదేళ్ల పదవీకాలంలో ఎఫ్‌బీఐ డెరెక్టర్‌గా క్రిస్టోఫర్‌కి మరో మూడేళ్లు ఉన్నాయి. అయినప్పటికీ ట్రంప్ రాకముందే పదవి నుంచి పక్కకి తప్పుకోవడం చర్చనీయాంశంగా మారింది. 2017లో 38,000 మంది ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇంటెలిజెన్స్‌కు అధిపతిగా క్రిస్టోఫర్‌ని ట్రంప్ నియమించారు. ఆ తర్వాత అమెరికాలో జరిగిన వరుస పరిణామల నేపథ్యంలో ట్రంప్‌పై క్రిస్టోఫర్ చర్యలు తీసుకున్నారు. తాజా, ఎఫ్‌బీఐ డైరెక్టర్ నిర్ణయంపై ట్రంప్ స్పందించారు. క్రిస్టోఫర్ రాజీనామా అమెరికాకు గొప్ప రోజు. క్రిస్టోఫర్ వ్రే నాయకత్వంలో ఎఫ్‌బీఐ ఎలాంటి కారణాలు లేకుండా నా ఇంటిపై అక్రమంగా దాడి చేసింది. చట్టవిరుద్ధంగా అభిశంసన, నేరారోపణలు చేయడంలో శ్రద్ధగా పనిచేసింది. అమెరికా విజయం, భవిష్యత్తుకు అంతరాయం కలిగించడానికి చేయాల్సిన వన్నీ చేసింది' అని ట్రంప్ ట్రూత్ సోషల్‌లోని పోస్ట్‌లో పేర్కొన్నారు.

## తదుపరి ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్

ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్విస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) డైరెక్టర్‌గా తన సన్నిహితుడు కాష్ పటేల్‌ను అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నామినేట్ చేశారు. 'తదుపరి ఎఫ్‌బీఐ డైరెక్టర్‌గా కాష్ పటేల్ బాధ్యతలు చేపడతారని గర్వంగా ప్రకటిస్తున్నా. కాష్ ఎంతో తెలివైన న్యాయవాది, పరిశోధకుడు. అవినీతిపై పోరాటం, దేశ ప్రజల రక్షణ కోసం తన కెరీర్‌లో ఎక్కువ కాలం వెచ్చించిన పోరాటయోధుడు' అని ప్రశంసించారు. 44 ఏండ్ల పటేల్ 2017లో ట్రంప్ హయాంలో యునైటెడ్ స్టేట్స్ సెక్రటరీ ఆఫ్ డిఫెన్స్‌కు చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా వ్యవహరించారు.

# అదును చూసి సిరియాను దెబ్బ కొడుతున్న ఇజ్రాయెల్!



డమాస్కస్: మాజీ అధ్యక్షుడు బషర్ అల్-అసద్ దేశం నుంచి పారిపోవడంతో సిరియాను అదును చూసి ఇజ్రాయెల్ దెబ్బ కొట్టింది. గడిచిన 48 గంటల్లో అక్కడి వ్యూహాత్మక మిలటరీ స్థావరాలపై 400 కంటే ఎక్కువ సార్లు దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. దీంతో సిరియాలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. 24 ఏళ్లుగా సిరియా అధ్యక్ష పదవిలో ఉన్న బషర్ అల్ అసద్ పాలనకు ముగింపు పలికాయి. దీంతో అసద్ సిరియా నుంచి రష్యా వెళ్లారు. అసద్ దేశం విడిచి వెళ్లారనే సమాచారంతో ఇజ్రాయెల్ అప్రమత్తమైంది. రసాయనిక ఆయుధాలు, రాకెట్లను నిల్వ ఉంచినట్లు అనుమానాలున్న ఆర్మీ స్థావరాలపై వైమానిక దాడులు జరిపింది. 80 శాతంపైగా సైనిక స్థావరాల్ని ధ్వంసం చేసింది. సిరియా సరిహద్దులో ఇజ్రాయెల్-విలీనమైన గోలన్ హైట్స్‌కు తూర్పున ఉన్న బఫర్ జోన్‌లోకి ఇజ్రాయెల్ తన దళాలను పంపింది. 'గత 48 గంటల్లో ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ సిరియాలోని భారీ మొత్తంలో వ్యూహాత్మక ఆయుధాల నిల్వలను ఉంచిన స్థావరాలపై దాడులు చేసింది. వాటిని తీవ్రవాదుల చేతుల్లో పడకుండా నిరోధించాము'అని ఇజ్రాయెల్ ఆర్మీ ప్రకటించింది. ఇజ్రాయెల్ ధ్వంసం చేసిన వాటిల్లో సిరియా నేవీ స్థావరాలు, అల్ బైడా పోర్ట్, లటాకియా పోర్ట్ 15 నౌకాదళ నౌకలు, రాజధాని డమాస్కస్, ఇతర ముఖ్య నగరాల్లోని విమాన నిరోధక బ్యాటరీలు, ఆయుధాల ఉత్పత్తి కేంద్రాలు ఉన్నట్లు సమాచారం.

# ఏపీ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు..!




**అమరావతి,:** రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ పెండింగ్ చలాన్లపై ఏపీ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. ట్రాఫిక్ చలాన్లు కట్టకపోతే ఇళ్లకు విద్యుత్, నీళ్ల సరఫరా ఆపివేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాల డ్రైవర్లు తెలంగాణ సరిహద్దుకు వెళ్ళగానే సీట్ బెల్ట్ పెట్టుకుంటున్నారని వ్యాఖ్యానించింది న్యాయస్థానం. పోలీసులు, అధికారులు కఠినంగా వ్యవహరించడం లేదని.. నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆంధ్రప్రదేశ్ లో హెల్మెట్ ధరించకపోవడం వల్ల మూడు నెలల్లో 667 మంది మృత్యువాత పడ్డారని.. నిబంధనలు సరిగ్గా అమలు చేయకపోవడం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా అవుతున్నాయని దాఖలైన పిటీషన్ పై నేడు విచారణ జరిపిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. విచారణను ఈ నెల 18వ తేదీకి వాయిదా వేసింది. కేంద్ర మోటర్ వాహన సవరణ చట్టం నిబంధనలు అమలు చేయకపోవడంతో పెద్ద ఎత్తున రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానా విధించడం లేదని పేర్కొంటూ న్యాయవాది తాండవ యోగేష్ ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలు చేశారు. ఇక రాష్ట్రవ్యాప్తంగా 8, 770 మంది ట్రాఫిక్ పోలీసులు ఉండాల్సి ఉండగా.. 1994 మంది మాత్రమే ఉన్నారని, ఖాళీల భర్తీకి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది.

# అసమ్మతి... అనైక్యత...



ఆరు నెలల క్రితం లోక్‌సభ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించిన ప్రతిపక్ష 'ఇండియా' కూటమి అనతికాలంలోనే నాలుగు రోడ్ల కూడలిలో దిక్కుతోచని పరిస్థితిలో పడినట్టు కనిపిస్తోంది. జార?ండ్, జమ్ము - కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపుబాటలో పయనించినా, హర్యానా, మహారాష్ట్రల్లో ఎదురైన దిగ్భ్రాంతికరమైన పరాజయాలు ఇప్పుడు కూటమి భాగస్వామ్యపక్షాల మధ్య విభేదాల కుంపటిని రాజేస్తున్నాయి. హర్యానా ఎన్నికల్లో మితిమీరిన ఆత్మవిశ్వాసంతో చేజేతులా కాంగ్రెస్ ఓటమి కొనితెచ్చుకుంటే, మహారాష్ట్రలో మహావికాస్ ఆఘాడీ (ఎంవీఏ) సోదిలో లేకుండా పోవడమూ స్వయంకృతమేనన్న భావన అసమ్మతిని పెంచింది. ఖర్గే సారథ్యంలోని 'ఇండియా' కూటమిలో ప్రధానపాత్ర కాంగ్రెస్‌దే గనక మహారాష్ట్రలో దెబ్బతో అనూహ్యంగా నాయకత్వ మార్పు అంశం తెర మీదకొచ్చింది. సారథ్యానికి సిద్ధమంటూ మమత ముందుకు రావడంతో కథ మలుపు తిరిగింది. కూటమి ఆశించిన ఫలితాలు రావడం లేదన్న అసంతృప్తి పెరుగుతున్న పరిస్థితుల్లో అసలీ కూటమి ఏర్పాటులో కీలకపాత్ర పోషించినదే మమతా బెనర్జీ గనక ఇప్పుడీ కూటమికి ఆమే సారథ్యం వహించాలనీ, అందుకామె సిద్ధంగా ఉన్నారనీ తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ ముందుగా గళం విప్పారు. ఆ తర్వాత కొద్ది రోజులకే దీదీ ఓ ఇంటర్వ్యూ ఇస్తూ, 'కూటమిని వారు నడిపించ లేకపోతే, నేనే నడిపిస్తాను' అని కుండబద్దలు కొట్టేశారు. బెంగాల్‌ను వీడకుండా,అక్కడ నుంచే కూటమి సాఫీగా నడిచేలా చేస్తాననీ వ్యాఖ్యానించారు. దానికి కొనసాగింపుగా జాతీయవాద కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అగ్రనేత శరద్ పవార్ సైతం జాతీయ నేతగా మమత సమర్థురాలనడంతో తేనెతుట్టె కదిలింది. కూటమిలోని లుకలుకలు, కాంగ్రెస్ పట్ల ఇతర భాగస్వామ్య పక్షాల అసంతృప్తి, అసమ్మతి స్వరాలు బయటపడ్డాయి. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), అలాగే రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) అధినేత లాలూ సహా పలువురు కోరస్ కలపడంతో విషయం వీధికెక్కింది. సీపీఐ సైతం సీట్ల సర్దు బాటులో వామపక్షాలకు కూటమి చోటివ్వడం లేదంటూ, కాంగ్రెస్ ఆత్మశోధన చేసుకోవాలనేశారు. నిజానికి, ఈ ఏటి లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' కూటమికి కొంత ఊపు వచ్చినా, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బలతో అంతా నీరుగారింది. ఆ మధ్య హర్యానాలో దెబ్బ తినడమే కాక, తాజా మహారాష్ట్ర ఎన్నికల్లో కూటమి తుడిచిపెట్టుకుపోవడం అశనిపాతమైంది. ఆశలు క్షీణించడంతో హస్తం పార్టీ సారథ్యంపై అసమ్మతి స్వరం పెరిగింది. ఆ మాటకొస్తే తృణ మూల్ చాన్నాళ్ళుగా కాంగ్రెస్‌కు దూరంగా ఉంటోంది. ఎన్నికల్లో పొత్తు పెట్టుకోలేదు సరికదా పార్లమెంట్ సమావేశాల్లోనూ అంటీముట్టని వైఖరి. ఇటీవల ఎస్పీది సైతం అదే ధోరణి. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఉపఎన్నికల్లో హస్తం పార్టీతో కలవడానికి ఇష్టపడకపోగా, పార్లమెంట్‌లో రాహుల్ ముందుండి నడుపుతున్న అదానీ వ్యతిరేక నిరసన ప్రదర్శనల్లోనూ తృణమూల్ లానే పాలు పంచు కోవట్లేదు. ఇది చాలదన్నట్టు రానున్న ఢిల్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తున్నట్టు ఆప్ ప్రకటించింది. అభ్యర్థుల పేర్లు విడతల వారీగా విడుదల చేసేస్తూ, చర్చలకు తావు లేకుండా చేసేసింది. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ ఆత్మపరిశీలన చేసుకోవాలనీ, ప్రతిపక్ష ఐక్యతకు చర్యలు ఆలోచించాలనీ శివ సేన (ఉద్ధవ్ బాల్‌ఠాక్రే) పేర్కొన్నదంటే వ్యవహారం ఎందాకా వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. మల్లికార్జున్ ఖర్గే సారథ్యంలోని కాంగ్రెస్ శైలిపై అసంతృప్తి బాహాటమవుతున్న వేళ... ప్రతిపక్ష కూటమి భవిష్యత్ నేత ఎవరు, భవిష్యత్ దిశ ఏమిటన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. కూటమిని దీదీ నడిపితే అభ్యంతరం లేదంటూనే, ఈ బీజేపీ వ్యతిరేక కూటమిలో పలువురు సీని యర్ నేతలు ఉన్నందున కూర్చొని చర్చించి, ఏకాభిప్రాయంతో నిర్ణయం తీసుకోవాలంటూ ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఇప్పటికే సన్నాయి నొక్కులు నొక్కారు. అసలు బీజేపీయేతర ప్రతిపక్షాలన్నీ కలసి 'ఇండియా' కూటమిగా జట్టు కట్టినా, వాటికి సరైన సైద్ధాంతిక భూమికే కాదు... నేటికీ సమ న్వయ సంఘం, ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక, భవిష్యత్ మార్గదర్శనం లాంటివేమీ లేవు. అందు కోసం గడచిన ఏణ్ణర్థం పైగా ప్రత్యేకించి కసరత్తులు చేసిన దాఖలాలూ లేవు. నిన్నగాక మొన్న మహారాష్ట్ర ఎన్నికల్లో ఎంవీఏ గొడుగు కింద అందరూ కలసి పోటీ చేసినా... బాబ్రీ మసీదు కూల్చివేతను శివసేన (యుబీటీ) నేత ఒకరు సమర్థించడంతో యూపీలో ముస్లిమ్ ఓట్లపై ఆధార పడ్డ ఎస్పీ తాజాగా ఎంవీఏ నుంచి బయటకొచ్చేసింది. దీన్నిబట్టి ఎన్నికల కోసం కలవడమే తప్ప 'ఇండియా' పక్షాల మధ్య సహాయ సహకారాలే కాదు సమన్వయం కూడా లేదన్నది స్పష్టం. కాంగ్రెస్‌కు కానీ, కూటమికి కానీ సారథ్య బాధ్యతలు తీసుకోకున్నా చక్రం తిప్పడంలో ముందున్న రాహుల్ పరివారానికి ఇప్పుడిది కొత్త పరీక్ష. పార్లమెంట్‌లో సోనియా, రాహుల్, తాజాగా గెలిచొచ్చిన ప్రియాంక - ముగ్గురున్నా కూటమికి బలిమి చేకూరుతున్న దాఖలాలు లేవు. పెద్దన్న పాత్రలో అత్యుత్సాహం చూపుతున్న హస్తం పార్టీ కార్యకర్తలకు కానీ, ఇతర పార్టీలకు కానీ స్ఫూర్తినివ్వడంలో పదే పదే విఫలమవుతోంది. ఇకనైనా సాటిపక్షాల మాటలకు అది చెవి ఒగ్గాలి. పరస్పర గౌరవంతో అందరినీ కలుపుకొనిపోవాలి. తాజా గందరగోళంతో త్వరలోనే 'ఇండియా' కూటమి విచ్ఛిన్నమవడం ఖాయమని బీజేపీ జోస్యం చెబుతోంది. కాషాయపార్టీపై సమైక్యంగా పోరు సాగించడమే ధ్యేయంగా పురుడు పోసుకున్న ప్రతిపక్ష కూటమి ఇలా అనైక్యతా రాగం ఆలపిస్తూ పోతే చివరకు అదే జరుగుతుంది. నాయకత్వచర్చ చివరకు కూటమి ఎన్నికల అజెండాపై కారుమబ్బుల్ని కమ్మేస్తేనే కష్టం. అధికారపక్ష అంచనా తప్పు అని నిరూపించాల్సిన బాధ్యత పూర్తిగా ప్రతిపక్షాలదే!

# సరైన దిశలో ఒక ప్రయత్నం



ఎట్టకేలకు ఒక అడుగు ముందుకు పడింది. బంగ్లాదేశ్‌లోని పరిస్థితి పట్ల తన మనోభావాలను భారత్ స్పష్టంగా పంచుకోగలిగింది. బంగ్లాదేశ్‌లోని మధ్యంతర సర్కారుకు ప్రధాన సలహాదారైన మహమ్మద్ యూనస్, బంగ్లా విదేశాంగ కార్యదర్శి మహమ్మద్ జషీముద్దీన్ తదితరులతో భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ఢాకాలో సమావేశమవడం ఆహ్వానించదగ్గ పరిణామం. ఆగస్టులో షేక్ హసీనా ప్రభుత్వం పడిపోయాక రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్న వేళ భారత్ నుంచి తొలిసారిగా ఓ ఉన్నతాధికారి బంగ్లా వెళ్ళడం, దౌత్య భేటీ జరపడం విశేషమే. ఇటు హసీనాకు భారత్ ఆశ్రయం కల్పించడం, అటు బంగ్లాలో అల్పసంఖ్యాక హిందువులపై దాడులతో ద్వైపాక్షిక సంబంధాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ పరిస్థితుల్లో తాజా భేటీలో ఇరుపక్షాలూ నిర్మొహమాటంగా పరస్పరం అభిప్రాయాలు పంచుకోవడం సరైన దిశలో పడిన అడుగు. హసీనా హయాంతో పోలిస్తే, భారత్ పట్ల పెద్ద సానుకూలత లేని సర్కారు బంగ్లాలో ప్రస్తుతం నెలకొన్నందున తాజా దౌత్యయత్నాలు కీలకం. చారిత్రకంగా మిత్రత్వం, పరస్పర ప్రయోజనాలున్న పొరుగు దేశాలు అపోహలు, అనుమానాలు దూరం చేసుకోవడానికి ఇవి ఏ మేరకు ఉపకరిస్తాయో చూడాలి. బయట ఉద్రిక్త వాతావరణం ఉన్న సమయంలో జరిగిన ఈ చర్చలు మైనారిటీలపైన, హిందూ ఆలయాలపైన దాడులు, రాజద్రోహ నేరంపై హిందూ సాధువు చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టు సహా అనేక వివాదాస్పద అంశాలపై దృష్టి సారించాయి. రెండు కోట్ల పైగా హిందువులున్న ముస్లిమ్ మెజారిటీ దేశంలో మైనారిటీల భద్రతపై భారత్ ఆందోళన వ్యక్తం చేస్తే, ఆ ఘటనలు రాజకీయమైన వంటూ బంగ్లా వాదించింది. ప్రజల భావోద్వేగాలు, రాజకీయ ప్రయోజనాలు కలగలిసినప్పుడు పరస్పర భిన్న వాదనల మధ్య రాజీ కుదర్చడం కష్టమే. కానీ, విదేశాంగ శాఖ కార్యదర్శుల భేటీతో చిరు ప్రయత్నమైనా సాగడం విశేషం. బంగ్లాదేశ్ సైతం ఇప్పటికైనా కళ్ళు తెరిచి, జరుగుతున్నదే మిటో గ్రహించి, అసలంటూ సమస్య ఉన్నదని గుర్తించడానికి ఈ భేటీ ప్రేరేపిస్తే మంచిదే. 1971 నాటి బంగ్లాదేశ్ విముక్తి పోరులో భారత్ పాత్ర మరపురానిది. అదే సమయంలో స్వాతంత్ర్యం ముందు నుంచి చారిత్రకంగా ఉన్న అనుబంధం రీత్యా సాహిత్య, ఆర్థిక, ఆధ్యాత్మిక, రాజకీయ పరంగా ఆధునిక భారతావని రూపుదిద్దుకోవడంలో బంగాళ ప్రాంతపు భాగ స్వామ్యం అవిస్మరణీయమే. బ్రిటీషు కాలం నుంచి భౌగోళిక రాజకీయాలు, సామాజిక సాంస్కృతిక కారణాలతో ముడిపడిన భారత - బంగ్లా బంధం ఇటీవలి ఉద్రిక్తతల నడుమ నలిగిపోతోంది. ఇరుదేశాల మధ్య 4,096 కి.మీల ఉమ్మడి సరిహద్దుంది. ప్రపంచంలోనే సుదీర్ఘమైన అయిదో సరిహద్దు ఇది. పైగా, చాలా ప్రాంతంలో పూర్తిస్థాయిలో సరిహద్దుల గుర్తింపు జరగనేలేదు. సరిహద్దులో నెలకొన్న పశ్చిమ బెంగాల్‌లోని ఒక్క పెట్రాపోల్ వద్దనే రెండు దేశాల మధ్య భూమార్గ వాణిజ్యంలో 30 శాతం జరుగుతుంది. ఏటా సుమారు 23 లక్షల మంది సరిహద్దులు దాటి, భారత్‌కు వైద్య చికిత్సకు వస్తుంటారు. కాబట్టి, ఇటీవలి ఉద్రిక్తతల్ని దాటి వాణిజ్యం, ఇంధనం, సహకారం, సామర్థ్యాల పెంపు దలను బంగ్లా చూడగలగాలి. ఇరుదేశాలూ చేతులు కలిపి అడుగులు వేస్తేనే అభివృద్ధి సాధ్యం. ఉల్లిపాయలు, బంగాళదుంపలు, వెల్లుల్లి లాంటి నిత్యావసర వస్తువుల విషయంలో ఢిల్లీ పైనే ఢాకా ఆధారపడి ఉంది. కానీ, తాజా పరిస్థితుల నేపథ్యంలో ఆ దేశం దేశీయ ఉత్పత్తిని పెంచుకొని, ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తోంది. ఇక, బంగ్లా రోగులకు శస్త్రచికిత్స చేసేది లేదంటూ కొన్ని భారతీయ ఆస్పత్రులు అమానవీయంగా, మూర?ంగా వ్యవహరించడం సమర్థనీయం కాదు. ఈ చర్యల వల్ల బంగ్లా దేశీయులు ఇప్పుడు మలేసియాను ఆశ్రయిస్తున్నట్టు వార్త. ఇలాంటివన్నీ దీర్ఘకాలంలో భారత ప్రయోజనాలకే దెబ్బ. అసలు మిగతా ప్రపంచంతో భారత వాణిజ్యంతో పోలిస్తే, సరుకుల్లో భారత - బంగ్లాల ద్వైపాక్షిక వాణిజ్యం వేగంగా వృద్ధి చెందింది. అనేక అంశాలు ముడిపడి ఉన్నందున తెగేదాకా లాగడం ఇరుపక్షాలకూ మంచిది కాదు. కొత్త వాస్తవాలను గుర్తించక ఒకవేళ మనం ఇదే వైఖరితో ముందుకు సాగితే చివరకు నేపాల్, శ్రీలంక, పాకిస్తాన్, మాల్దీవులు, మయన్మార్ వరుసలోనే బంగ్లాదేశ్ సైతం ఢిల్లీకి దూరమవుతుంది. పొరుగున మిత్రులెవరూ లేని దుఃస్థితి భారత్‌కు దాపురిస్తుంది. యూనస్ సారథ్యంలోని ప్రస్తుత బంగ్లా సర్కార్ పాక్‌కు చేరువవుతోంది. ఇటీవల రెండు దేశాల మధ్య వీసాల ఎత్తివేత, రక్షణ ఒప్పందాలు, కరాచీ నుంచి పాకిస్తానీ సరుకుల రవాణా నౌకను చిట్టగాంగ్ వద్ద లంగరేసుకునేందుకు అనుమతించడం లాంటివి చూస్తే అదే అనిపిస్తోంది. దాదాపు 47 ఏళ్ళ తర్వాత రెండు దేశాల మధ్య నేరుగా సముద్ర నౌకాయాన సంబంధాల పునరుద్ధరణకు ఇది ఒక సూచన. వ్యూహాత్మకంగా సుస్థిర దక్షిణాసియాకు కట్టుబడ్డ భారత్ జాగ్రత్తగా అడుగులు వేయాలి. బంగ్లా అంతర్గత రాజకీయాల్లోకి అతిగా జొరబడి, ప్రస్తుత హయాం నమ్మకాన్ని పోగొట్టు కోరాదు. ఈ పరిస్థితుల్లో భారత విదేశాంగ కార్యదర్శి ఢాకా పర్యటన ఇరుగుపొరుగు బాంధవ్యం, భాగస్వామ్యాల ప్రాధాన్యాన్ని గుర్తించినట్టే అనిపిస్తోంది. బంగ్లా సైతం ముందుగా తన అంతర్గత వ్యవహారాలను చక్కదిద్దుకోవాలి. ఆ దేశంలో సాధారణ పరిస్థితులు నెలకొంటే, మైనారిటీలు సురక్షితంగా ఉంటే, పాత బంధం మళ్ళీ మెరుగవుతుంది. వెరసి, భారత్ - బంగ్లాలు ప్రస్తుతం నాలుగురోడ్ల కూడలిలో నిలిచాయి. మనసు విప్పి మాట్లాడుకొని, పరస్పర ప్రయోజనాల్ని కాపాడుకుంటే మేలు. అలాకాక సహకార మార్గం బదులు సంఘర్షణ పథాన్ని ఎంచుకుంటే ఇరువురికీ చిక్కే!

# 'సమూహ' శక్తే.. సమాజానికి రక్ష



ఒంటరిగా నిలిచి ఎప్పుడూ ఏ విజయాన్ని కాంక్షించలేము. సమూహమే బలమైన గొంతుకను ఇస్తుంది. మన చుట్టూ ఎన్నో వేల గొంతుకుల మధ్య ఏ సమూహాలు ఉన్నాయో ఎటువంటి సఅజన చేస్తున్నాయో నిరంతరం అప్రమత్తులమై ఉండాలి. ఎన్నో విరుద్ధ గొంతుకుల మధ్య ఓ దారి చేసుకుని నిజమైన ప్రజల గొంతుకను వినిపించడానికి ప్రజల చైతన్య ధారను తిరిగి ఉత్తేజపరిచేలా భావజాల రంగంలో ప్రజాస్వామిక దఅక్పథాన్ని పెంచడానికి నిరంతరం కఅషి చేసే మహత్కార్యాన్ని 'సమూహ' సెక్యులర్ రైటర్ ఫోరమ్ తీసుకున్నది. నియంతఅత్వానికీ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్య వేత్తలు రాజకీయ ఆలోచనాపరులు నిత్యం జరుగుతున్న అన్యాయాల పై నిరసన తెలుపుతూనే ఉంటారు, ఓ దఅక్పథాన్ని వెల్లడి చేస్తూనే ఉంటారు అనడానికి 'సమూహ' సరైన ఉదాహరణ. లౌకిక ప్రజాస్వామిక జీవ సంస్కఅతి విలువలు పెంపొందించాల్సిన సాహిత్యం పై యువతరం ఆలోచనల తీరును వారి దఅక్కోణాలను శైలిని సానబెట్టి పదును తీర్చడానికి భిన్న సాహిత్య అస్తిత్వాలకు చెందిన రచయితలు ఉమ్మడి కార్యాచరణతో పరిశీలనాత్మక నిర్దేశకాలను అందించడానికి పోయిన సంవత్సరం సమూహ రూపంలో ఐక్యవేదిక ఏర్పరచి రాజ్యాంగ బద్ధంగా లౌకిక స్ఫూర్తిని పెంచడానికి ముందుకు వచ్చారు. దేశంలో మాట్లాడే శక్తిని , మాట్లాడే మనుషుల్ని వెతికి మరీ జైళ్ళ పాలు చేస్తుందీ మతస్వామ్య ప్రభుత్వం. ప్రజా సంక్షేమం మరచి కార్పొరేట్ ప్రయోజనాలకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తున్నది. ప్రజాస్వామ్య దేశంలో ప్రజలపై జరుగుతున్న అన్యాయాలని ప్రశ్నించే గొంతుకలు లేకుండా చేయాలనుకుంటున్నాయి. ఈ ఫాసిస్టు భావజాలానికి కూకటి వేళ్ళతో ముగింపు పలకలేని నిస్సహాయతలను సృష్టిస్తోంది. దేశంలోనే అనేక చోట్ల సీఆర్పీ సెక్షన్ 144 నుంచి ఉపా వరకు పెక్కు నిర్బంధ చట్టాలను హింసాత్మకంగా ఉపయోగిస్తున్నారు. కనీసం రైతులు చేసే శాంతియుత కార్యక్రమాలపై కూడా నిర్బంధం అమలు చేస్తున్నారు. దూకుడుగా అణిచివేతలకు పాల్పడుతున్న పాలకవర్గం గాంధేయ మార్గంలో తెలిపే నిరసనలను సైతం గౌరవించే చోటు నేడు మన దేశంలో ఎక్కడా లేకుండా పోతుంది. కనీసం అంబేద్కర్ జయంతి ఇలాంటి కార్యక్రమాలను అంబేద్కర్ విగ్రహం వద్ద పుస్తకాల ఆవిష్కరణను కూడా అడ్డుకుంటుంది. సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం వరంగల్ లో జరిపిన సభపై మతవాద శక్తులు చేసిన దాడులు మన కళ్ళ ఎదురుగా జరిగిన ఒక ప్రత్యక్ష సాక్ష్యం. ఒక విద్యాత్మక చర్చావేదికని ఎలా నిర్వహిస్తారు అనే ప్రశ్నలతో చల్లాచెదురు చేయాలని చూసింది., కేసులు వేసింది. శాంతియుత బౌద్ధిక చర్చలే అయినా అవి ప్రజల ఆలోచనలపై ప్రభావాన్ని చూపిస్తాయేమో అన్న భయంతో ఈ పాలకుల వెన్ను జలదరించింది. ప్రత్యామ్నాయ ఆలోచనల కేంద్రాలు కావలసిన విశ్వవిద్యాలయాల్లో ఈనాటి మత రాజకీయాలు అదఅశ్య శక్తులు చాప కింద నీరులా మనుధర్మాలని చొప్పిస్తూ ఇదే మన సంస్కఅతి ఇదే మన జీవన విధానం అంటూ ప్రచారం చేస్తోంది. ప్రజా స్వామిక విలువలపై చట్టసభల్లో బయటా మెరుపు దాడులకు దిగుతుంది. వాక్ స్వాతంత్రాన్ని లేకుండా దిగమింగుతున్న సందర్భంలో ప్రశ్నించే గొంతుకగా నిలబడే సమయాన్ని నిర్ణయించుకుని అంతరంగాల ఆవిష్కరణలను సామూహిక గొంతును వినిపించడానికి మరోసారి సమూహ సిద్ధమైంది. ఇది మన సమూహ రచయితలు అందరూ కలిసి నిర్మించుకోవాలనుకుంటున్న లౌకిక ప్రజాస్వామ్య విలువలు ప్రజల్లోకి తీసుకొని వెళ్లే ఓ అవగాహన సదస్సు మాత్రమే ఇది.. ఇలా ఓ సదస్సుని జరుపుకోవడానికి రచయితలు అందరూ కూడా ఈనెల 14వ తారీకున మహబూబ్ నగర్లో తొలి రాష్ట్ర మహాసభలని నిర్వహించుకుంటున్నారు.ఈ సభలో రచయితలు అందరు పాలు పంచుకోవాలని కోరుతున్నాను.

శుభోదయ

సంపాదకీయం

# పౌరహక్కులతో పరిహాసం

**(విశ్లేషణ)**

రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ప్రజల సమస్యలు నిజంగా పరిష్కారం కావాలంటే నక్సలైట్లే కావాలని కోరుకుని దార్శనికతను ప్రదర్శించారు. ఆ ఒరవడిలో 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు చాలా వాగ్దానాలుచేశారు. ప్రత్యేకంగా ఆరు గ్యారెంటీలు ఇచ్చారు. తను సొంతంగా నా ఏడో గ్యారెంటీగా ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తానని, పౌరహక్కులను నిలబెడతానని చాలా గర్వంగా చెప్పుకున్నారు. ఇది నమ్మిన ప్రజలు కెసిఆర్‌ని దింపి ఈయనను అధికార పీఠం మీద కూర్చోబెట్టారు. కెసిఆర్ ఎన్ని మంచి పనులు చేసినా పౌరప్రజాస్వామిక హక్కులను కాపాడడంలో, పౌర సమాజంతో సంభాషించడంలో, ప్రజాసంఘాల నాయకులతో నిత్యసంబంధాలు నెరపడంలో ఘోరంగా విఫలమయ్యారు. ప్రజా సంఘాలను నిషేధించే వరకు ఆయన ప్రభుత్వ చర్యలున్నాయి. కనుక సులభంగా ప్రజలు రేవంత్ రెడ్డి మాటలు నమ్మారు. ఆంధ్ర వలస పాలనలో తీవ్ర నిర్బంధం ప్రయోగింపబడినందువలన కెసిఆర్ అప్పట్లో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ ప్రజలకు నక్సలైట్ తరహా పాలన అందిస్తానని మాట ఇచ్చారు. ఇది నమ్మిన ప్రజలు వాళ్లను పంపించి ఈయనను అధికారంలోకి తీసుకొచ్చారు. అయితే ఆచరణలో పదేళ్ల కాలంలో కెసిఆర్ కూడా ఆంధ్ర పాలకుల పరిపాలనకు భిన్నంగా లేకపోవడంతో తీవ్ర నిర్బంధకాండను ప్రయోగించడంతో ఏర్పడిన అసంతృప్తి అగాధ సందర్భాన్ని ఉపయోగించుకొని రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజల మౌలిక సమస్యల పరిష్కారం కోసం నక్సలైట్లను కోరుకుంటున్నారని ప్రకటించారు. దీంతో ఆయన అంటే నమ్మకం ఏర్పడింది. రాజ్యాధికారం ఆయన చేతిలో పెట్టడం జరిగింది. అధికారంలోనికి వచ్చిన తొలి రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేను ప్రయాణం చేస్తున్న మార్గంలో ట్రాఫిక్‌ను నివారించి ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని సున్నితత్వాన్ని ప్రదర్శించారు. ప్రజలు మనసు నిండా సంతోషించారు ఒకవైపు ప్రమాణ స్వీకారం చేస్తూ మరోవైపు ప్రజాభవన్ చుట్టూ ఉన్న ఇనుపకంచెలను తెగ్గొశారు. ఆ భవనానికి సామాజిక విప్లవకారుల నామకరణం చేశారు. ప్రజాపాలన దిశగా అడుగులు పడుతున్నాయని ప్రజలు మరింత సంతోషించారు కానీ ఈ ఏడాది. కాలంలో విషయమంతా మొదటికి వచ్చింది. పోలీసులే బలవంతులని తేలిపోయారు. ఏడాది విజయోత్సవాల్లో ప్రజలు పాత్ర ఎక్కడా కనబడడం లేదు. అయితే రాజ్యస్వభావం ఎప్పుడూ కూడా హింసాత్మకంగానే ఉంటుందనేది సత్యం. రాజ్యం వద్ద పోలీస్ వ్యవస్థ ఉన్నంత వరకు పోలీసుల చేతిలోకి పాలకులే జారిపోతున్నంత వరకు రాజ్య స్వభావంలో మార్పు ఉండదనేది కూడా సత్యం. 2023 డిసెంబర్ 7న రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేసిన మూడు రోజులకే డిసెంబర్ 10న నల్గొండ జిల్లా చింతపల్లి మండలం పోలీస్ స్టేషన్లో కస్టడి మరణం బోణి జరిగింది.అన్నదమ్ముల మధ్య భూవివాదం కేసులో 2023 డిసెంబర్ 10న పాలెం తండాకు చెందిన లంబాడ జాతి నేనావత్ సూర్య నాయక్‌ను చింతపల్లి పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. ఆయన వెంబడి మరో నలుగురు కూడా వెళ్లారు. ఆ నలుగురు ఇతర పోలీస్ సిబ్బంది చూస్తుండగానే ఎస్ఐ మృగంలాగా సూర్యనాయక్ మీద పడి మెడమీద పిడిగుద్దులు కురిపించాడు. నరాలు చిట్లిపోయి సూర్యానాయక్ అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే దేవరకొండ ఆసుపత్రికి తీసుకెళ్తే చికిత్స జరుగుతుండగానే ప్రాణాలు వదిలాడు. సబ్‌ఇన్స్‌పెక్టర్ కరాటేలో నిపుణుడు. ఆయన కరాటే నైపుణ్యం అమాయకుని పైన ప్రదర్శించి ప్రాణాలు బలిగొన్నాడు. హాస్పిటల్‌కు తరలిస్తుండగా నూతన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలవాలని కోరుకున్నాడు. కోరిక తీరకుండానే చనిపోయాడు. పోలీసులు సివిల్ కేసుల్లో తలదూర్చి క్రూరత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. 2024 జనవరిలో గద్వాలలో చైతన్య మహిళా సంఘం సాంస్కృతిక కార్యక్రమాల శిక్షణ తరగతులు నిర్వహిస్తుండగా పోలీసులు దాడి చేసి తినుబండారాలు నేలపాలు చేసి ఇతర సామాగ్రినంత చిందరవందర చేసి శిక్షణ శిబిరాన్ని రద్దు చేశారు. పరేడ్ గ్రౌండ్‌లో నారీశక్తి అద్భుతం అని కొనియాడి ప్రజామహిళా సంఘాలను అణచివేస్తున్నారు. శవాల స్వాధీనానికి వెళ్లిన అమరుల బంధుమిత్రుల సంఘం మహిళా కార్యకర్తలను సైతం అరెస్టు చేసి నిర్బంధిస్తున్నారు. పోలీసులు ప్రజా మహిళ కార్యకర్తల ఎడల దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఫిబ్రవరి నెలలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావుతో పాటు మరో ఆరుగురి పైన పూసపల్లి కుట్ర కేసు బనాయించారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అశోక్‌తో పాటు మరో నాయకుడు గోపిలను ఖమ్మం జిల్లా కోయిచెలక గ్రామంలో పట్టుకొని అక్రమ కేసులు బనాయించి రిమాండ్ చేశారు. గ్రామాల మీదపడి పార్టీ రహస్య కార్యకర్తల ఆచూకీ తెలపమని తీవ్ర చిత్రహింసలకు గురి చేశారు. జూలై నెలలో ములుగు జిల్లాలో రంగాపురం అడవి ప్రాంతంలో గ్రే హౌండ్స్ బలగాలు జులై 24న జరిపిన కాల్పుల్లో మావోయిస్టు పార్టీ నాయకుడు విజయేందర్ అలియాస్ నల్లమారి అశోక్ చనిపోయాడు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జరిగిన మొదటి ఎన్‌కౌంటర్ ఇది. ఏడో గ్యారెంటీకి గండి పడింది. ఇక్కడితో మొదలైంది. కాంగ్రెస్ ఎన్‌కౌంటర్ పర్వం ముఖ్యమంత్రి పోలీసులను మందలించలేదు కనుకనే టిఆర్ఎస్ ప్రభుత్వం లాగానే పోలీసులు పేట్రేగిపోయి శాంతి కోసం రక్తం ధారపోసి సాధించుకున్న తెలంగాణను మళ్ళీ రక్తపుమడుగు చేస్తున్నారు.అక్టోబర్ 11న గద్వాల జిల్లా బిజ్వారం గ్రామానికి చెందిన పని అమ్మాయి రాజేశ్వరి (16)ని మల్దకల్ పోలీసులు అరెస్టు చేసి పట్టుకపోతే అవమానాన్ని భరించలేక మరుసటి రోజు ఇంటికి వచ్చి పురుగుల మందు తాగి చనిపోయింది. రాజేశ్వరి పది ఏళ్ల వయసు నుండి గద్వాలలోని రాజశేఖర్ రెడ్డి ఇంట్లో పని పిల్లగా పనిచేస్తుంది. ఈ క్రమంలో అక్టోబర్‌లో బంగారం పోయిందని దొంగతనం నేరం మోపి మల్దకల్ పోలీసులను ఉసిగొలిపాడు. గద్వాలలో నివసిస్తున్న రాజశేఖర్ రెడ్డి సంబంధం లేని మల్దకల్ పోలీసులను ఆశ్రయిస్తే కక్కుర్తిపడిన పోలీసులు సరిహద్దులు దాటి రంగంలోకి దిగి అందరి ముందు పట్టుకపోతే అవమానాల పాలైన మైనర్ బాలిక తిరిగి వచ్చి ఆత్మహత్య చేసుకుని చనిపోయింది. పోలీసులు మైనర్ బాలబాలికల ఎడల ఎంత సున్నితంగా వ్యవహరించాలో గ్రహించలేకపోతున్నారు.పోలీసులు రెచ్చిపోవడానికి కారణం ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం కారణం. ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంలో పౌరులకు న్యాయం అందించడం అంతర్భాగమైన పోలీసు వ్యవస్థ పసిపిల్లల ఎడల మానవీయంగా వ్యవహరించాలి. 13 అక్టోబర్ నాడు నాగర్ కర్నూలు జిల్లా లింగాల మండల కేంద్రంలో ముగ్గురు మైనర్ బాలురను పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి శిరోముండనం చేసి అవమానాలకు గురిచేసి సమాజంలో తలెత్తుకోకుండా చేసి పంపించారు. లింగాల గ్రామానికి చెందిన వినీత్ (20), అఖిల్ 18, నిఖిల్ 18లో బైక్‌పై పెట్రోల్ బంక్‌కు వెళ్లి 20 రూపాయల పెట్రోల్ వేయాలని కోరారు. ఆపరేటర్ హేళన చేయడంతో ఘర్షణ పడ్డారు రంగ ప్రవేశం చేసిన పోలీసులు ముగ్గురునీ పట్టుకపోయి మూడు రోజులు హింసించి వాళ్లు ఎన్నడూ చేయని పనులన్నీ చేయించి చివరికి మంగలిని స్టేషన్‌కు పిలిపించి ముగ్గురికి గుండు గీయించి పంపారు. దళితులు, మహిళలు, కింది కులాల వారంటే పోలీసులకు చిన్న చూపు. అవమానం భరించలేక అఖిల్, నిఖిల్ హైదరాబాద్ వెళ్ళిపోగా వినీత్ లింగాలలోనే ఉరి వేసుకొని ఆత్మహత్య ప్రయత్నం చేశాడు. తల్లిదండ్రులు సమయానికి గమనించడంతో వారం రోజులు మృత్యు తో పోరాటం చేసి బతికి బయటపడ్డాడు. రాష్ట్రంలో పోలీసుల ఉక్కు పాదాల కింద ఆత్మగౌరవం, పౌర హక్కులు నలిగిపోతున్నాయి. చట్టాలను ఉల్లంఘించిన ప్రైవేటు వ్యక్తులతో పోలిస్తే పోలీసులకు విధించే శిక్ష కఠినంగా ఉండాలని ఉన్నత న్యాయస్థానం ప్రకటించినట్లుగా శిక్షలు లేకపోవడం వలన వారి ఆకృత్యాలు కొనసాగుతున్నాయి. చరిత్రలో ప్రభుత్వాలు మారినా ఎజెండా ప్రజా అనుకూలంగా మారడం లేదు. ప్రపంచ మార్కెట్లో వ్యవస్థ నాశనానికి సానుకూలమయ్యాక ప్రభుత్వాలు నిరసన గొంతులను చిదిమేస్తున్నాయి. కొంతమంది ప్రజా మేధావులను సంలీనం చేసుకుని ప్రతిఘటించేవారని సంహరిస్తున్నది. పౌరసమాజం ప్రజలను మరింత సృజనాత్మకం చేసి అప్రజాస్వామిక ప్రభుత్వాలు అంతం కావడానికి ఎంత చేయాలో అంత చేయాలి.

# శాసనసభ్యులకూ.. ఉత్తమ అసెంబ్లీ పర్సన్ అవార్డు

## ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు శిక్షణ తరగతులు ప్రారంభం




హైదరాబాద్: అర్థవంతమైన చర్చలతో శాసనసభ, మండలి సమావేశాలు జరగాలని శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆకాంక్షించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో శాసన సభ, మండలి సభ్యులకు శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, శాసన సభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జ్యోతి ప్రజ్వలన చేసి ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ పార్లమెంటేరియన్ మాదిరిగా ఉత్తమ అసెంబ్లీ పర్సన్ అవార్డు పరిశీలన చేస్తామని వెల్లడించారు. గతంలో ఎన్టీఆర్, వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వెంకయ్యనాయుడు వంటి గొప్ప వ్యక్తులు బాగా మాట్లాడి మంచి పేరు తెచ్చుకున్నారని తెలిపారు. గతంలో శాసనసభ సమావేశాలు ఉంటే సినిమా రిలీజ్ వాయిదా వేసుకునేవారన్నారు. ప్రజాస్వామ్యంలో చట్టసభలది క్రియాశీల పాత్ర అని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా చట్టాలను రూపొందించాల్సిన బాధ్యత శాసన సభ్యులపై ఉంటుందన్నారు. చట్టాల రూపకల్పనతో పాటు వాటి అమలు తీరు, ప్రజలకు ఎంతవరకు ఉపయోగపడుతున్నాయని కూడా చర్చించాల్సిన అవసరం ఉంటుందని చెప్పారు. గతంలో సీనియర్ సభ్యులు శాసనసభలో మాట్లాడుతున్నప్పుడు నూతన సభ్యులకు ఇన్స్పిరేషన్‌గా ఉండేదని, రోశయ్య, రజీబ్ అలీ, బోడేపూడి వెంకటేశ్వరరావు, చెన్నమనేని విద్యాసాగర్ రావు, ఓంకార్, వైయస్ రాజశేఖర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, నర్రా రాఘవ రెడ్డి వంటి వారు గొప్ప వక్తలుగా పేరు తెచ్చుకున్నారన్నారు. సభలో మాట్లాడడానికి సమాచారం, వాగ్ధాటితో పాటుగా సభా వ్యవహారాలు, నిబంధనలపై అవగాహన ఉండాలని వివరించారు. ముఖ్యంగా జీరో అవర్, కొశ్చన్ అవర్, రిజల్యూషన్స్, అడ్జర్న్‌మెంట్ మెన్షన్స్, పాసింగ్ ఆఫ్ బిల్స్, పాసింగ్ ఆఫ్ బడ్జెట్, సభ్యుల మర్యాదలు, ప్రోటోకాల్, వ్యవహారాలు వంటి ముఖ్యమైన కార్యకలాపాలపై సభ్యులకు పూర్తి స్థాయి అవగాహన ఉండాలని తెలిపారు. ఢిల్లీకి చెందిన పీఆర్ఎస్ ఇన్‌స్టిట్యూట్ కు దేశంలోని లెజిస్లేచర్ వ్యవస్థలు, వ్యవహారాలపై పూర్తి స్థాయి పట్టు ఉందని, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ ఉన్నారని, ఈ సంస్థ వారు దేశంలోని వివిధ రాష్ట్రాల్లోని శాసనసభ్యులకు ఓరియెంటెడ్ ప్రోగ్రాంలు నిర్వహించారన్నారు. ఈ రెండు రోజుల అవగాహన సదస్సు మీ అందరికీ బాగా ఉపయోగపడుతుంది కాబట్టి సభ్యులంతా తప్పనిసరిగా పాల్గొని సభ వ్యవహారాలపై అవగాహన తెచ్చుకోవాలని కోరారు.

ప్రస్తుత రాజకీయాలు చూస్తే ఆవేదన కలుగుతోంది :గుత్తా సుఖేందర్ రెడ్డి

ప్రస్తుత రాజకీయాలు చూస్తే ఆవేదన కలుగుతోందని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. గాలివాటం రాజకీయాలు మొదలయ్యాక కొత్త ఎమ్మెల్యేలే సభలోకి వస్తున్నారని, ఎన్నికలు ఖరీదైనవిగా మారిపోయాయన్నారు. తాము సభాపతిగా ఉన్నా సభ ఎన్ని రోజులు నడపాలనే నిర్ణయం ప్రభుత్వానిదేనని, ప్రభుత్వం ఎక్కువ రోజులు సభ నిర్వహించాలనుకుంటే ఎక్కువ రోజులు నడుస్తుందని గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులకు, ప్రజలకు మధ్య దూరం పెరగడానికి, ఎన్నికల్లో ఓడిపోవడానికి వాళ్ల పీఏలు, పీఆర్వోలు ప్రధాన కారణమవుతున్నారని సుఖేందర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో మాట్లాడేందుకు ప్రజలు లేక మరెవరైనా ఫోన్ చేస్తే పీఏలు, పీఆర్వోలు దురుసుగా మాట్లాడతారని, తద్వారా వారిపై కోపం ప్రజాప్రతినిధులపై కోపంగా మారిపోతుందన్నారు. గన్ మెన్లతో కూడా ప్రజల్లో కొంత వ్యతిరేకత వస్తోందన్నారు. గెలవగానే పక్కకి వచ్చి చేరే వాళ్ళతో జాగ్రత్తగా ఉండాలని, కాబట్టి స్వయంగా ప్రజాప్రతినిధులే ప్రజలతో ఫోన్ లో టచ్‌లో ఉండాలని గుత్తా సూచించారు. ప్రజా ప్రతినిధి పదవి అనేది మహోన్నత పదవి. అందరికీ ఈ పదవి దక్కదు. అదృష్టం ఉన్న వారికి మాత్రమే దక్కుతుందన్నారు. గత పది సంవత్సరాల్లో ఎప్పుడు కూడా ఇలాంటి ఒరియెంటెషన్ కార్యక్రమాలను నిర్వహించలేదని, నేటి ప్రభుత్వ హయాంలో నిర్వహించుకుంటున్నామన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గెలిచిన తరువాత ప్రమాణస్వీకారం రోజునే ఐడి కార్డ్ తో పాటు రూల్స్ అండ్ రెగులేషన్స్ పుస్తకాలు ఇస్తామని, కానీ వాటిని ఎవరు కూడా చదవడం లేదని, లేజిస్లేచర్ కి సంబంధించిన పుస్తకాలు తప్పకుండా చదవాలన్నారు. ఇప్పుడు ఉన్న 119 ఎమ్మెల్యేల్లో 57 మంది నూతనంగా ఎన్నికైన వారే ఉన్నారని, వారందరూ ఖచ్చితంగా ఈ ప్రోగ్రాం ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంబీబీఎస్ చదివితే డాక్టరు అవుతారని, ఇంజనీరింగ్ చదివితే ఇంజనీర్ అవుతారని, అలాగే ప్రజల మనస్సు చదివితేనే ప్రజా ప్రతినిధులం అవుతామన్నారు. ఎమ్మెల్యేగా గెలిచి సభకు రాకుండా దూరంగా ఉండటం రాజ్యాంగ విలువలను అవహేళన చేయడమేనని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. శాసనసభ ఏ ఒక్కరిదో కాదని, ఈ ట్రైనింగ్ సెషన్స్ అందరికీ ఆహ్వానం పంపామని తెలిపారు. శాసనసభ అందరికీ అని, కాంగ్రెస్, బీఆర్ఎస్‌దో వేరే ఇంకా ఎవరిదో కాదన్నారు. మొదటిసారి ఎన్నికైన శాసనసభ్యులు 57 మంది శాసన సభలో ఉన్నారని, వారికి సీనియర్ సభ్యులు ఆదర్శంగా ఉండాలన్నారు. తాను మొదటిసారి ఎన్నికైనప్పుడు కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉందని, ఎప్పుడు మాట్లాడే అవకాశం దొరుకుతుందా అని ఎదురు చూసేవాళ్లమన్నారు. తాను నాలుగోసారి సభలో ఉన్నప్పుడు పీఏసీ ప్రతిపక్షానికి ఇవ్వలేదని గుర్తు చేసుకున్నారు. కేటీఆర్ ప్రతీది రాజకీయం చేయాలని చూస్తున్నారని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేల శిక్షణా తరగతులకు రావొద్దని కేటీఆర్ చెప్పారని దీన్ని బట్టి ఆ పార్టీ మానసిక స్థితి ఏంటో తెలుస్తుందన్నారు.

కేటీఆర్ వ్యాఖ్యలను పట్టించుకోవాల్సిన అవసరం లేదు : మంత్రి ఉత్తమ్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలను అంతగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు శిక్షణ తరగతులను బీఆర్ఎస్ బాయ్ కాట్ చేయడం సరికాదన్నారు. అన్నింటికి రాజకీయ రంగు పులమడం మంచిది కాదని దుయ్యబట్టారు. ఇవాళ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు శిక్షణ తరగతుల సందర్భంగా మాట్లాడిన ఉత్తమ్ రాజీవ్ గాంధీ, తెలంగాణ తల్లి విగ్రహం తొలిగించే అవకాశం బీఆర్ఎస్ కు రాదన్నారు. ఈ రాష్ట్రంలో మరో పదేళ్ల పాటు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉండబోతున్నదని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నా గేశ్వరరావు , పొన్నం ప్రభాకర్ , తెలంగాణ లేజిస్లేచర్ సెక్రెటరీ డాక్టర్ నరసింహా చార్యులు, 65 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు.

# మళ్లీ తెరపైకి పేర్లు, విగ్రహాలు.. హీటెక్కిన పాలిటిక్స్






తెలంగాణలో రాజకీయ వేడి కొనసాగుతుంది. నిన్న మొన్నటి వరకు తెలంగాణ తల్లి విగ్రహంపై బీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీలు ఒక్కరి మీద మరొక్కరు దుమ్మెత్తిపోసుకున్నారు. ఆ వివాదం ముగియక ముందే మాజీ మంత్రి కేటీఆర్ రాహుల్ గాంధీకి లేఖ రాశారు. అందులో కాంగ్రెస్ ప్రభుత్వంపై, సీఎం రేవంత్ రెడ్డిపై ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. చేతి గుర్తుకు ఓటేస్తే చేతకాని సీఎంని తెలంగాణ నెత్తిన రుద్దారని లేఖలో ఆయన విమర్శించారు. సరిగ్గా ఏడాది క్రితం కొలువుదీరిన కాంగ్రెస్ సర్కారు తెలంగాణను ఆగం చేయడమే కాకుండా తెలంగాణ అస్థిత్వాన్ని కూడా దెబ్బతీస్తోందన్నారు. చేతకాని, మతిలేని ముఖ్యమంత్రిని తెలంగాణ నెత్తిన రుద్ది రాహుల్ చేతులు దులుపుకోవడంతో అన్నదాతల నుంచి ఆడబిడ్డల దాకా ప్రతివర్గం అరిగోస పడుతోందని దుయ్యబట్టారు. వ్యవసాయ రంగం నుంచి పారిశ్రామిక వర్గం దాకా సంక్షోభంలో కూరుకుపోతోందని, ఎన్నికల టైంలో ఊరురా తిరిగి ఊదరగొట్టిన గ్యారెంటీలన్నీ గారడీలేనని కాంగ్రెస్ ఏడాది పాలన చూస్తే అర్థమైపోయిందని మండిపడ్డారు.డిక్లరేషన్ల పట్ల కాంగ్రెస్ పార్టీకే డెడికేషన్ లేదని అక్షరాలా రుజువైపోయిందన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన 420 హామీలు.. కాంగ్రెస్ చీటింగ్ చాప్టర్‌లో భాగమేనని తెలంగాణ సమాజానికి తెలిసిపోయిందని పేర్కొన్నారు. గాలి మోటర్లో వచ్చి గాలిమాటలు చెప్పి ఏడాదిపాటు పత్తా లేకుండా పోయిన రాహుల్‌కి తెలంగాణ పట్ల రవ్వంత కూడా బాధ్యత లేదని తేలిపోయిందని విమర్శించారు. ప్రగతిపథంలో పరుగులు పెట్టిన రాష్ట్రం అధోగతి పాలవుతుంటే తెలంగాణ వైపు కనీసం రాహుల్ కన్నెత్తి చూడకపోవడంతో నాలుగు కోట్ల ప్రజలు నిత్యం రగిలిపోతున్నారని ఆరోపించారు. సీఎం ఢిల్లీకి పంపే మూటలపై రాహుల్‌కి ఉన్న శ్రద్ధ, ప్రజలకు ఇచ్చిన మాటపై లేదన్నారు. తాము పదేళ్లలో పేదల బతుకులు మార్చమని, తప్ప పేర్లు మార్చలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. తాము తలుచుకుంటే రాజీవ్ పేర్లు, ఇందిరా విగ్రహాలు ఉంటాయా ? అని ఘాటుగా లేఖ రాశారు రాహుల్‌గాంధీకి కేటీఆర్ లేఖ రాయడంపై టీకాంగ్రెస్ ఎంపీలు నిప్పులు చెరిగారు. ఓర్వలేకే రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ విషం కక్కుతున్నారని ఎంపీ మల్లు రవి మండిపడ్డారు. రాష్ట్రంలో ఏం జరుగుతుందో రాహుల్‌గాంధీకి తెలుసన్నారు. మరో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బలరాం నాయక్‌లు కూడా కేటీఆర్‌పై విరుచుకుపడ్డారు. ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తే చూస్తూ ఊరుకోమని.. ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు.

# జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం..




జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం లభించింది. ఈ మేరకు పార్లమెంట్‌లో వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లు పెట్టేందుకు కేంద్రం సిద్ధమైంది. గతంలోనే జమిలి ఎన్నికలకు సంబంధించి కోవింద్ కమిటీ సిఫార్సులకు కేబినెట్ ఆమోద్రముద్ర వేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే జమిలి ఎన్నికల బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. జమిలి దిశగా కేంద్రం తీవ్రంగా కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం జమిలికే మొగ్గు చూపుతుండడంతో దీనికోసం ఉన్న అడ్డంకులన్నీ తొలగించుకునేందుకు రెడీ అవుతోంది. పార్లమెంట్ %శీ% పంచాయితీ ఎన్నికలు అన్నీ ఒకేసారి నిర్వహించేందుకు సమాయత్తం చేస్తోంది. మొత్తం రెండు దశల్లో ఈ ఎన్నికలు జరగనున్నాయి. తొలి దశలో పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు.. అవిపూర్తైన వందరోజుల్లోపు స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతాయి. దీనికోసం దేశవ్యాప్తంగా ఒకే ఓటరు జాబితాను ఉపయోగించబోతున్నారు. జమిలి ఎన్నికలు.. అంటే.. వన్‌నేషన్, వన్ ఎలక్షన్. దేశానికి ఒక్కసారే ఎన్నికలు.. మిగిలిన ఐదేళ్లూ పరిపాలనపై దృష్టిపెట్టాలన్న దృక్పథంతో జమిలిని తెరపైకి తీసుకొచ్చారు.

అసలు జమిలి ఎన్నికలు సాధ్యమేనా? జమిలిని అమలు చేయాలంటే ఏం చేయాలో తెలుసుకుందాం..

1952లో తొలి సాధారణ ఎన్నికల నుంచి 1967 వరకు లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు చాలావరకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. అయితే తర్వాతి కాలంలో సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడకపోవడం, గడువుకు ముందే పలు రాష్ట్రాల శాసనసభలను బర్తరఫ్ చేయడం వంటి కారణాలతో జమిలి ఎన్నికలు పట్టాలు తప్పాయి. దీంతో లోక్‌సభ, అసెంబ్లీలకు వేర్వేరుగా ఎన్నికలు జరపడం మొదలైంది. జమిలి ఎన్నికలు జరగాలంటే దాదాపు 18 రాజ్యాంగ సవరణలు, ప్రజా ప్రాతినిధ్య చట్టంలో మార్పులు చేయాల్సిన అవసరం ఉన్నదని కోవింద్ కమిటీ చెప్పింది. ముఖ్యంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 356, ఆర్టికల్ 324, ఆర్టికల్ 83(2), ఆర్టికల్ 172(1), ఆర్టికల్ 83కు సంబంధించి పలు సవరణలు అవసరమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జమిలి ఎన్నికలకు సంబంధించి రాజ్యాంగ సవరణలతో కూడిన బిల్లును పార్లమెంట్ ఉభయ సభలు కనీసం 67 శాతం సానుకూల ఓట్లతో ఆమోదించాల్సి ఉంటుంది. అంతేకాకుండా.. ఎన్నికల అంశం ఉమ్మడి జాబితాలో ఉన్న నేపథ్యంలో ఈ బిల్లుకు దేశంలోని కనీసం సగం రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోద ముద్రవేయాలి. అంటే 543 స్థానాలున్న లోక్‌సభలో కనీసం 67 శాతం అంటే.. 362 ఎంపీలు ఈ బిల్లుకు అనుకూలంగా ఓటువేయాలి. దీంతోపాటు రాజ్యసభలో 245 సీట్లలో 67 శాతం అంటే 164 మంది సభ్యులు ఈ బిల్లును సమర్థించాలి. దీనికి తోడు కనీసం 14 రాష్ట్రాల అసెంబ్లీలు బిల్లును ఆమోదించాల్సిన అవసరం ఉన్నది. జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే లాజిస్టిక్స్ సమస్య అడ్డంకిగా మారుతున్నట్టు విశ్లేషకులు చెబుతున్నారు. ఈవీఎం యంత్రాలతో పాటు వందశాతం వీవీప్యాట్స్ అందుబాటులో ఉంచడం అనేది పెద్ద సమస్యని అంటున్నారు. ఎన్నికల సామగ్రిని భద్రపరుచడానికి తగినన్ని గోడౌన్ల కూడా సమస్యగా మారింది. 15 ఏండ్లకోసారి ఈవీఎంలను మార్చాల్సి ఉంది. ఈవీఎంలలో 40% వరకు డెడ్‌లైన్ దాటినవేనని నిపుణులు చెబుతున్నారు. 2009 లోక్‌సభ ఎన్నికలకు వెయ్యి 115 కోట్లు, 2014లో 3వేల 870 కోట్లు ఖర్చు అయితే.. 2019లో ఈ ఖర్చు పది వేల కోట్ల రూపాయలకు పెరిగినట్లు అంచనా. ఇక శాసనసభ ఎన్నికల నిర్వహణను కూడా పరిగణనలోకి తీసుకుంటే ఒక్కొక్క రాష్ట్రానికి రూ. 250 కోట్లు ఖర్చవుతుందనుకుంటే, మొత్తం 28 రాష్ట్రాల అసెంబ్లీలకు, లోక్‌సభ ఎన్నికలకు, స్థానిక సంస్థల ఎన్నికలకు కలిపి అయ్యే ఖర్చు పెద్దమొత్తంలో ఉండబోతోంది. జమిలి వల్ల లాభాలు చూస్తే.. తరచూ వచ్చే ఎన్నికల కోడ్ వంటి అడ్డంకులు తప్పడం వల్ల అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభుత్వాలు దృష్టిసారించవచ్చు. ఎన్నికల వ్యయం, సిబ్బంది వినియోగం, నిర్వహణ భారం తగ్గుతుంది. ఓటింగ్ శాతం పెరుగుతుంది. ఒకేసారి ఎన్నికల నిర్వహణతో ఓటు వేయడానికి ప్రజలు తరుచూ వేరే ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఉత్పాదకత పెరుగుతుంది. నష్టాలు కూడా ఉన్నాయి. భారత్ వంటి అత్యధిక జనాభా కలిగిన దేశంలో ఒకేసారి ఎన్నికలు కష్టం. పారదర్శకతపై అనుమానాలు కలుగొచ్చు. జమిలిపై రాజ్యాంగంలో ప్రస్తావన లేదు కాబట్టి, ఇప్పటికైతే ఇది రాజ్యాంగ విరుద్ధం. గడువులోపే ప్రభుత్వాలు పడిపోతే జమిలి లక్ష్యమే దెబ్బతింటుంది. అవిశ్వాసం ఎదుర్కొనే ప్రభుత్వాల విషయంలోనూ ఇది జరుగొచ్చు. జమిలితో జాతీయ పార్టీలకు మేలు జరుగొచ్చు. జాతీయ అంశాల ఆధారంగా అసెంబ్లీకి కూడా ప్రజలు ఓటేస్తే, ప్రాంతీయ పార్టీలు ఎన్నికల్లో దెబ్బతినే ప్రమాదం ఉంది. జమిలి నిర్వహణకు భారీగా సిబ్బంది, ఈవీఎంలు, వీవీప్యాట్లు అవసరం.



# స్పోర్ట్స్ న్యూస్

## అగ్రస్థానానికి బ్రూక్

అంతర్జాతీయ క్రికెట్ మదలి (ఐసిసి) బుధవారం ప్రకటించిన తాజా టెస్టు ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్ యువ సంచలనం హ్యారీ బ్రూక్ బ్యాటింగ్ విభాగంలో అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఈ క్రమంలో ఇప్పటి వరకు టాప్‌లో ఉన్న ఇంగ్లండ్‌కే చెందిన సీనియర్ ఆటగాడు జో రూట్‌ను రెండో స్థానానికి నెట్టాడు. కొంతకాలంగా బ్రూక్ అసాధారణ బ్యాటింగ్‌తో చెలరేగి పోతున్న సంగతి తెలిసిందే. వరుస సెంచరీలతో ప్రపంచ క్రికెట్‌లో పెను ప్రకంపనలు సృష్టిస్తున్నాడు. దీని ప్రభావం అతని ర్యాంకింగ్స్‌పై కూడా పడింది. న్యూజిలాండ్‌తో జరుగుతున్న సిరీస్‌లో బ్రూక్ ఆకాశమే హద్దుగా చెలరేగి పోతున్నాడు. దీంతో బ్రూక్ తాజా ర్యాంకింగ్స్‌లో 898 రేటింగ్ పాయింట్లతో టాప్ ర్యాంక్‌ను దక్కించుకున్నాడు. జో రూట్ రెండో ర్యాంక్‌కు పడిపోయాడు. ఇక న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ మూడో ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. భారత యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ తన నాలుగో ర్యాంక్‌ను కాపాడుకున్నాడు. మరోవైపు ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ ట్రావిస్ హెడ్ టాప్10లో చోటు సంపాదించాడు. భారత్‌తో జరిగిన రెండో టెస్టులో హెడ్ చిరస్మరణీయ సెంచరీ సాధించిన సంగతి తెలిసిందే. దీంతో హెడ్ ఐదు ర్యాంక్‌లను మెరుగుపరుచుకుని ఐదో ర్యాంక్‌ను దక్కించుకున్నాడు. శ్రీలంక బ్యాటర్ కమిందు మెండిస్ ఆరో ర్యాంక్‌కు చేరాడు. సౌతాఫ్రికా కెప్టెన్ తెంబ బవుమా మూడు ర్యాంక్‌లు ఎగబాకి ఏడో స్థానంలో నిలిచాడు. భారత వికెట్ కీపర్ రిషబ్ పంత్ మూడు ర్యాంక్‌లు కోల్పోయి 9వ స్థానంలో నిలిచాడు. శుభ్‌మన్ గిల్ ఒక ర్యాంక్ పడిపోయి 17వ స్థానాన్ని దక్కించుకున్నాడు. భారత సీనియర్ ఆటగాడు తాజా ర్యాంకింగ్స్‌లో ఆరు స్థానాలు కోల్పోయి 20వ ర్యాంక్‌తో సరిపెట్టుకున్నాడు. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ టాప్30 నుంచి వైదొలిగాడు. రోహిత్ ఐదు ర్యాంక్‌లు కోల్పోయి 31వ ర్యాంక్‌లో నిలిచాడు.

### బుమ్రా అగ్రస్థానం పదిలం..

బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో టీమిండియా స్టార్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా టాప్ ర్యాంక్‌ను కాపాడుకున్నాడు. తాజా ర్యాంకింగ్స్‌లో బుమ్రా 890 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. ఆస్ట్రేలియాతో జరుగుతున్న బోర్డర్‌గవాస్కర్ సిరీస్‌లో బుమ్రా నిలకడైన బౌలింగ్‌ను కనబరుస్తున్న సంగతి తెలిసిందే. దీంతో అతని టాప్ ర్యాంక్‌కు ధోకా లేకుండా పోయింది. సౌతాఫ్రికా స్పీడ్‌స్టర్ కగిసో రబాడ రెండో, జోష్ హాజిల్‌వుడ్ (ఆస్ట్రేలియా) మూడో, ఆసీస్ కెప్టెన్ కమిన్స్ నాలుగో నాలుగో ర్యాంక్‌లో నిలిచారు. భారత సీనియర్ స్పిన్నర్ అశ్విన్ ఒక ర్యాంక్ కోల్పోయి ఐదో స్థానంలో నిలిచాడు. రవీంద్ర జడేజా ఆరో ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. ఆల్‌రౌండర్ల విభాగంలో జడేజా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అశ్విన్ మూడో స్థానాన్ని కాపాడుకున్నాడు.



## డబ్ల్యూటీసీ ఫైనల్లో దక్షిణాఫ్రికా..

## టీమ్ ఇండియాకు కంగారూ తోక అడ్డంకి

నిన్న మొన్నటి వరకు ఆ జట్టు పేరే వినిపించలేదు.. కానీ, ఇప్పుడు ఏకంగా ఫైనల్ కు చేరింది.. అదికూడా మిగతా జట్ల కంటే ముందే తన బెర్తును ఖాయం చేసుకుంది. ఇప్పటివరకు వన్డే ప్రపంచ కప్ ఫైనల్ చేరని ఆ జట్టు.. ఇటీవల టి20 ప్రపంచ కప్ ఫైనల్లో టీమ్ ఇండియా చేతిలో ఓడిన ఆ జట్టు ఇప్పుడు అదే టీమ్ ఇండియాను వెనక్కునెట్టి ప్రపంచ టెస్టు చాంపియన్ షిప్ ఫైనల్ బెర్తును ఖాయం చేసుకుంది / ఈసారి అదృష్టం కలిసొచ్చి.. దురదృష్టాఫ్రికాగా పేరున్న ఆ జట్టుకు ఈసారి అదృష్టం కలిసొచ్చింది.. సొంతంగా రాణించినదాని కంటే అవతలి జట్టు ఓటమి పాలవడం మేలు చేసింది. దీంతో ప్రపంచ టెస్టు చాంపియన్ షిప్ ఫైనల్ కు దూసుకెళ్లింది. ఇదెలా జరిగిందంటే.. స్వదేశంలో శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్ ను 2-0తో దక్షిణాఫ్రికా నెగ్గింది. దీంతో ప్రపంచ టెస్టు చాంపియన్ షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో 63.33 శాతంతో టాప్ లోకి వెళ్లింది. కేవలం మరొక్క మ్యాచ్ లో విజయం సాధించినా చాలు.. ఫైనల్ బెర్తు ఖాయం అవుతుంది. అయితే, ఈ నెలాఖరులో సొంత గడ్డపై పాకిస్థాన్ తో రెండు టెస్టులు ఆడనుంది. ప్రస్తుతం దక్షిణాఫ్రికా మంచి ఫామ్ లో ఉంది. ఈ నేపథ్యం పాక్ పై నెగ్గడం పెద్ద కష్టమేం కాదు. కేవలం ఒక్క మ్యాచ్ లో గెలిచినా డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్తు ఖాయం. భారత్ కు మేలే కానీ.. అనూహ్యంగా దక్షిణాఫ్రికా ఫైనల్ చేయడంతో భారత్ కు కొంత మేలే జరిగింది. సఫారీలు టాప్ లోకి రావడంతో ఆస్ట్రేలియా (60.71) రెండో స్థానానికి పడిపోయింది. గులాబీ టెస్టులో ఓడిన భారత్ (57.29) మూడో స్థానానికి దిగింది. మొన్నటి వరకు శ్రీలంక (45.45) పోటీలో నిలిచినా.. ఇప్పుడు దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, భారత్ లకు మాత్రమే ఫైనల్ చేరే చాన్సుంది. హ్యాట్రిక్ కొట్టాలంటే.. గత రెండు సైకిల్స్ (2019-21), (2021-23)లో ఫైనల్ చేరిన భారత్ కు ఈసారి సమీకరణాలు క్లిష్టంగా మారాయి. కారణం.. స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో మూడుకు మూడు టెస్టులు ఓడడమే. అయితే, ఆస్ట్రేలియాపై తొలి టెస్టు నెగ్గడంతో ఆశలు చిగురించాయి. రెండో మ్యాచ్ లో ఓడినా.. ఆస్ట్రేలియాతో మిగిలిన మూడు మ్యాచ్ లు గెలిస్తే నేరుగా ఫైనల్ కు వెళ్తుంది. కాకపోతే.. ఒక్కటి ఓడినా పరిస్థితి క్లిష్టం అవుతుంది. అప్పుడు దక్షిణాఫ్రికా, పాకిస్థాన్ సిరీస్ ఫలితంపై ఆధారపడాల్సి ఉంటుంది. కాగా, ప్రస్తుతం బోర్డర్ %-% గావస్కర్ సిరీస్ లో భారత్ 3-2తో గెలిచినా 64.05 శాతంతో ఫైనల్ చేరుతుంది. 3-1తో నెగ్గితే పాయింట్లు 60.52 శాతం అవుతాయి. 2-2తో డ్రా అయితే భారత్ ఫైనల్ అవకాశాలు తగ్గుతాయి. కాగా, ఆస్ట్రేలియా తదుపరి శ్రీలంకతో ఆడాల్సి ఉంది. బోర్డర్-గావస్కర్ ట్రోఫీ 2-2తో డ్రా అయి శ్రీలంకపై ఆస్ట్రేలియా 2-0తో గెలిస్తే భారత్ ఇంటికెళ్లడమే. అదే ఐదు టెస్టుల సిరీస్ ను 3-2 లేదా 3-1తో గెలిస్తే ఎలాంటి ఇబ్బంది లేకుండా ఫైనల్ కు చేరుతుంది. ఒక మ్యాచ్ డ్రా అయినా అవకాశాలుంటాయి. రెండింటిలో ఓడితే మాత్రం భారత్ ఫైనల్ అవకాశాలు గల్లంతయినట్లే. అంటే మిగతా మూడు మ్యాచ్ లలో అన్నీ గెలవాలి లేదా ఒకటి డ్రా చేసుకుని, రెండింట్లో నెగ్గాలి. భారత్ 4-1తో గెలిస్తే 64.05 పాయింట్ల శాతంతో, 3-1తో నెగ్గితే 60.52 పాయింట్ల శాతంతో ఆసీస్ ను దాటి టైటిల్ పోరుకు అర్హత సాధిస్తుంది. బోర్డర్-గావస్కర్ సిరీస్ 2-2తో డ్రా అయినా రోహిత్ సేనకు అవకాశం ఉంది. అప్పుడు ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌ను శ్రీలంక 2-0తో వైట్‌వాష్ చేయాలి. రెండు మ్యాచ్ లనూ డ్రాగా ముగించినా ఫర్వాలేదు. అప్పుడు ఆసీస్, భారత్ 55.26 పాయింట్ల శాతంతో సమానంగా ఉంటాయి. ఎక్కువ సిరీస్ విజయాలతో టీమ్ ఇండియా ముందంజ వేస్తుంది.

## ఐపీఎల్ 2025లో ఈ మూడు జట్ల

## పేస్ బౌలర్ల ధాటికి బ్యాటర్లు గజగజ వణకడం ఖాయం..




ఐపీఎల్ 2025 సీజన్‌కు సిద్ధమైన జట్లు తమ బలహీనతలను తగ్గించుకునేందుకు ప్రత్యేకంగా కృషి చేశాయి. అయితే, కొన్ని జట్లు ప్రత్యేకంగా పేస్ బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేయడంలో సఫలమయ్యాయి. పేస్ బౌలర్లు భాగస్వామ్యాలను విడదీయడం, డెత్ ఓవర్లలో నియంత్రణను కల్పించడం వంటి కీలక బాధ్యతలు నిర్వర్తిస్తారు. ఈ కారణంగా పేస్ అటాక్ పటిష్ఠత ఐపీఎల్ విజయానికి ఎంతో కీలకం.

### గుజరాత్ టైటాన్స్

గుజరాత్ ఈ సీజన్‌లో పేస్ విభాగాన్ని గణనీయంగా మెరుగుపరిచింది. గత సీజన్‌లో వారి పేస్ బౌలింగ్ విభాగం బలహీనంగా కనిపించగా, ఈసారి మహ్మద్ సిరాజ్, కగిసో రబడా, ప్రసిద్ధ్ కృష్ణల చేరికతో దాన్ని బలపరిచింది. అదనంగా గెరాల్డ్ కోయెట్జీ, ఇషాంత్ శర్మ, అర్షద్ ఖాన్‌లను బ్యాకప్‌లుగా తీసుకుని మరింత దృడంగా కనిపిస్తోంది. సిరాజ్, రబడా పవర్‌ప్లేలో ముమ్మర దాడిని ప్రారంభిస్తే, కృష్ణ మద్దతుగా నిలుస్తారు. డెత్ ఓవర్లలో కూడా ఈ త్రయం బాగా రాణించగలదు, అందువల్ల గుజరాత్ పేస్ దాడి సమతుల్యంగా ఉంటుంది.

### ముంబై ఇండియన్స్

గతంలో జస్ప్రీత్ బుమ్రాపై ఎక్కువగా ఆధారపడ్డ ముంబై, ఈసారి ట్రెంట్ బౌల్ట్, దీపక్ చాహర్‌లను జట్టులో చేర్చింది. హార్దిక్ పాండ్యా కూడా పేస్ విభాగానికి సమతుల్యతను అందించి, బలాన్ని పెంచాడు. రీస్ టోప్లీ, లిజాద్ విలియమ్స్ వంటి బ్యాకప్‌లతో జట్టు మరింత పటిష్ఠంగా ఉంది. బుమ్రా, బౌల్ట్, చాహర్ పవర్‌ప్లేలో అద్భుతంగా రాణించగలరు, ఇక డెత్ ఓవర్లలో కూడా వారి ప్రదర్శన విశ్వసనీయంగా ఉంటుంది.

### సన్‌రైజర్స్ హైదరాబాద్

ఐపీఎల్ లో బౌలింగ్ ఎటాక్ అనగానే గుర్తొచ్చే మొదటి పేరు హైదరాబాద్. ఈ సీజన్‌లో దూకుడు బ్యాటింగ్ లైనప్‌తో పాటు గట్టి పేస్ అటాక్‌ను రూపొందించింది. పాట్ కమిన్స్‌ను నిలుపుకుని, మహ్మద్ షమీ, హర్షల్ పటేల్‌లను జట్టులో చేర్చింది. షమీ, కమ్మిన్స్ పవర్‌ప్లేలో కీలక పాత్ర పోషిస్తే, డెత్ ఓవర్లలో హర్షల్ పటేల్ కీలకంగా వ్యవహరిస్తారు. షమీ, హర్షల్ ఇద్దరూ గతంలో పర్పుల్ క్యాప్ విజేతలు కావడం, జట్టుకు గొప్ప అనుభవాన్ని తెచ్చిపెట్టింది. బ్రైడాన్ కార్సే, జయదేవ్ ఉనద్కట్, సిమర్‌జీత్ సింగ్ వంటి బ్యాకప్‌లతో సన్‌రైజర్స్ పేస్ అటాక్ మరింత బలంగా కనిపిస్తోంది. ఈ మూడు జట్లు తమ పేస్ బౌలింగ్ విభాగాలను పటిష్టం చేయడం ద్వారా ఐపీఎల్ 2025లో విజయవంతమైన ప్రదర్శన కోసం సిద్ధంగా ఉన్నాయి. టోర్నమెంట్‌లో ఈ జట్ల పేస్ బౌలింగ్ ఎలా ప్రభావం చూపుతుందో చూడటం ఆసక్తికరంగా ఉంటుంది.



## రోహిత్ కి మళ్ళీ కోపం తెప్పించిన జైస్వాల్!


## ఈ సారి ఏకంగా బస్సునే..



రోహిత్ శర్మ ఆవేశానికి కారణమైన ఓ సంఘటన ఇటీవల భారత క్రికెట్ జట్టులో చోటుచేసుకుంది. టీమ్ ఓపెనర్ యశస్వి జైస్వాల్ సమయానికి హోటల్ లాబీకి చేరుకోకపోవడం వల్ల, అడిలైడ్ నుంచి బ్రిస్బేన్‌కు బయలుదేరే బస్సు అతను లేకుండానే వెళ్లిపోయింది. ఈ ఘటనలో కెప్టెన్ రోహిత్ శర్మ అసహనాన్ని వ్యక్తం చేశారు. జట్టు బ్రిస్బేన్‌లో మూడో టెస్ట్ మ్యాచ్ కోసం సిద్ధమవుతుండగా, జైస్వాల్ సమయానికి హాజరుకాలేకపోవడం అనుచితమని రోహిత్ స్పష్టం చేశారు. జట్టు మొత్తం ఉదయం 8:30కు హోటల్ నుంచి బయలుదేరాల్సి ఉండగా, జైస్వాల్ దాదాపు 20 నిమిషాల తర్వాత లాబీకి చేరుకున్నాడు. అప్పటికే బస్సు విమానాశ్రయానికి బయలుదేరడంతో, అతని కోసం ప్రత్యేకంగా హోటల్ కారును ఏర్పాటు చేసి, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్‌తో కలిసి అతనిని విమానాశ్రయానికి పంపించారు. ఆలస్యం వల్ల టీమ్ మేనేజ్‌మెంట్‌తో పాటు రోహిత్ కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, ఆస్ట్రేలియాతో మూడో టెస్ట్ ప్రారంభం కానున్న వేళ, భారత జట్టు తమ ఆటతీరు మెరుగుపరచాలని ఆసక్తిగా ఉంది. అడిలైడ్ టెస్టులో పింక్ బాల్‌తో నిరాశపరిచిన బ్యాటింగ్ ప్రదర్శన తర్వాత, బ్రిస్బేన్ టెస్టులో మంచి ప్రదర్శన ద్వారా సిరీస్ ఆధిక్యం అందుకోవాలని జట్టు ఆశిస్తోంది. ఆటను గమనిస్తున్న ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ మాథ్యూ హేడెన్ కూడా భారత బ్యాటర్లు సమయానికి బాగా ఆడాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. ఇంతకు ముందు పెర్త్ టెస్టులో, మిచెల్ స్టార్క్, పాట్ కమ్మిన్స్, ట్రావిస్ హెడ్ లాంటి ఆస్ట్రేలియన్ బౌలర్లు భారత జట్టును ఉతికి ఆరేసినప్పటికీ, జస్ప్రీత్ బుమ్రా, కెఎల్ రాహుల్, విరాట్ కోహ్లీ, యశస్వి జైస్వాల్ లు సమిష్టిగా అద్భుత ప్రదర్శన కనబరిచారు. 487/6 స్కోరుతో రెండో ఇన్నింగ్స్‌లో డిక్లేర్ చేసినప్పటికీ, ఆసీస్ బౌలర్ల దాటికి భారత జట్టు 10 వికెట్లతో పరాజయం పాలైంది. దీంతో 5 మ్యాచ్ల ఈ టెస్ట్ సిరీస్ 1-1 తో సమానంగా ఉంది. బ్రిస్బేన్ టెస్టు ద్వారా తమ స్థాయిని తిరిగి నిరూపించుకోవాలని టీమ్ ఇండియా ఉవ్విళ



# హీటెక్కించేలా ఆ బ్యూటీ హాట్ సెల్ఫీ!



బాలీవుడ్ యంగ్ బ్యూటీ అలయ ఎఫ్ టెంప్టింగ్ ఎలివేషన్ల గురించి చెప్పాల్సిన పనిలేదు. అందాల ఆరబోతలో తనదైన మార్క్ వేస్తుంది. ఎప్పటికప్పుడు ఫ్యాషన్ ఎంపికల్లోనూ చూపరులను ఆకట్టుకుం టుంది. డిజైనర్స్ దుస్తుల్లో ఎలా ప్రోజెక్ట్ అవ్వాలో? పక్కాగా తెలిసిన బ్యూటీ. నలుగురిలా కాకుండా నాకో స్టైల్ ఉందంటూ రుజువు చేస్తుంటుంది. తాజాగా మరో హాట్ పిక్ కం వీడియో తో నెట్టింట్లోకి వచ్చేసింది. ఇదిగో ఇక్కడి బ్లాక్ కలర్ స్పోర్ట్స్ దుస్తుల్లో అలరించింది. లెగ్ ఎక్సరసైజ్ లు చేస్తూ తన లో బ్యూటీని సైతం హైలైట్ చేసింది. పనిలో పనిగా కెమెరా అన్ చేసి సెల్ఫీలు తీసుకుంది. ఎడమ కాలి పాదాన్ని పైకి కిందకు లిఫ్ట్ చేస్తూ థై భాగంలో కొవ్వును కరిగిస్తుంది. అమ్మడు జిమ్ వేర్స్ లో ఉన్నా? ఎంతో అందంగా ముస్తాబయ్యే ఎక్సరసైజ్ లు షురూ చేసినట్లుంది. ఇది ఎంతో కఠినమైన ట్రైనింగ్ అంటూ క్యాప్షన్ కూడా ఇచ్చింది. ప్రస్తుతం ఈ ఫోటో, వీడియో నెట్టింట వైరల్ అవుతున్నాయి. కామెంట్ బాక్సులో నెటి జనుల కామెంట్లు అంతే ఆసక్తికరం. అలయ బ్యూటీని పొగిడేస్తూ పోస్టులు పెడుతున్నారు. ఇక అమ్మడి కెరీర్ సంగతి చూస్తే... 'జవానీ జానెమాన్' చిత్రంతో బాలీవుడ్ లో అరంగేట్రం చేసిన ఆలయ తొలి ప్రయత్నంలోనే విమర్శకుల ప్రశంసలందకుంది. కొంత గ్యాప్ తర్వాత మొట్ట మొదటి మ్యూజిక్ వీడియోతో అభిమానుల ముందుకు వచ్చింది. ఇటీవల రెండు..మూడు సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చినా అవి ఆశించిన ఫలితాలు సాధించలేదు. అయినా అలయా జోరు ఏమాత్రం తగ్గలేదు. చేతినిండా అవకాశాలతో కనిపిస్తుంది.

# కత్రినా కైఫ్ 'దిల్ గులాబి' లుక్ వారెవ్వా





కత్రినా కైఫ్ దిల్ గులాబి లుక్ వారెవ్వా మల్లీశ్వరిగా ఎప్పటికీ తెలుగు వారి హృదయాల్లో నిలిచి ఉంది కత్రినా కైఫ్. ఈ భామ బాలీవుడ్‌లో అగ్ర కథానాయికగా తన హెూదాను కొనసాగిస్తోంది. ఇటీవల భారీ యాక్షన్ చిత్రాల్లో అద్భుతమైన స్టంట్స్ తో రక్తి కట్టిస్తున్న కత్రిన చివరిగా 'మెర్రీ క్రిస్మస్'లో కనిపించింది. శ్రీరామ్ రాఘవన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో విజయ్ సేతుపతితో పాటు మారియా పాత్రలో కత్రిన నటించారు. మిస్టరీ థ్రిల్లర్ కాన్సెప్ట్ తో రూపొందించిన ఈ చిత్రం మంచి ఆదరణ పొందింది. విమర్శకులు కత్రిన నటనను, క్రిస్మస్ ఈవ్ నాడు సాగే గ్రిప్పింగ్ కథాంశాన్ని ప్రశంసించారు. 2023లో సల్మాన్ ఖాన్ సరసన 'టైగర్ 3'లో కనిపించింది. ఈ చిత్రంలో షారుఖ్ ఖాన్, హృతిక్ అతిధి పాత్రలు పోషించారు. కానీ ఇది ఆశించిన విజయం సాధించలేదు.అదంతా అటుంచితే కత్రిన తదుపరి ఏ చిత్రంలో నటిస్తోంది? అన్నదానికి సరైన జవాబు లేదు. కానీ సోషల్ మీడియాల్లో నిరంతరం తన అభిమానులకు ట్రీట్ కొనసాగిస్తూనే ఉంది. శుక్రవారం కొన్ని మంత్రముగ్దులను చేసే ఫోటోగ్రాఫ్స్ తో అభిమానులను అలరించింది. వీటిలో క్రీమ్-కలర్ దుస్తుల్లో కత్రిన ఎంతో అందంగా కనిపిస్తోంది. దిల్ గులాబి (గులాబీ ఎమోజి) అని ఈ పోస్ట్‌కు క్యాప్షన్ ఇచ్చింది. కత్రినా ఒక స్టేట్‌మెంట్ రింగ్ - చెవిపోగులతో రూపాన్ని యాక్సెసరైజ్ చేసింది. కత్రిన ధరించిన ఈ డ్రెస్ ఖరీదు రూ. 1,72,818. సొగసైన డ్రెప్డ్ ఫ్లోరల్ సిల్క్ మ్యాక్సీ డ్రెస్ ఇది. అద్భుతమైన దుస్తులు దాని గులాబీ రేకులు కేప్ స్లీవ్‌ల కారణంగా షోస్టాపర్‌గా నిలిచాయి. పొడవాటి ఫ్లోవింగ్ దుస్తులు బోల్డ్ రెడ్ ఫ్లోరల్ ప్రింట్ యాక్సెంట్‌లతో లేత గోధుమరంగు లుక్ ను కలిగి ఉన్నాయి. ఇది దుస్తులు మొత్తం రూపానికి కళాత్మక నమూనాను జోడించిన సన్నని నలుపు గీతలతో ఆకట్టుకుంది. అభిమానులు ఈ ఫోటోగ్రాఫ్స్‌పై రకరకాల వ్యాఖ్యలను జోడించారు. కొందరు అందమైన అమ్మాయి..! అంటూ కత్రినను ప్రశంసించారు. ఈ దుస్తులలో స్టన్నర్ గా ఉందని, కత్రిన దేవత అని కూడా కొందరు ఫ్యాన్స్ ప్రేమను కురిపించారు. కత్రిన - విక్కీ కౌశల్ జంట ఆదర్శ జీవనం గురించి ఆసక్తికర చర్చ సాగుతోంది.



# డెనిమ్ షార్ట్ లో అందాల ఈషా

సోషల్ మీడియాలో ఎప్పుడూ చురుకుగా ఉండే నటి ఈషా రెబ్బా, తాజాగా షేర్ చేసిన ఫోటోలు మరోసారి అభిమానులను ఆకట్టుకున్నాయి. "Me and my warm mirror vibes" అంటూ క్యాప్షన్ పెట్టిన ఈ ఫోటోలు ప్రస్తుతం నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. ఫోటోల్లో ఈషా సింపుల్ టీషర్ట్, డెనిమ్ షార్ట్ ధరించి, తన ఫిట్‌నెస్ పై కృషిని స్పష్టంగా చూపిస్తున్నారు. / ఆ మధ్య జిమ్ లో వర్కౌట్స్ చేసిన తర్వాత తీసిన కొన్ని ఫొటోలు బాగా వైరల్ అయిన విషయం తెలిసిందే. ఫోటోలలో ఆమె ముఖంపై చెమట కనబడటం, ఫిట్ గా ఉండేందుకు ఆమె ఎంత కష్టపడుతున్నారో చెప్పకనే చెబుతోంది. ఇక ఇప్పుడు అమ్మడు మరోసారి ఆ రేంజ్ లో లెగ్స్ అందాలతో షాక్ అయ్యేలా స్టిల్ ఇచ్చింది. ఈషా తన అందంతో పాటు ఫిట్‌నెస్ విషయంలో కూడా ఎంతో కసరత్తులు చేస్తోంది. తెలుగు అమ్మాయి అయినప్పటికీ, తన అందంతోనూ, టాలెంట్ తోనూ ఆమె తమిళం సహా ఇతర భాషల్లో కూడా అవకాశాలు అందుకుంటోంది. వెబ్ సిరీస్ లలో నటిస్తూ కొత్త అవెన్యూస్ ను అన్వేషిస్తోంది. అయితే మంచి కాంటెంట్ ఉన్న క్యారెక్టర్ దొరికితే గ్లామరస్ పాత్రలు చేయడానికి ఇబ్బంది లేదని అమ్మడు గతంలోనే క్లారిటీ ఇచ్చింది. ఇక ఇప్పుడు ఫొటోలతో స్టన్ అయ్యేలా దర్శనమిచ్చింది. ఈషా ఆమధ్య "దయా" అనే వెబ్ సిరీస్ లో డీ గ్లామర్ లుక్ లో కనిపించి ప్రశంసలు అందుకుంది. అందులో నిండు గర్భిణిగా నటించి, తన నటనలో ఉన్న వైవిధ్యాన్ని మరోసారి నిరూపించుకుంది. ఇక ఇన్ స్టాగ్రామ్ వేదికగా ఈషా రెగ్యులర్ గా ఫోటోలను షేర్ చేస్తూ, అభిమానులను మరింత దగ్గరగా చేసుకుంటుంది. ఈ సారి న్యూ లుక్ లో ఆమె సింప్లిసిటీతో పాటు, ఫిట్‌నెస్ పై ఉన్న ప్రేమను కూడా మరోసారి నిరూపించింది.

# శివాత్మిక.. నల్లని చీరలో హీటెక్కించే అందం







టాలీవుడ్ సీనియర్ నటుడు రాజశేఖర్ కుమార్తె శివాత్మిక రాజశేఖర్ గ్లామర్ తో కూడా తనదైన శైలిలో గుర్తింపు తెచ్చుకుంటోంది. దొరసాని సినిమాతో హీరోయిన్గా ఎంట్రీ ఇచ్చిన శివాత్మిక, ఆ సినిమాలో యంగ్ హీరో ఆనంద్ దేవరకొండతో జోడీ కట్టింది. మూవీ కమర్షియల్ గా ఆశించిన రేంజ్ లో సక్సెస్ సాధించకపోయినా, శివాత్మిక తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ముఖ్యంగా ఆమె ఎక్స్ప్రెషన్స్‌కు యూత్ ఫిదా అయిపోయారు. / ఆ తర్వాత పంచతంత్రం సినిమాలో కాసేపు కనిపించి మెప్పించింది. రంగమార్తాండలో నెగిటివ్ షేడ్ ఉన్న కూతురు పాత్రలో నటించింది. కృష్ణ వంశీ దర్శకత్వంలో వచ్చిన ఆ సినిమాలో ఆమె నటన ప్రత్యేకంగా నిలిచింది. సినిమాకు పెద్ద సక్సెస్ రాలేదు కానీ శివాత్మిక నటనకు మాత్రం మంచి మార్కులు పడ్డాయి. ఇక ఆమధ్య వచ్చిన కోటబొమ్మాలి చిత్రంలో సీనియర్ నటుడు శ్రీకాంత్ సరసన నటిస్తూ మరింత క్రేజ్ సంపాదించుకుంది. తన లక్ష్యం స్టార్ హీరోయిన్ కావడం అని స్పష్టం చేసిన శివాత్మిక, విలక్షణమైన కథలలో మాత్రమే నటించేందుకు మొగ్గు చూపుతోంది. కేవలం లుక్స్ మీదే కాదు, నటనపైన కూడా ఎక్కువ ఫోకస్ చేస్తూ, ప్రాధాన్యమున్న పాత్రలకే ఓకే చెబుతోంది. అయితే సినిమాల కంటే ఎక్కువగా శివాత్మిక తన సోషల్ మీడియా యాక్టివిటీస్ వల్ల మంచి క్రేజ్ పొందుతోంది. లేటెస్ట్ ఫోటోషూట్స్, స్టైలిష్ పిక్స్ షేర్ చేస్తూ, నెటిజన్లను ఫిదా చేస్తోంది. ముఖ్యంగా ఆమె షేర్ చేస్తున్న శారీలో ఫోటోలు ట్రెండింగ్ లో ఉన్నాయి. నల్లని చీరలో ఇటీవల షేర్ చేసిన ఫోటోలలో అమ్మడు అద్దంలో చూస్తూ వయ్యారంగా కనిపించింది. బ్లౌజ్ డిజైన్ కూడా స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. ఇక ఆమె అందంపై ఫాలోవర్స్ పాజిటివ్ గా రియాక్ట్ అవుతున్నారు. మరి రాబోయే రోజుల్లో ఈ బ్యూటీకి ఎలాంటి అవకాశాలు అందుతాయో చూడాలి.

Printed Published and owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao RNI Title Code :- TELTEL12296